

వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**


సంపుటి : 24 సంచిక : 11
సెప్టెంబర్ - 2021
'ప్లవ' భాద్రపద మాసం

**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
**SAGI KAMALAKARA SHARMA**

**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
**దత్తయ్య అట్టెం**
**DATTAIAH ATTEM**

**Printed and Published by**
B. Anantha Laxmi

***Type Setting at :***
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process**
**Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.



**వివరాలకు : మేనేజర్, మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక,**
**2-2-1109/బికె - ఎల్ఐజి-10,**
**బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,**
**హైదరాబాద్ - 500 013**
**ఫోన్ : 9347971177**
**email : editormusi@gmail.com**



INTERNATIONAL STANDARD SERIAL NUMBER
**ISSN 2457-0796**




# మూసీ

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక**

**చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక**

## ఈ సంచికలో ...

### వ్యాసాలు


మూసీ సాహిత్య ధార 6
తెలుగు కథకు ఆధునిక అద్దం - ఉమ్మడి నల్లగొండ జిల్లా ... డా. కందుల శ్రీను 7
మౌలిక పరిశోధనకు నిర్వచనం మానవల్లి రామకృష్ణకవి ... డా. బోయినపల్లి ప్రభాకర్ 13
తిలక్ అభిరుచులు - అలవాట్లు .. ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు 17
మూసీ పదవినోదం - 31 ... డా. తాడేపల్లి పతంజలి 24
ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం - కరపత్రాల దోహదం ... వేల్పుకొండ వెంకటేశ్ 25
గ్రంథాంతరంగం 4 - ఆంధ్ర కవిత్వ చరిత్రము ... ఘట్టమరాజు 29
పద్య మనోహరం -22 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 34
పరిశోధన స్వరూప స్వభావాలు - 1 - ఆచార్య జి.ఎస్.మోహన్ 35
ప్రతిభామూర్తి గంగాపురం హరిహరనాథ్ ... పల్లెర్ల రామమోహన రావు 41
రత్నగర్భ తనూజుడు - కారణజన్ముడు ... డా. వొజ్జల శరత్ బాబు 43
కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 15 ... టి. లక్ష్మీనారాయణ 47
శాసనముల ద్వారా తెలుగు భాషా పరిణామము ... కీ.శే. బి.ఎన్.శాస్త్రి 51


### కవితలు


గజాననా ... డా. అయాచితం నటేశ్వర శర్మ - 5; తుకారాం అభంగం... మంత్రి శ్రీనివాస్ - 6; నమ్రతగా మాట్లాడు ... అను : కట్టా రాజమౌళి - 27; మాండూక్యోపనిషత్తు (అనువాదం) ... జక్కని వెంకటరాజం - 28; రమ్మంటున్నదందుకనే ... ఎన్. నరేశ్ చారి - 33; బడుగుల చేరవే వరలక్ష్మి ... డా. అడిగొప్పుల సదయ్య - 40; తెలంగాణ సిరిమల్లె ... డా. చీదెళ్ళ సీతాలక్ష్మి - 40; విశ్వ సప్త సంసేవితులు - డా. గన్నోజు శ్రీనివాసాచారి - 46; ఇప్పుడతను లేడు ... బాలసుధాకర్ మౌళి - 50; ముత్యాల హారాలు ... చైతన్య భారతి - 56; అదృశ్య సోపానం...డా. దామరాజు కామేశ్వరరావు- 62;


### సమీక్షలు


అస్తిత్వ పతాకలు - లొట్టపీసు పూలు కథలు ... డా. తండు కృష్ణ కౌండిన్య 53
మార్గపరిమళం - దేశి వైభవాల విభక్తి ప్రతిపత్తి ... డా. కాచాపురం దుర్గాదేవి 57
గిరిజనుల బతుకు చిత్రం 'బంజారా నానీలు'.... వి. వింధ్యవాసినీ దేవి 59
స్వీకృతి ... 61




**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**



*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

## సంపాదకీయం



వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి



స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
ఆమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**

## ఆలోచన

లోచనములు అంటే కండ్లు. సాధారణంగా మనుషులతో సహా అన్ని జీవులకు కూడా నయనములు, నేత్రములు, కన్నులు అనే పేర్లతో ఉన్న శరీర భాగాలు చూపుకోసం పనిచేస్తుంటాయి. తమ పరిమితుల్లో కొంత భాగాన్ని ఈ కండ్లతో గమనించడం ద్వారా కొన్ని కొన్ని విషయాలకు సంబంధించిన జ్ఞానాన్ని జీవులు పెంచుకునే అవకాశం ఉంది. కనిపించిన విషయాల ఆధారంగా తమ అవసరాలను పూర్తి చేసుకోవడం లేదా భయభ్రాంతులు తొలగించుకోవడం మొదలైన పనులు చేసే అవకాశం అధికంగా ఉంటుంది. అన్ని జీవులకూ ఈ విధానం కొద్ది తేడాలలో సమానంగానే కనిపిస్తూ ఉంటుంది. కొన్ని ఎక్కువ దూరాలను చూడగలుగుతాయి. కొన్ని తక్కువ దూరాలు చూస్తాయి.

మనిషికి శరీరానికి అమరి ఉన్న కన్నులే కాకుండా, ఒక వస్తువును చూసినప్పుడు నూతనమైన దానిని ఊహించే శక్తి మరొకటి కూడా ఉంటుంది. భౌతికమైన కన్నుతో చేయగలిగిన పనికన్నా ఈ ఊహాత్మక వ్యవహారానికి ఇంకా చాలా విశేషం ఉంటుంది. ఈ ప్రత్యేకమైన లోచనములు మనస్సుకు అమరి ఉంటాయి. వీటికి అస్తిత్వం ఉండదు. కాని సూక్ష్మమైన తేజస్సుతో ఇంకా చాలా ఎక్కువగా పనిచేస్తుంటాయి. ఊహాపోహలు, శీతోష్ణాలు, రాగద్వేషాలు, సుఖదుఃఖాలు వంటి అనేక అంశాలను ఈ ప్రత్యేక చక్షువుల ద్వారా గమనించగలుగుతాం. ఈ ప్రత్యేకమైన లోచనాల ద్వారా ఊహించే విధానాన్ని మనవారు **'ఆ'లోచన** అని అన్నారు. ఇదీ చూపే. సాధారణమైన చర్మచక్షువులు మూసుకొని ఏకాగ్రం చేస్తున్నా కొద్దీ స్పష్టమయ్యే చూపు ఇది. పెట్టుకున్న పేరును బట్టి అత్యంత సూక్ష్మం, అతి దూరం.. అని అర్థం అవుతున్నా .... దాన్ని అతి సాధారణార్థంలో మనం వినియోగిస్తున్నాం.

ఏ విషయాన్నైనా లోతైన చూపుతో చూస్తే అదే ఆలోచన. గుణదోషాదులను గమనించ గలిగి పర్యవసానాలను ఊహించగలిగే విధానమే ఆలోచన. మనిషికి సాధారణంగా తమ పరిమితులకు సంబంధించిన లోచనాలు, ఆలోచనలు ఉండడం సహజం. పరిమితి దాటిన దానిని ఊహించడం సాధ్యం కాదు. అందరి పరిమితులూ ఒకే రకంగా కూడా ఉండకపోవచ్చు. అందువల్ల అత్యంత సూక్ష్మమైన దానిని గూర్చి ఆలోచించడం అలవాటు చేసుకున్నప్పుడు మాత్రమే కరుడు గట్టి ఉన్న పరిమితమైన చూపు, భావజాలం ముక్కలై మూల తత్త్వంలో కలిసి పోతుంది. అటువంటి వారే సమాజానికి హితం చేసే వారు అవుతారు. మిగిలిన వారందరి హితం వెనుక ఎంతో కొంత స్వార్థభావన ఉండక తప్పదు. కాని ఈ ప్రకృతి తత్త్వం, మూల తత్త్వంలో లయం కావడానికి ప్రయత్నిస్తూ, తమ లోచనాలకు పరిమితమైన దృశ్య పదార్థాలకు క్రమంగా దూరమైన వాని ఆలోచనలే ప్రపంచానికి, విశ్వానికి శ్రేయస్సును కలిగిస్తాయి.

తాము ఆలోచిస్తున్నామనుకోవడం అహంకారం. ఆలోచించబడుతున్నా మనుకోవడం శరణాగతి. తాము ఆలోచించేవారికి శరీరం, మనస్సులు మాత్రమే పనిచేస్తూ కర్మ బంధాలతో తమకు తెలిసిన అంశాల చుట్టూ మాత్రమే జీవితం కొనసాగుతూ కనుమరుగవుతారు. ఆలోచించ బడేవారి మనస్సు సూక్ష్మమై భౌతిక స్థితిలో ఉన్న లోచనాలతో క్రమంగా అనుబంధం తగ్గించుకొని, అత్యున్నతమైన ప్రకృతి తత్త్వాన్ని అన్వేషించగలుగుతుంది. లోతైన వ్యవహారాలను ఆలోచించే అవకాశం కలిగినవానికి లోక వ్యవహార సంబంధమైన అంశాలన్నీ చిన్నవి అవుతాయి. ఆ విషయాలపై అవగాహన లేనివానికి లోకమే అత్యంత ప్రధానమై కూర్చుంటుంది. నిరంతరం లోపలి లోచనాలతో శక్తి దర్శన స్పర్శన చేస్తున్న వారు ప్రశాంతతను పొందుతారు. వారి ఆలోచనలే అసలు సమాజానికి మార్గదర్శకమవుతాయి. ప్రేరణనిస్తాయి. ఆనంద ప్రదాలవుతాయి.

# గజాననా ...!



జగములు తొల్లి నిన్ గొలిచి సాగుచునుండును సర్వపూజలన్
నిగమములందు నీ మహిమ నిండుగ కాననగున్ దయానిధీ!
సుగతులు నీ వరమ్ములయి శోభిలుచుండు నరాళికెప్పుడున్
భగణ సమాన విశ్వగణ పాలక! సత్ఫల లక్ష్యమూలకా!

భాద్రపదమ్ము నీ రుచిర భద్ర పథమ్ముగ వెల్గుచుండు, ని
ర్ణిద్రత సర్వలోకముల నిత్యము గాతువు శంకరుండవై
యద్రుల వోలె సంపదలనంతము లేని విధాన నిత్తువో
సద్రుచిలోన భక్తి నిడి చాటెదవీవు దయానిధిత్వమున్!



సిద్ధుల బుద్ధులన్ గరపు జీవన మార్గము నీ ప్రసాదమై
పద్ధతితోడ సాగగ విభాసితమయ్యె త్వదీయ పూజయే
సిద్ధులు సాధ్యులున్ సురలు జేరి తపమ్ముల నిన్ను గాంతురే
బుద్ధ సమస్త విశ్వ! మము బ్రోవుము నీ దయతోడ నిత్యమున్!

ఆకుల పూజలన్ మురిసి యగ్రిమ పూజకు నిల్తువన్న, నీ
ప్రాకట వైభవమ్ము శ్రుతిరాజితమై పఠనీయమయ్యె నీ
రాక చతుర్థినాడు భువి రంజిలజేయును వాడవాడలన్
నీకు మనోజ్ఞమిచ్చెదను నిత్యము నన్ కృప జూడుమో ప్రభూ!

వేల విధాల రూపముల విశ్వమునందున దర్శనీయమై
లీలలదేల్చు నీ మహిమ లీనుడవైతివి మానసాలలో
కేలను మ్రొక్కి నిన్ను పలు గీతుల బిల్తుము మా గృహాలలో
దేలగ జేయు సేమముల దీర్చుచు కామనలన్ గజాననా!





**డా. అయాచితం నటేశ్వర శర్మ**
హైదరాబాద్, ఫోన్ : 9440 468 557

# మూసీ సాహిత్య ధార - 36

మూసీ సాహిత్య ధార నిరంతర పరిశోధన స్రవంతి 36వ సమావేశం. పరిశోధనపై ప్రత్యేక దృష్టి సారించిన సాహిత్య ధార ఈ మాసం **'పరిశోధన అంశాలు - అధ్యాయ విభజన విధానం'** అనే అంశాన్ని ఎంపికచేసారు. ఈ విషయంపై ప్రత్యేక ప్రవేశం కలిగిన డా. కాకునూరి సూర్యనారాయణ మూర్తిగారు వక్తగా రావడం సంతోషం. వీరు ప్రసంగిస్తూ మొదటి అధ్యాయంలో పరిహరించవలసిన అంశాలను, చివరి అధ్యాయంలో ముఖ్యంగా పేర్కొనవలసిన విషయాలను గురించి వివరంగా తెలియజేసారు. వచన కవిత్వం, జానపద సాహిత్యం, కథా సాహిత్యం, నవలా సాహిత్యం వంటి ప్రక్రియల వారిగా అధ్యాయాలు ఇప్పుడు ఎలా విభజించుకోవాలి అనే అంశాలను కూలంకషంగా వివరించారు.

ఈ వేదికలో భాగంగా **మున్నం శశికుమార్** వారి స్వీయ పరిశోధన **'నిజామాబాద్ జిల్లా గేయ, వచన కవిత్వం - ఒక పరిశీలన'** మీద నిర్దేశించిన సమయంలో ప్రసంగించారు. అట్లాగే **తండా హరిష్ గౌడ్** డా. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి **'తావు'** కవితా సంపుటిపై సముచితమైన సమీక్ష చేసారు. **ముద్దాపురం నవీన్ కుమార్** చక్కని కవితా గానం చేయగా వక్తలందరు విజయవంతం చేసారు. ఈ వేదికకు పెద్దలు సీనియర్ జర్నలిస్ట్ ఉదయవర్లు, ఆచార్య జి.ఎస్.మోహన్ వంటి వారు పాల్గొని సమావేశానికి మరింత వన్నె తెచ్చారు. ఈ వేదిక పర్యవేక్షకులైన డా. సాగి కమలాకరశర్మ, డా. ఎస్. రఘు గార్లు సమీక్షించి పరిశోధక విద్యార్థులకు సూచన లందించారు.




## తుకారాం అభంగం

ఆర్తివినుము మా మాత
మూ మనోరథము నిండుకోగ
తల్లి తండ్రి బంధువు నీవే
ఆత్మ సఖా ఈ అంగడి నీవే

ప్రేమ పెంచుకుంటిమి దేవా
మా సేవ పొందపరుగున రావా
ఎటుల వినతి చేసుకొంటిమో
అటుల ఆలకించుమో దొర

తుకా పలికే దేహము
రక్త మాంస భాండము
ఆత్మ నుండు సత్యము
విఠల నీదు రూపము




**అనువాదం : మంత్రి శ్రీనివాస్**
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఉ.వి.,
ఫోన్ : 83283 33720

# తెలుగు కథకు ఆధునిక అద్దం - ఉమ్మడి నల్లగొండ జిల్లా

**డా. కందుల శ్రీను,** ప్రభుత్వ ఉపాధ్యాయులు, నల్లగొండ. ఫోన్ : 965 267 4834


**"ఏకాంశ వ్రగ్యమై స్వయం సమగ్రమైన కథాత్మక వచన ప్రక్రియ కథానిక"** అని పోరంకి దక్షిణామూర్తి గారు ప్రతిపాదించారు. అది ఎంతమాత్రం సత్యదూరం కాదనేది అందరి అభిప్రాయం. కథ, కథానిక అనే పదాలు సమాన అర్థకాలుగా వాడబడుతున్న ప్రస్తుత తరుణంలో కథ పుట్టుక దాని ఎదుగుదల దానియొక్క అవసరాన్ని, విశాలత్వాన్ని, గొప్పదనాన్ని రచయితలు ఎందరో కొనియాడారు. ఆకాశానికెత్తారు. అజరామరమైన కథలను సృష్టించి సాహితీవనాన్ని సుసంపన్నం చేశారు. కథ ప్రారంభానికి ముందు మనిషి ఆలోచన తండ్రిగా, ప్రకృతి తల్లిగా ఈ రెండు సంగమం వల్ల కథ అనే శిశువు జన్మించినదని భావించవచ్చు. మనిషి పుట్టి, మనిషి మనిషిగా, పశువు పశువుగా విడిపోయి బ్రతుకుతున్న కాలం నుండి మనిషి తనలో కలిగే భావాలను భాషగా రూపొందించుకొని బయటికి తెలియజేయడం అది మొదటి వాగ్రూపంలో మొదలై కాలక్రమేణా అది వాఙ్మయ అవతారమెత్తింది.

ప్రపంచ సాహిత్యానికి ముందే భారతదేశంలో అతి ప్రాచీనమైన వేదాలు వెలిశాయి. ఈ వేదాల్లోనే అనేక కథాబీజాలు ఉన్నట్లుగా కనిపిస్తాయి. వీటికి కొనసాగింపుగా, ఉపనిషత్తులు రామాయణ భారత పురాణేతిహాసాలు, బుద్ధుని జాతక కథలు బృహత్కథ, కథా సరిత్సాగరం, పంచతంత్ర కథలు అనేకం కథా సాహిత్యంగా రాశులుగా పోయబడ్డాయి.

పూర్వ సంస్కృత కథా సాహిత్య గ్రంథాల్లో కథలు రెండు రకాలుగా కనిపిస్తాయి. 1. మనోరంజన ప్రధానమైనవి 2. నీతి ప్రధానమైనవి. ఇవి ఇట్లు ఉండగా ప్రాచీన తెలుగు కథ నాలుగు పాయలుగా కొనసాగింది. అవి 1. గేయకథా శాఖ 2. ప్రాచీన కావ్యశాఖ 3. ప్రాచీన కథాకావ్యశాఖ 4. వచన కథాశాఖ.

ఆధునిక ప్రపంచ సాహిత్యంలో కథారచన 1832లో ప్రారంభ మైంది. అలాగే భారతదేశంలో 1872లో పురాణచంద్ర ఛటర్జీ రాసిన 'మధుమతి' మొట్టమొదటి కథగా పరిగణింపబడింది. కథాప్రస్థానంలో తొలినాళ్ళలో కథలో కథాంశం, కథాలక్షణాలు, కథ ఇన్నిపేజీల్లోనే ఉండాలి, కథ ఒక శిల్పాన్ని పాటిస్తూ నడవాలి అనే నియమాలు అంతగా లేకపోవచ్చు. అందుకే కథలో అంశమేదైనా కావొచ్చు. కానీ కొన్ని పాత్రలతోటి ఒక విషయానుసారంగా నడిచి అందలి అంశం పాఠకులకు అర్థమై హృదయానికి తాకితే చాలనేది అందరి అభిప్రాయంగా ఉండవచ్చు. తెలుగు కథ ప్రారంభంలో కూడా జరిగిందిదే. 1910లో గురజాడ అప్పారావు రాసిన దిద్దుబాటు కథే తెలుగు సాహిత్యంలో మొదటి కథ అని ఇన్నాళ్ళు అనుకుంటూ వచ్చారు. ఇలా సాహిత్యచరిత్రకారులు నిర్ధారణ చేయడానికి ఎలాంటి నియమాలను పరిగణలోనికి తీసుకున్నారో వారికే తెలియాలి. కానీ అదే దశకంలో వచ్చిన (1903) ఆచంట సాంఖ్యాయన శర్మగారి 'లలిత' కథ కూడా తెలుగులో మొదటి కథగా భావించాలని సాహిత్య విమర్శకులు కూడా సూచించారు. తొలిచూలు బిడ్డను కనేముందు నొప్పులు, నానా ఇబ్బందులు తల్లికి ఉంటాయి కదా! ఆ దృష్టితో భండారు అచ్చమాంబ 'స్త్రీవిద్య' నే మొదటి కథగా తేల్చేశారు కూడా.

వివిధ కాలాల్లో చరిత్ర తన ఆకారాన్ని మార్చుకుంటూ ముందుకు సాగుతుంది. ఆ క్రమంలోనే మానవ మనుగడలో మనిషికి సంబంధించిన అనేక విషయాల్లో మార్పు రావడం సహజం. ఆ మార్పే కొంతకాలానికి 'స్త్రీవిద్య' కథ తరువాత జరిగింది. సంగిశెట్టి శ్రీనివాస్ ఏకంగా భండారు అచ్చమాంబ రాసిన కథలన్నింటిని సేకరించి ఎంతో ఓపికగా వ్యయప్రయాసలకోర్చి గతకాల కథాచరిత్రను తిరుగులేని విధంగా తయారు చేసినాడు. తెలుగు కథాచరిత్రకు 'భండారు అచ్చమాంబ




తొలి తెలుగు కథల'ను పరిచయం చేశాడు. అచ్చమాంబ 1901లో రాసిన **'గుణవతి అగు స్త్రీ'** అను కథలను తెలుగు కథా చరిత్రలో మొదటి కథగా నిర్ధారిం చాడు. ఈ వాస్తవం మనుగడలో ఎక్కువకాలం సాగిసాగకముందే మొదటి కథ విషయంలో మరో కీలక మార్పు చోటు చేసుకుంది. అంబేద్కర్ సెంట్రల్ యూనివర్సిటీ లక్నోలో ప్రొఫెసర్గా పనిచేస్తున్న షేక్ మహబూబ్‌బాషా గారు భండారు అచ్చమాంబ 1898లో రాసిన **'ప్రేమ పరీక్షణము'** అను కథ రాయసం వెంకటశివుడి తెలుగు జనానా పత్రిక జులై సంచికలో మరియు అదే సంవత్సరం అదే దినపత్రిక సెప్టెంబర్ సంచికలో **'ఎరువు సొమ్ము పరువుచేటు'** అను కథలు ప్రచురితం అయ్యాయని అప్పటి అచ్చమాంబగారు ఆ కథల కింద తను నివసిస్తున్న ప్రాంతం బారాఘాట్ (ప్రస్తుతం మధ్యప్రదేశ్) అని వ్రాసి ఉందని పై కథల సేకరణకారుడు షేక్ మహబూబ్ బాషా




తెలియజేశాడు. ప్రస్తుతానికి చరిత్ర ఆధారాలను బట్టి ఔత్సాహిక సాహిత్య పరిశోధకుల కృషి ఫలితంగా ఎట్టకేలకు తెలుగుకథ మొదటిది **'ప్రేమ పరీక్షణము'** కథ. ఈవిధంగా రికార్డుల్లోకి ఎక్కింది.

ఇక్కడ మరో విషయం ప్రస్ఫుటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అచ్చమాంబ మునగాల పరగణా పెనుగంచిప్రోలులో జన్మించారు. నల్లగొండజిల్లా దేవరకొండవాసి అయిన మేనమామ భండారు మాధవరావుతో వివాహం జరిగింది. అప్పటినుండి నల్లగొండ జిల్లావాసిగానే పరిగణనలోకి వచ్చింది. భర్త ఉద్యోగరీత్యా దేశంలో వివిధ ప్రాంతాలు తిరగవలసివచ్చింది. అందులో భాగంగానే అచ్చమాంబ తాను రాసిన కథల కింద తన చిరునామా ఆయా ప్రదేశాల పేర్లు రాయడం జరిగింది.

అచ్చమాంబ రాసిన మొత్తం కథలు 12గా సంగిశెట్టిగారు తెరమీదికి తెచ్చారు. ఇందులో రెండు కథలు, **ప్రేమపరీక్షణము, ఎరువుసొమ్ము పరువుచేటు** లతో పాటు, 1. గుణవతియగు స్త్రీ 2. లలితా శారదలు 3 జానకమ్మ 4. దంపతుల ప్రథమ కలహం 5. సత్పాత్రదానము 6. స్త్రీ విద్య 7. ధనత్రయోదశి 8. భార్యాభర్తల సంవాదం 9. అద్దమును సత్యవతియును 10. బీద కుటుంబం చెప్పబడుతున్నాయి.


ఎటునుంచి ఎటొచ్చినా తెలుగు సాహిత్యంలో ప్రేమ పరీక్షణము అను కథకు మొదటిస్థానం దక్కడమే కాకుండా మొదటి కథకు ఆరంభకేంద్రం నల్లగొండ జిల్లానే అనే స్థిర అభిప్రాయానికి రావడం జరిగింది.

నల్లగొండ జిల్లా స్థానిక సమస్యలైన సాంఘిక దురాచారాలు, తెలంగాణ సాయుధపోరాటం, పేదరికం, నిరక్షరాస్యత, భూసమస్య, వెట్టిచాకిరి, చాలీచాలని వ్యవసాయం, అణచివేత, బాల్యవివాహాలు, నిరాదరణకు గురైన స్త్రీ విద్య, మూఢాచారాలు, దళితులపై చిన్నచూపు, ఫ్లోరోసిస్ వ్యాధిపీడన, ప్రపంచీకరణ వల్ల ధ్వంసమైన మానవ సంబంధాలు మొదలైన విషయాలు ఎంతోమంది రచయితలకు స్ఫూర్తినిచ్చి ఉత్తమ కథలు రాయడానికి ఉత్ప్రేరకాలైనాయి. ఈ నేపథ్యంలోనే తెలుగు సాహిత్యంలో నల్లగొండ జిల్లా నుంచి కథలు వెలువడ్డాయి. **"ఒక జాతి జీవన స్థితిగతులు, ఆచార వ్యవహారాలు, మెరుగైన జీవితం కోసం చేసిన పోరాటాలు, వాటిద్వారా సాధించిన ఫలితాలు సాహిత్యంలో ప్రతిఫలించిననాడు వాటికి శాశ్వతత్వం ఏర్పడుతుంది"** అని సంగిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నాడు. తెలుగు కథకు భావప్రభావాలు ఎక్కడివైనా, కథానిర్మాణం, రచనా పద్ధతి వంటి వాటిలో స్థానిక పరంపరకు చెందిన అంశాల ప్రమేయం కూడా తప్పకుండా ఉంటుంది.

తొలినాటి తెలుగు కథలన్నింటిలో సంవాద సంభాషణా ధోరణి అధికంగా కనిపిస్తుంది. అచ్చమాంబ కథలన్నీ కూడా ఆ మార్గంలోనే నడిచాయి. తరువాత ఆమె సోదరుడు కొమర్రాజు లక్ష్మణరావు **'యాబదివేల బేరము'** కథ 1910లో రాశాడు. 1912లో శేషభట్టర్ వెంకట రామనర్సింహారావు **'నైజగుణం'** కథ ప్రచురితమైంది. నల్లగొండ జిల్లాలో విస్తృతంగా కథాసాహిత్యం రావడానికి ఇక్కడ విరివిగా వెలువడిన పత్రికలు కూడా దోహదపడ్డాయి. పత్రికలు కథల ప్రచురణకు పూనుకోవడం వల్ల కథారచయితలకు ఎక్కువ సంఖ్యలో కథలు రాసే అవకాశం కలిసొచ్చింది.

నల్లగొండలో షబ్నవీసు వెంకట నరసింహారావు 1922 ఆగస్టు 24న నీలగిరి వారపత్రికను ప్రారంభించాడు. రేపాలలో కె.యల్.యన్.రావు 1942లో వెలువరించిన గ్రామవెలుగు పత్రిక, హుజూర్‌నగర్‌లో కె.వి.రెడ్డి 1970లో మొదలుపెట్టిన నాగార్జునవాణి పత్రిక, పెరికె రాజారత్నం 1972లో 'తొలివెలుగు' వారపత్రిక, కొమర్రాజు మురళీధరరావు 1972లో 'ప్రతిధ్వని' పత్రిక నల్లగొండ నుంచి వచ్చాయి. మిర్యాలగూడ నుంచి జయిని ఆది నారాయణగుప్త 1970–80 మధ్యకాలంలో 'విశ్వాభ్యుదయం' పత్రికను నడిపాడు. అంతేకాకుండా 1975లో 'థాట్స్ ఆఫ్ యూత్' మిర్యాలగూడ నుంచే వచ్చింది. వున్న యల్లప్ప రామన్నపేట నుంచి 1980లో 'భగ్నభేరి' పత్రికను, సూర్యాపేటనుండి దేవులపల్లి ప్రభాకరరావు 1980లో 'తేజోప్రభ' పక్షపత్రికను, మిర్యాలగూడ నుంచి సూలూరు శివసుబ్రహ్మణ్యంగారు 1980–90లలో 'సాహితీమిత్ర' మాసపత్రికను నడిపారు.

నల్లగొండ వాసి అయిన బి.యన్.శాస్త్రి హైదరాబాద్ నుంచి 'మూసీ' మాసపత్రికను, మిర్యాలగూడ నుంచి వసంతరాయ్ 1982లో 'ప్రపంచశాంతి' పత్రికను, నల్లగొండలో జగన్‌మోహన్‌రావు 1983లో 'ప్రజాపోరాటం' దినపత్రికను స్థాపించినారు. నల్లగొండలో యువరచయితల సమితి ఆధ్వర్యంలో 1983లో 'దర్పణం' పత్రిక వెలువడింది. మిర్యాలగూడ నుంచి చెన్నూరు నాగరాజు 1985లో




'విపంచి' పత్రికను, నల్లగొండ నుంచి పి.వి.బి.రాజు 1985లో షాడో పత్రిక, అదేవిధంగా నల్లగొండ నుంచి యూసుఫ్‌బాబు 1987లో ప్రజాపోరు దినపత్రికలు ప్రారంభించారు. పైన చెప్పిన పెద్ద పత్రికలే కాకుండా ఎన్నో చిన్నపత్రికలు కూడా కథా ప్రక్రియను ఎంతగానో ప్రోత్సహించాయి. అదేవిధంగా నల్లగొండలో స్థాపించబడిన సాహిత్య సంస్థలు కూడా కథారచన చైతన్యానికి కారణమయ్యాయి. తెలుగు భాషాసంస్కృతుల వికాసానికి సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం ఏర్పడ్డ సాహిత్య సంస్థ సాహితీమేఖల. దీన్ని 1934లో అంబడిపూడి వెంకటరత్నం శాస్త్రి ఈ సంస్థను చండూర్‌లో స్థాపించారు. చండూరు ప్రాంతంలో సాహిత్య చైతన్యానికి ఎంతగానో కృషి చేసింది. రేపాలలో ధవళా శ్రీనివాసరావు 1942లో 'గ్రామవెలుగు' అనే సాహితీ సంస్థను నల్లగొండలో 1945లో 'నీలగిరి సారస్వత సమితి'ని సూర్యాపేటలో 1948లో 'జనతా కళా మండలి'ని నల్లగొండలో 1970–80లలో 'యువరచయితల సమితి'ని ఏర్పాటు చేశారు. ఇవేకాక ఇంకా కాంచనపల్లి చిన వెంకటరామారావుగారి ఆధ్వర్యంలో 1983లో 'జిల్లా రచయితల సమితి' నెలకొల్పబడింది. ఈ సంఘం తరపున కాంచనపల్లి స్మారక జిల్లా రచయితల మహాసభలు రెండురోజుల పాటు జిల్లాకేంద్రంలో జరిగాయి. ఈ సందర్భంలో డా. నోముల సత్యనారాయణ, డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి, యన్.కె. రామారావుల సంపాదకత్వంలో కాంచనపల్లి స్మారక ప్రత్యేక సంచిక వెలువడింది. ఇలా ఇంకెన్నో సాహిత్యసంస్థల ప్రోత్సాహంతో జిల్లాలో కథా చైతన్యం వెల్లివిరిసింది.

నల్లగొండ జిల్లా నుంచి తొలిదశలో రాయబడిన కొన్ని కథలు ఇటీవల దొరికినా, మరికొన్ని అలభ్యంగానే ఉన్నాయి. దొరికిన కథల వివరాలను ఇక్కడ పొందుపరచడం జరిగింది. బాల్యవివాహాలను నిరసిస్తూ షబ్నవీస్ వెంకటరామ నరసింహారావు 1921లో 'బాలికా విలాపం', 'స్వయంవరం' అను కథలను వెలువరించాడు. కోదాటి శ్రీనివాసరావు 'నా కల' కథ 1925లో తెలుగు పత్రికలో అచ్చయింది. 1926–30 మధ్యన బి. వెంకోబరావు కళంకము, హృదయ పరివర్తనము, భ్రమరం కాదు భ్రమ, ఇరువురి పాపఫలము, పూర్ణిమ, మత్సర పిశాచము, దేవదాసి, పందెము, అభిశాపము మొదలైన కథలు రాశాడు. ఇవి సుజాత, దేశబంధు పత్రికల్లో వచ్చాయి. 1927లో కె. రాములు రాసిన చారిత్రక కథ విపరీత సాహసము, నీలగిరి పత్రికలో వచ్చింది. 1927లో యౌనవభ్రాంతి అను కథను కట్టంగూరి నరసింహారెడ్డి రచించినాడు. 1933లో బి.యన్.రెడ్డి స్వప్న మాధుర్యం కథను రాశాడు. మూటువూరి వేంకటేశ్వరరావు 'నారదుని యాత్ర' పేరిట జగడాల కథ, 1935లో గోల్కొండ పత్రికలో అచ్చయింది. తెలంగాణలో నిజాం రాష్ట్రంలో ఆంధ్రమహాసభలు ఊపందుకొని రాజకీయ చైతన్యం వెల్లివిరిస్తున్న తరుణమది. 1935లో శ్రీరంగాచార్యులు కొని కథలు రాశాడు. కానీ అవి అలభ్యం. 1936లో ధరణికోట శ్రీనివాసులు 'చల్లపులుసు' కథ, కనకం కథలు, అన్నంలోకి, మా ఇంట్లో, పురానా ఘురానా అను కథాసంపుటాలను తెరపైకి తెచ్చాడు. నల్లగొండ బ్రతుకులను అక్షరాల్లో బంధించాడు.

1909లో పుట్టిన యస్.బి. సీతారామారావు 1939లో రాసిన 'గరీబోన్ని' కథ తెలంగాణ భాషలో రాయబడింది. 1940లో కమ్మతెమ్మెరలు కథా సంకలనంలో చెరకుపల్లి హరికృష్ణారావు 'పల్లెబడి' కథ చెరుకుపల్లి రఘోత్తమరావు 'కోవిల్లో' కథలు ముద్రణకు నోచుకున్నాయి. 1940లో 'మణి' అనే కథను అంబడిపూడి వెంకటరత్నం వెలువరించాడు. ఇదే ఏడాది గాలి రామచంద్రయ్య స్వర్గసుఖం, దుస్సంప్రదాయ సమిధలు, స్వామి కటాక్షం కథలను తీసుకొచ్చాడు. సమాజంలోని వివిధ సమస్యలపై అనేక కథలను ఆ తరువాత కాలంలో మంత్రిప్రగడ వెంకటేశ్వరరావు, కోదాటి శ్రీనివాసులు పి.బి.ఆచార్య, దామిడి రంగారెడ్డి, ఉన్నవ వెంకటరామయ్య అనేవారు రాశారు. ఆంధ్రకేసరి పత్రికలో 'అప్పు' అనే కథ ప్రచురించబడింది. గోపాల్‌రెడ్డిగారు దానిని రాశారు. 1940 ప్రాంతంలో జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ ప్రభావంతో రావి నారాయణరెడ్డి నేతృత్వంలో భువనగిరిలో జరిగిన ఆంధ్రమహాసభ తెలంగాణలో అత్యంత కీలకమైన మార్పులకు కేంద్రమైంది. 1941లో అజ్మతుల్లా సయ్యద్ 'గప్‌చుప్'ను వెలువరించాడు. కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ స్ఫూర్తితో వట్టికోట ఆళ్వారుస్వామి 1944లో 'చిన్నప్పుడే' అను కథతో తను రచయితగా అవతారం ఎత్తాడు. కాంచనపల్లి చిన వెంకటరామారావు 'మనవూళ్ళో కూడానా' అనే కథా సంపుటిని ఆ మధ్యకాలంలోనే వెలువరించాడు. పేదల బతుకులకు, జమీందారుల ఆగడాలకు అద్దంపట్టిన కథలుగా నిలబడ్డాయి అవి.

బూర్గుల రంగనాథరావు 1945లో నల్లగొండ నుంచి మొదటి కథా సంకలనం 'ఉషస్సు'ను తెచ్చి కథా సంకలనాలకు అంకురార్పణ గావించాడు. మిర్యాలగూడకు చెందిన వేనేపల్లి ఆంజనేయులు 'పాడియావు' అను కథను రచించాడు.

సూర్యాపేటకు చెందిన ఆవులపిచ్చయ్య రైతాంగ సాయుధ పోరాటంలో స్వయంగా పాల్గొని ఆ అనుభవాలతోటి కథలు రాసి ఆనాటి సంఘటనల్ని చిత్రిక కట్టాడు.







పిచ్చయ్య రాసిన కథలు "ఈతగింజ ఇచ్చి తాటిగింజలాగిన జమీందారు", ఊరేగింపులు, చపరాసి దినచర్య, వెట్టిచాకలి దినచర్య, దౌరా మొదలైనవాటిని 'ఆవుల పిచ్చయ్య కథల సంపుటి'గా వెలుగులోకి తీసుకువచ్చాడు సంగిశెట్టి శ్రీనివాస్. లింగగిరికి చెందిన సి.వి.కృష్ణారావు నోటీసు, గీయని అక్షాంక్షరేఖ కథలు రాశాడు. ధవళా శ్రీనివాసరావు గొప్ప రచయితగా పేరు గడించారు. 'నేను ఏడ్పుమానలేదు' అను కథ ఆయనదే. పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా మేళ్ళచెరువులో జన్మించాడు. ఆయన అనేక కథా సంపుటాలు వెలువరించాడు. 1949లో నూగురు రంగాచార్యులు బీసం రాములు కొన్నికథలు రాసినట్టుగా తెలుస్తుంది. 1950లో 'పుట్టుమచ్చ' కథలో పాటు జ్ఞానస్రవంతి, మూడు వాక్చిత్రాలు, పుల్లాభొట్ల కథలు, పిన్ని చాలామంచిది, వెన్నెల కిరణాలు, క్రాస్డ్ చెక్ వంటి కథా సంపుటాలు పూల్లాభొట్ల వెంకటేశ్వర్లు వెలువరించాడు. ఆయన మధ్యతరగతి జీవితాలను కథలుగా ఎన్నుకున్నాడు. 1952లో జైలులోపల కథా సంపుటిని వట్టికోట ఆళ్వారుస్వామి తీసుకొచ్చాడు. బడుగుజీవుల వ్యథలను తెలంగాణ ముఖచిత్రాన్ని ప్రతిబింబించేలా కథలను రచించాడు. నిరంతరం సాహిత్యసేవకే తన జీవితాన్ని ధారపోశాడు. 1948లోనే కోదాటి లక్ష్మీనరసింహరావుది 'అమరవీరుడు' కథ విశాలాంధ్రలో అచ్చయ్యింది. తరువాత 1953లో 'శాంతి ప్రకటనలు' కథ రాశాడు. ఆనాటి రాజకీయాలను తన కథల్లో ఇనుమడింప జేశాడు. తన కథలన్నింటినీ 'చీకటి దొరలు' పేరున సంపుటీకరించా లని నా ప్రయత్నం విఫలమైంది.


పైడిమర్రి వెంకటసుబ్బారావు రాజులు (1951), పిల్లిపోడు (1953), బడిగంటలు (1953), నౌకరి (1956) అను కథలను రాశాడు. బుద్ధవరపు వెంకటరత్నం 1954లో మన్నెం పడుచు కథను రాశాడు. అలాగే నిఖిలేశ్వర్ 1961 నుండి కథలు రాస్తున్నాడు. ఆ కథలు అన్ని 'నిఖిలేశ్వర్ కథలు' పేరిట ఒక సంపుటికి వచ్చింది. మండల్‌రెడ్డి కొండల్‌రెడ్డి 1962లో 'మూసిన తలుపులు' కథను పరిచయం చేశాడు. 1963లో ఓరుగంటి పురుషోత్తం అందగత్తె కథను వెలువరించాడు. నల్లగొండ కథను కొంతపుంతలు తొక్కించిన ముక్తవరం పార్థసారథి ఉమ్మడి నల్లగొండజిల్లా భువనగిరికి చెందినవాడు. ఆయన మొదటి కథ 1965లో 'చిట్టి ఏడుపు' వచ్చింది. ఆ తరువాత 2002లో మిణుగురులుగా పుస్తకరూపం ధరించింది. నటువ వెంకటయ్య 1968లో 'రామలక్ష్మి' అను కథను రాశాడు. అదే సంవత్సరంలో ధరణికోట సమీర్‌కుమార్ 'ఆడుమారిండు' కథ ముద్రణకు నోచుకుంది. పంతంగి లక్ష్మీకాంతం 1968లో మెల్టింగ్ మైండ్, కన్నీళ్లలో కరుణ, వ్యథిత హృదయం, చెదరని మమతలు, పసిడి హృదయం మొదలైన కథలను ఒక వరుసలో రాసుకుంటూ పోయి మంచి కథకుడిగా గుర్తింపు పొందాడు. 1968లో కొండపల్లి వెంకట శేషగిరిరావు సంసార సాగరం కథను రచించాడు. 1968 లోనే మేరెడ్డి యాదగిరిరెడ్డి రాసిన 'నారాయణరావు' కథ అత్యంత మన్ననలు పొందింది.


1970 ప్రాంతంలో స్థాపించబడిన యువరచయితల సమితి తరఫున దర్పణం, మాలిక, సమర్పణ కథా సంకలనాలు వెలువరించడమే కాకుండా దాని తరఫున 'దర్పణం' పత్రికను కూడా తీసుకొచ్చి ఎందరో యువరచయితలను ప్రోత్సహించారు. ఈ కాలంలో కోలాహలం లక్ష్మణరావు 25 పైగా నవలలు రాశాడు. ఎన్నో కథలను రాసినా కూడా అంతంగా మంచి కథకుడిగా గుర్తింపు రాలేదు. నవలాకారుడిగానే గుర్తింపు వచ్చింది. 1970లో టెర్లిన్ చీర, దారితప్పిన బాటసారి కథలలో వెలుగులోకి వచ్చి యన్.కె. రామారావు 'విద్యుల్లత' పేరిట కథా సంపుటిని తీసుకొచ్చాడు. ధనిక పేద కులాల ప్రేమాగ్ని రేపిన సంఘర్షణలు, న్యాయస్థానాల తీర్పు నిజస్వరూపాలు తన కథల్లో కళ్ళముందుంచాడు. మూటుపూరి కృష్ణమూరి 'తప్పు' కథ వచ్చింది కూడా అప్పుడే. అదేకాలంలో మేరెడ్డి యాదగిరి రెడ్డి చావుకోసం, ఓటన్న మొదలగు కథలతో కలిపి 2004లో మట్టికథలు అనే కథాసంపుటిని వెలువరించాడు. 'కొలిమి' అనే కథాసంపుటిని తీసుకొచ్చాడు. రాహుల్ రాజ్యంలో రాజ్యం చచ్చింది, నిర్మల్ సమాధులపై పునాదులు, శ్రీకాంతి 'నీడలో దాగిన నిజం', అలుగుబెల్లి రాంచంద్రారెడ్డి 'విషం కక్కిన సంస్కారం', బోయినపల్లి కిషన్‌రావు 'తీరని కోరికలు', విద్వాన్ నాగం 'అధిక+అరి', యం. కృష్ణమూర్తి 'ఎన్నికలరోజు', ఆగ్నేయ 'ఒక గుమాస్తా కథ', కాంచనపల్లి వెంకట కిషన్‌రావు 'ఉపమానం - ఉపమేయం', 'చిలుకజోస్యం', 'శోభనపు రాత్రి మొదలగు కథలను వెలువరించాడు.

కొలనుపాక మురళీధరరావు 1971లో 'బంధుప్రీతి' కథను రాశాడు. విప్లవకెరటం చెరబండరాజు 'చిరంజీవి' అను కథను రాశాడు. తెలంగాణ సాయుధ పోరాట జ్యోతి బి.యన్.రెడ్డి 1972లో 'ఆయువుపట్టు' కథను వెలువరించాడు. ఆ కథ అత్యంత ప్రజాదరణ పొందింది.

దేవులపల్లి శ్యాంసుందర్‌రావు 1972లో రాసిన మనసు ఆంతర్యం కథ మొదలు వివిధ కాలాల్లో రచించిన కథలు మొత్తం కలిపి సంఘర్షణ, గూడు దొరకని పిట్ట అనే కథా సంపుటాలుగా వెలుగులోకి వచ్చాయి. నల్లగొండ కథా వృక్షమునకు మొదలులాంటివాడు బోయ జంగయ్య. 1973లో వెలువరించిన 'లోకం' థాసంపుటి కాగా ఆ తరువాత కాలాల్లో బొమ్మలు, అడవిపూలు, గొర్రెలు, చీమలు, తెలంగాణ వెతలు, కొత్త పాఠాలు, బోజ కథలు, ఉప్పునీరు, ఇప్పపూలు మొదలైన సంపుటాలను తీసుకొచ్చాడు. దళితులు జీవితాలను తెలంగాణ సాయుధపోరాట కాల స్మృతులను, దౌర్జన్యానికి బలైన బానిస బతుకులను తన కథల్లో చిత్రించాడు. కే.వాసు 1974లో రంగు వెలిసిన త్రికోణం, పి. సుదర్శన్ అదేకాలంలో 'అప్పుకోసం', చెన్నూరి నాగరాజు 'పిచ్చి' అనే కథతో పాటు 'ముళ్ళగులాబి' అను కథా సంపుటిని తీసుకొచ్చాడు. నాగం మల్లారెడ్డి 'నాగం కథలు'గా సంపుటీకరించబడింది. శేషు వి. కథలు 1974లో చందన, 1975లో భార్యోపహతుడు రాగా ఇంకా మరికొన్ని కథలు కలిపి శేషవాక్యంగా ఒక పుస్తకం వచ్చింది. 1976లో నిర్మల్ 'ఓ మామూలు మనిషి కథ', మూటుపూరి కృష్ణమూర్తి 'మల్లీశ్వరీ – మల్లెపూలు', బి. రాములు 'వ్యత్యాసాలు', విద్వాన్ యానాల 'ఆవిడ భర్త పెళ్ళి', కొల్లు మధుసూదన్ రావు 'మోసం', 'దారి తప్పితే', కొత్ర మల్లికార్జునశర్మ 'నాగరికం', 'రైలుపెట్టె', దేవులపల్లి వెంకట ప్రభాకరరావు 'నాకొద్దు మంత్రి పదవి', ఇంకా భద్రసేనా, కాశావజ్ఝల వెంకట నరసింహమూర్తి ఈ కాలంలో కథానికలు వెలువరించారు. తెలంగాన యాసలో కథలల్లిన దేవరాజు మహారాజు 1977లో 'కడుపుకోత' కథల సంపుటి, 1991లో బి. విద్యాసాగర్‌తో కలిసి 'పాలు ఎర్రబడ్డాయి', 1993లో దేవరాజు మహారాజు' కథలు పేరిట కథాపుస్తకాలు ప్రచురించాడు. కే. శ్రీనివాస్ కూడా అనేక కథలు రాశాడు. కానీ అవి ఇప్పుడు అందుబాటులో లేవు. సుంకిరెడ్డి నారాయణరెడ్డి నాగావళి పేరుతో 1987లో 'రెండుగా చీలిన మాట' కథను రాశాడు. అదే సంవత్సరంలో యస్.యస్. రాహుల్ 'ఒకే గూటి పక్షులు' కథను వెలువరించాడు.

1988 నుండి కథలు రాస్తున్న పుప్పాల కృష్ణమూర్తి 1993లో 'జీవితచిత్రం' పేరిట కథాసంపుటి తీసుకొచ్చాడు. ఇంకా 'విష వలయం', 'పిట్టగూడు', 'నసిరుద్దీన్ కథలు', 'స్వేచ్ఛా సౌందర్యం' అనునవి కూడా రచించాడు. 1989లో సగటు మనిషి భావాలను నల్లగొండ జీవిత అనుభవాలను అక్షరీకరించి 'శిలువకు తొడిగిన మొగ్గ', ఆ తరువాత ఎల్లమ్మ కథా సంపుటి ద్వారా అందరి ముందుకు వచ్చిన కథకుడు కాసుల ప్రతాపరెడ్డి. 1990లో వివక్షతో మంచి కథకుడిగా పరియమైన పి. చిన్నయ్య నల్లగొండ గోసను తన 'పయిలం' కథా సంపుటితో తెలియజేశాడు. కందాలగిరిలక్ష్మీ ఎన్నో కథలు రాశారు. జి. రేణుకాదేవి భావుకత, విద్దూరపు మనిషి, సంకెల, మొగ్గప్రపంచం, పురిటినొప్పులేనయం, మార్పు ఎవరిలో,





అమ్మకోసం, అమ్మ మనసు, తెల్లారబోతోంది వంటి కథలు వెలువరించింది. డి. కల్పన సినిమాకు టైం అయ్యింది, కలవని మగ్గం పోగులు మొదలైన కథలు రాసింది. డా. సిరి బాలలకు సంబంధించిన అనేక కథలను వెలువరించింది. యస్.కే. రూపిన్ 7వ తరగతి అమ్మాయి దొడ్డి రామ్మూర్తి ప్రోత్సాహంతో 25 కథలను రాసింది. ముక్కాల రత్నమాంబ 'నూతన' పత్రికను నడిపి 'ముగింపు', భార్య కథలను రాసింది. తర్వాత కాలంలో వనం సావిత్రినాథ్ అనేక కథలను వెలువరించారు. అలాగే కోటమర్తి హిమబిందు రెండువారాలు, ఏడాదికోరోజు, మనసున మనసై, అనుభవం, ఎడ్జస్ట్‌మెంట్, చతుర్థి పండుగ, సన్మానం, శలవా... శలవు..., చుక్కల్లో పెద్దచుక్క అను కథలను తీసుకొచ్చింది.

నన్నూరి సత్తిరెడ్డి 1993లో వాగొచ్చింది, పోస్టు వచ్చింది కథలు వెలువరించాడు. అలాగే వి.ఆర్.నన్నూరి 1996లో పైరు, గడి, పట్నం బాబులు లాంటి కథలు తీసుకొచ్చాడు. కొప్పరపు జ్యోతి 1996లో 'మరక' అనే కథను రాసింది. వివిధ పరిస్థితుల్లో మనిషి ప్రవర్తించే వికృత స్వభావాలతో కూడిన చేష్టలను కథల రూపంలో తెలియజేసిన కథకురాలు ముదిగంటి సుజాతారెడ్డి. 1977లో 'కబ్జా' కథ రాయగా అటు తరువాత 'విసుర్రాయి', మింగుతున్న పట్నం, వ్యాపార మృగం వంటి కథాసంపుటాలు తీసుకొచ్చింది. 1988లో ఎం. వెంకట్ 'వలెక్కం' కథను రాశాడు.

ముస్లింల జీవితాలను దుర్భర దారిద్ర్యాలను కలిపి 1999లో 'సిల్‌సిలా' కథను రచించింది. అలాగే 2000లో గౌస్ మొహియుద్దీన్ 'గుంగీ దద్కన్', సైబాబా కథలు 'చోటీ బహెన్', 'ఖిబ్లా' కథలు వచ్చాయి. ఆక్సిజన్‌బార్, నెమలీక కథాసంపుటాలో జీవచ్ఛవంలా ఉన్న నల్లగొండ అణగారిన బతుకులకు భాషకు ఊపిరిపోసింది తెలిదేవర భానుమూర్తి. అదే వరవడిలో అవే కథాంశాలలో లోతైన విశ్లేషణతో కథలను అల్లి 'పేగుబంధం' కథాసంపుటిగా తీసుకొచ్చాడు బోధనం నర్సిరెడ్డి. పగడాల నాగేందర్ 2001లో 'ఉసురు' అనే కథను వెలువరించాడు. అలీ 2001లో 'హరేక్‌మాల్' కథల సంపుటి తీసుకొచ్చాడు. మందడి కృష్ణారెడ్డి 2001లో 'మారని సమాజం'

కథను రాయగా ఆ తరువాత ఆయన రాసిన కథలను 'మందడి కథలు'గా సంపుటీకరించబడ్డాయి.

యెన్నం ఉపేందర్ 2002లో 'రేషన్‌కార్డు' 'బయటకి వచ్చింది' తన కథలను మొత్తంగా 'ఎండమావి' పేరిట ఒక సంపుటిగా తీసుకొచ్చాడు. పల్లె హృదయాలను పట్టుకున్నాడు. అతి సున్నితమైన అంశాలను అక్షరీకరించాడు. 2002లో జి. అనసూయ ఉత్త(మ) ఉపాధ్యాయుడు, పనిపిల్ల కథలు రాశాడు. ఆ తరువాత ఆమె 'నిశబ్దచిత్రాలు'గా సంపుటిని తెచ్చారు. దళితుల జీవితాలను 2002లో 'బొండిగి' కథా సంపుటి ద్వారా వెలుగులోకి తెచ్చాడు దొడ్డి రామ్మూర్తి. వేణు సంకోజుది 2003లో మొరం కథ వచ్చింది. ఆ తరువాత 'స్పర్శ' అనే కథా సంపుటిగా ముద్రణకు నోచుకుంది. కొలనుపాక మురళీధరరావు 2003లో 'ఇరుసు విరిగిన బండి' అను కథను వెలువరించాడు. అటు తరువాత 'అష్టాదశ కథానికలు'గా ఆయన కథలన్నీ ఒక సంపుటిరూపంలో బయటకి వచ్చింది.

ముస్లిం కథా సంకలనాలలో చెప్పుకోదగ్గ కథలు స్కైబాబా సంపాదకత్వంలో 'వతన్' అనే కథా సంకలనం 2004లో నల్లగొండ వాకిట వెలుగుచూసింది. 2011లో 'అధూరే', 2015లో 'అలాయ్‌బలాయ్' మరియు 'బేచారే కథలు' స్కైబాబావి సంపుటాలుగా వచ్చాయి. కరుణ గారిది 'కవులమ్మ ఆడదేనా', పులిపాటి గురుస్వామి 'ఐటికప్పు, పూటకూళ్ళ ఇళ్ళు, ఒకటి రెండు మూడు, బొమ్మా బొరుసు, మట్టిబొమ్మ, సమిధ, అవినీతికి అటుఇటూ, పాల నలుపు, కాష్టం కథలొచ్చాయి. ఎలికట్టె శంకర్రావు తన కథలన్ని తెలంగాణ యాసలో రాస్తూ తెలంగాణ పల్లెలను చిత్రిస్తూ 2005లో 'జారుడుబండ' కథా సంపుటిని తీసుకొచ్చాడు. ఆ తరువాత ఉనికిపాట్లు, దుబ్బ చెలక, పరిగెచేను అను మూడు కథా సంపుటాలు తీసుకొచ్చాడు. జీవచ్ఛవాలు, ఈత కథలు 2006లో పి. చిన్నయ్య రాయగా, అరుణతార పత్రికలో ముద్రితమయ్యాయి.

ఎలికట్టె శంకర్రావు సంకలనం చేసిన నల్లగొండ కథలు గ్రంథంలో చిత్రంప్రసాద్ రాసిన 'పల్లేరు గాయాలు' కథ చోటు చేసుకుంది. 'జమిలి' కథ మాళావత్ బాలాజిది కూడా అందులోనే ముద్రితమైంది. 2008లో పి. చిన్నయ్య కథ శివార్లల్ల, మేరెడ్డి యాదగిరి రెడ్డి కథ సెజ్‌లు వచ్చాయి. 2009లో పున్న అంజయ్య పగ కథ బయటికి వచ్చింది. శిరంశెట్టి కాంతారావు ఊత కర్రలు కథా సంపుటిని 2021లో నల్లగొండ కథా ప్రస్థానానికి పరిచయం చేశాడు. 2010లో కథలగూడు, 2014లో తారుమారు, 2016లో యక్షగానం మొదలైన సంపుటాలు తీశాడు. గుడిపాటి 'గది', పి. చిన్నయ్య 'పంపకాలు', వేణు సంకోజు 'అమ్మవాసన', తెలిదేవర భానుమూర్తి 'ఆడపిట్టలున్నాయా', యెన్నం ఉపేందర్ 'మా నాయన కాని నాయన', కొలనుపాక మురళీధరరావు 'చిలకల దండ', పెండెం జగదీష్ 'కన్నీటి బొట్టు', రమేష్ హజారి 'వాన కురిసిన రాత్రి' కథలు ఓ ప్రవాహంలా దూసుకొచ్చాఇయ. అదే ఊపులో మరికొంతమంది కథలను వెలువరించాదరు. వారిలో పిట్టల శ్రీను వెలి, కందుకూరి దుర్గాప్రసాద్ 'దేవుళ్ళు', కాంచనపల్లి రమేష్‌బాబు 'ఏకాంబరం కొన ఊపిరి', బండారు శంకర్ 'కాల్వకిందికి' అంబటి వెంకన్న 'ఆనొస్తే – చెరువేది', పెరుమాళ్ళ ఆనంద్ 'చివరికి', మండలస్వామి చైతన్య 'సైనికుడు', వసంతరాయ్ 'మాయలేడి', 'కంచర్ల సత్యపాల్ రెడ్డి 'ఓ సిన్నోడి కథ' అలాగే 'అవిటి కథలు' అను సంకలనాన్ని 2013లో వేముల యల్లయ్య శంకర్ సంపంగిలు కలిసి దీనిని తీసుకొచ్చారు. 2014లో 'బండ్లబాట' అను కథను ఏనుగు నర్సింహారెడ్డి రాశాడు. అదే సంవత్సరం కోట్ల వనజత 'ఇత్తు' కథా సంపుటిని అచ్చువేశారు. 2014లోనే 'అబ్కారి కథలు' అను సంపుటిని నిర్మల్ వేశాడు. ఈ కథలన్నీ ఉమ్మడి నల్లగొండ జిల్లా కథల రాశిలో కలిశాయి.

2015లో మనిషి కథలు కథాసంపుటిని దేవరాజు మహారాజు వెలువరించారు. బంజారాల మీద కథలను ఎంతో సాహసోపేతంగా ఈ జిల్లాకే వన్నె తెచ్చేవిధంగా ఈ కాలాన్నే 'సంగార' (నల్లగొండ జిల్లా బంజారాల మౌఖిక కథలు) ను సిల్మానాయక్ అజ్మీరాలు తీసుకొచ్చారు. 2016లో మేరెడ్డి యాదగిరి రెడ్డి 'బొడ్రాయి' కథా సంపుటి వేశాడు. ఇదే సంవత్సరం 'కొన్ని వెలుగు నీడలు' కతా సంపుటిని యెన్నం ఉపేందర్ అచ్చువేశాడు. 2016లో 'లద్దాఫ్ని' ముస్లిం కథలు షాజహానా వెలుగులోకి తెచ్చింది. భూతం ముత్యాలు 'బేగరి కథలు', బుగాడ కథలు, 2017లో దగ్దం కథలు ఇలా పలు కథా సంపుటాలు తీశాడు. జి. అనసూయ తెలంగాణ బతుకు చిత్రాలు కథా సంపుటి వెలువరించింది. పెండెం జగదీష్ 'ఆనందవృక్షం' అను పర్యావరణ కథా సంపుటితో పాటు 2016లో 'గమ్మతి గమ్మతి కథలు', 2018లో ముదిగంటి సుజాతారెడ్డి 'నిత్యకల్లోలం' కథా సంపుటిని తెచ్చారు. ఇదే ఏడాది 'జీవితం' కథా సంపుటిని కరుణగారు ముద్రించారు. ఇంకా ఇదే కాలాన 'ఇరాన్ కేఫ్' (కొన్ని కథలు పేరుతో మల్లికార్జున్.వి గారు అచ్చువేశారు. 2019లో జి. అనసూయ 'కథల సందూక' అనే కథా సంపుటిని తీసుకొచ్చి ఈ జిల్లా ఖ్యాతిని ఎన్నోరెట్లు పెంచారు. 2021లో శీలం భద్రయ్య 'లొట్టపీసు పూలు' కథాసంపుటిని ఆవిష్కరించారు.

ఇలా పైవారే కాక కాలగర్భంలో కనుమరుగు కాబడ్డ కథకులు ఇంకా ఎందరో ఉన్నారు. తెలంగాణ తెలుగు కథ నల్లగొండ జిల్లాలో బండారు అచ్చమాంబతో మొదలై వివిధ దశలల్లో వైవిధ్యభరితమైన అంశాలతో ఎంతోమంది రచయితలు, రచయిత్రులు అద్భుతమైన కథలు రాసి నల్లగొండ కథాసాహిత్య వాఙ్మయాన్ని శిఖరాగ్రాన నిలబెట్టారు. నల్లగొండ జిల్లాలో నిరంతరం సాగే ఈ కథా ప్రక్రియ ఇంకెన్నో గొప్ప అద్వితీయమైన మైలురాళ్ళు దాటగలదని ఆశించవచ్చు.

# మౌలిక పరిశోధనకు నిర్వచనం 'మానవల్లి రామకృష్ణ కవి'

**డా. బోయిన్‌పల్లి ప్రభాకర్,** తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్. గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల, నిజామాబాద్.

ఫోన్ : 9490 901 050


మన వాఙ్మయ చరిత్రకు ప్రాచీనకవుల రచనలే ప్రాతిపదికలు, ప్రధానాధారాలు. తెలుగు భాషలో పూర్వకవుల రచనలన్నీ తాళపత్రాలలో నిక్షిప్తమై ఉన్నాయి కాబట్టి తెలుగు వాఙ్మయ చరిత్ర అముద్రితాలైన తాళపత్ర గ్రంథాలపైనే పూర్తిగా ఆధారపడి ఉందనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. అయితే ఇప్పుడున్నటు వంటి మన వాఙ్మయ చరిత్రలు అముద్రిత వాఙ్మయాన్ని పరిశోధించి రచింపబడలేవని ప్రాచీనకవుల ముద్రితరచనలపై మాత్రమే ఆధారపడ్డాయని – కేవలం సాహిత్య చరిత్రకే కాక సాహిత్య పరిణామ వికాసాలకు ప్రాచీనసాహిత్యమంతా కూలంకషంగా పరిశీలన కావలెనన్న సూక్ష్మదృష్టితో, సత్సంకల్పంతో శ్రీ మానవల్లి రామకృష్ణకవి గారు సాహితీ క్షేత్రంలోకి ఒక మౌలిక పరిశోధకునిగా అడుగుపెట్టారు. 19వ శతాబ్దం ఉత్తరార్థం మొదలుకొని 20వ శతాబ్దం పూర్వార్థం వరకు ప్రాచీన గ్రంథ పరిష్కరణ; ప్రకటన వంటి మౌలిక వ్యాసంగాల్లో **'దీపస్తంభం'**లా వెలిగిన గొప్ప విద్వన్మణీ, పరిశోధకుడూ, కవీ **శ్రీ మానవల్లి రామకృష్ణకవి.**

**'ఆనాడా వాఙ్మయ తపస్వి – విస్మృత కవులు – అనుపేర సాహిత్యపు ప్రపంచమంతకు ముందు కని విని యెఱుగని కావ్యము లను ప్రకటింపబట్టియే నేటి మన సారస్వత చరిత్ర యిట్టి పరిణత స్థితికి వచ్చినది – ఆయన జన్మించి యుండక పోయిన యెడల ఆంధ్ర సాహిత్య చరిత్ర అంధకార బంధురమై యుండెడిదనుటలో అతిశయోక్తి లేదు'** అని నిడుదవోలు వేంకటరావు గారిచే, **'సాహిత్య ప్రపంచమున మా బోంట్లు తిన్నగా కన్నులు తెఱువక పూర్వమే రామకృష్ణ కవి గారు ప్రాచీన ప్రబంధములను ప్రకటించిరి'** అని వేటూరి ప్రభాకరశాస్త్రి గారిచే ప్రశంసలను; భోజరాజీయ, వరాహ పురాణ ముద్రణ సందర్భంగా ప్రత్యంతరాలను సమకూర్చి కందుకూరి వీరేశలింగం గారిచే కృతజ్ఞతలను పొందిన మహామనీషి శ్రీ మానవల్లి రామకృష్ణకవి. కవి గారి వ్యక్తిగత, ఉద్యోగ జీవితమంతా పరిశోధనకే అంకితమైంది. వాఙ్మయ పరిశోధనకు చేసిన తపస్సు కవిగారి జీవితం.


**వ్యక్తిగత – ఉద్యోగ జీవితం :**

మానవల్లి రామకృష్ణకవి గారు క్రీ.శ.1866లో మద్రాసు – నుంగంబాకంలో జన్మించారు. వారిది పండిత కుటుంబం. వారి తండ్రిగారు భరతనాట్యశాస్త్ర వ్యాఖ్యాత. కవి అనేది వారికి బిరుదుగానే చేరినా మానవల్లివారు వస్తుతః కవి. కవితాశక్తి బాల్యంలోనే వారి దరి చేరినా కవితారచనకు పాండిత్యం అవసరమని గ్రహించి తెలుగు, సంస్కృత భాషా పాండిత్యాన్ని సంపాదించుకొన్నారు. అలాగే తమిళ, కన్నడ, ఇంగ్లీషు భాషలలో కూడా విశేష ప్రావీణ్యాన్ని సాధించారు. వివిధ భాషా ప్రావీణ్యత మరియు తాళపత్ర గ్రంథాలపై గల ఆసక్తి వారిని యావద్భారతావని లోనే ఒక గొప్ప మౌలిక పరిశోధకునిగా దిద్దితీర్చాయి. కవిగారు సంస్కృతం, తెలుగు ప్రధానంగా ఎం.ఏ. చదివారు.

ఇంతవరకు తెలుగు సాహిత్యలోకంలో ఎవరికీ తెలియని అమూల్యమైన కావ్యాలు తాళపత్రాలలో ఉన్నాయని, వాటిని అన్వేషించి, ప్రకటించినచో తన అభినవేశానికి, సారస్వత పిపాసకు తగిన ప్రతిఫలం చేకూరుతుందనే పవిత్ర భావనతో కవిగారు తాళపత్ర గ్రంథాన్వేషణ ప్రారంభించారు. తంజావూరు పుస్తకశాలలో అమూల్యమైన తెలుగు తాళపత్ర గ్రంథాలున్నాయని తెలిపి, వాటినెంతో కష్టపడి మొదటగా సంపాదించింది కవిగారే.



కాని వాటినెలా ప్రకటించాలి? అదృష్టవశాత్తు కొంతకాలానికే వారి ప్రవృత్తికి తగ్గట్టుగా 1904లో వనపర్తి సంస్థానంలో ఉద్యోగం లభించింది. 1904 నుండి 1912 వరకు వనపర్తిలో వారు చేసిన పరిశోధన, పరిష్కరణ వ్యాసంగం వారిని తెలుగు సాహిత్యలోకంలో ఒక గొప్ప పరిశోధకునిగా తీర్చిదిద్దింది. వారు అక్కడి **'బ్రహ్మ విద్యా విలాస ముద్రాక్షరశాల'** ద్వారా **'విస్మృతకవులు'** అనే సిరీస్‌లో అపూర్వమైన కావ్యాలను తొలిసారిగా ప్రకాశింపజేశారు. వారెన్నో కష్టాలకు లోనై ఆ అమూల్య గ్రంథాలను ముద్రించి విద్వత్ప్రపంచానికి వెల్లడించారు. ఈ సమయంలో సంస్థానంలోని కొందరు ఉద్యోగులు కవిగారి ఉదాత్తమైన పరిశ్రమను గుర్తించకుండా వారిపై కొన్ని అపవాదులను ప్రచారం చేశారు. ఈ విషయంలో మానసికంగా బాధపడిన కవిగారు 1912లో వనపర్తిని వదలి మద్రాసు చేరుకొన్నారు. ఇక్కడ వారు సంస్కృత సాహిత్యంపై దృష్టిని మరల్చడం జరిగింది. రెండు మూడేండ్లు తను చదివిన పచ్చయప్ప కళాశాలలోనే సంస్కృత




భాషోపాధ్యాయునిగా పనిచేసి ఆ సాహిత్యాన్ని అవగాహన చేసుకున్నారు. తెలుగు భాషలోలాగే సంస్కృత గ్రంథాలు కూడా చాలావరకు మరుగున పడ్డాయని గ్రహించి వాటిని సాహిత్యలోకానికి ప్రకటించాలనుకున్నారు. కేరళలో అమూల్యమైన సంస్కృత గ్రంథాలు తాళపత్రాలలో ఉన్నాయని వాటిని పరిశోధించి, ప్రకటించడానికి మానవల్లి గారెంతో ఉత్సాహం చూపారు. కవిగారి ఉత్సాహం, దక్షతలను చూసి సంస్కృత కళామతల్లి తన సాహితీ క్షేత్రంలోకి వారిని సాదరంగా ఆహ్వానించింది. 1915లో మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలో కవిగారికి ఉద్యోగం లభించింది. ఈ పుస్తకాల తరఫున సంస్కృత తాళపత్ర గ్రంథ సేకరణకై కేరళ రాష్ట్రంలో కవిగారు ప్రత్యేకంగా నియమింపబడుటచే, వారెంతో ఉత్సాహంతో అక్కడ రెండేళ్ళు పర్యటించి, పరిశోధించి లోకోత్తరాలైన సంస్కృత గ్రంథాలను సంపాదించారు. సనాతనాచార సంప్రదాయాలకు పుట్టినిండ్లైన నంబూద్రి బ్రాహ్మణులను కవిగారు తన పాండిత్యంతో వశపరచుకొని వారివద్ద ఉన్న ఆ అమూల్య తాళపత్ర గ్రంథాలను సేకరించడం చెప్పుకోదగ్గ విశేషం. అక్కడ భాసనాటకాలలో చేరని 'దమరుకం' అనే గొప్పనాటకం దొరికింది. ఈ సంస్కృత తాళపత్ర గ్రంథ పరిశోధనా వ్యాసంగమే కవిగారికి ఖండాంతర కీర్తిని ఆర్జించి పెట్టింది.

కవిగారు 1926 వరకు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలో పనిచేశారు. పుస్తకశాల తరఫున ప్రకటించాల్సిన కొన్ని సంస్కృత నాటకాలను (కుందమాలా – కవి గారికి ఈ నాటకం ద్వారా యావద్భారత కీర్తి కల్గింది; కౌముదీ మహోత్సవం) కవిగారు స్వయంగా ప్రకటించారు. అది అక్కడి నిబంధనలకు విరుద్ధమవడం చేత వారి పూర్వపు సేవనేమాత్రం గుర్తించక ఉద్యోగంనుండి తొలగించడం జరిగింది. అయితే శ్రీ టేకుమళ్ళ అచ్యుతరావుగారి సహాయంతో రాజమండ్రిలో గవర్నమెంట్ సెకండరీ మోడల్ ట్రెయినింగ్ స్కూల్‌లో ఉపాధ్యాయునిగా నియమింపబడ్డారు. అక్కడ వారి ఆర్థిక పరిస్థితి ఎంతో దయనీయంగా ఉన్నప్పటికీ తన సాహిత్య వ్యాసంగాన్ని ఏ మాత్రం ఉపేక్ష చేయలేదు. 1932తో కవిగారి ప్రభుత్వోద్యోగం పూర్తి అయింది. ఇంతకు క్రితం చేసిన ఉద్యోగాలన్నీ తాత్కాలికాలగుటచే ప్రభుత్వం వారి పెన్షన్ సౌకర్యం కూడా లేకుండా పోయింది. ఒక మహా పరిశోధకున్ని గుర్తించే విధం ఇదేనా? 66 ఏళ్ళ వయసులో మళ్ళీ ఉద్యోగ ప్రయత్నం. మద్రాసుకు తిరిగి వచ్చిన తర్వాత మద్రాసు యూనివర్సిటీలో వారు ఒక సంవత్సరం పాటు ఉండి సుమారు 50 మెకంజీ సంపుటాలను తెలుగు నుండి ఇంగ్లీషు లోకి అనువదించారు. ఆ తర్వాత 1933లో తిరుమల తిరుపతి దేవస్థానం విద్యాశాఖాధికారిగా, 1940 నుండి 1954 వరకు శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన సంస్థలో సంస్కృత శాఖాధ్యక్షులుగా ఉన్నత ఉద్యోగాలు నిర్వహించారు.

చివరి దశలో కవిగారు ఎంతో పేదరికాన్ని అనుభవించారు. అప్పుడు వారికున్న ఆస్తి కొన్ని అమూల్యమైన తాళపత్ర గ్రంథాలు మరికొన్ని రాతప్రతులు మాత్రమే. తినడానికి తిండిలేని సమయాన సాహిత్యలోకంతో సంబంధంలేని ఒక హోటల్ యజమాని కవిగారికి ఉచితంగా భోజనం పెట్టేవాడట. ఇలాంటి దుర్భర స్థితిలో ఉన్న కవిగారికి కొందరు సాహితీమూర్తులు పూనుకోగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వం కలిపి నెలకు 150 రూపాయలు గౌరవభృతిని మంజూరు చేశాయి. కాని కొన్ని నెలలైనా ఆ భృతిని అనుభవించకుండానే కవిగారు తన 91 ఏళ్ళ వయసులో 1957 సెప్టెంబర్ 20వ తేదీన స్వర్గస్థులైనారు. శారీరకంగా మరణించినా వారి వాఙ్మయ కృషిలో అణువణువునా కవిగారు మనకు దర్శన మిస్తారు. మౌలిక పరిశోధన అనే విశాలాకాశంలో ధ్రువతార శ్రీ మానవల్లి రామకృష్ణ కవి.


**మానవల్లికవి సారస్వత మూర్తిమత్వం :**

సాహిత్యచరిత్ర పరిణతస్థితికి మౌలిక పరిశోధన ప్రధాన పాత్ర వహిస్తుంది. మౌలిక పరిశోధన అంటే అముద్రిత తాళపత్ర గ్రంథ పరిశోధన. సాహిత్య చరిత్రలోలేని ప్రాచీన కావ్యాలను, కవులను గురించి ప్రకటించడంలో భాగంగా – తాళపత్ర ప్రతులను సేకరించడం, వాటిని ఒక దానితో ఒకటి పోల్చడం, పాఠ భేదాలలో శుద్ధమైన పాఠాన్ని గ్రహించడం, పరిష్కరించడం, కవి దేశ కాలాదులను నిర్ణయించడం మరియు విపులమైన పీఠికతో ప్రకటించడం మొదలైన అంశాలు మౌలిక పరిశోధన కిందకు వస్తాయి.

మౌలిక పరిశోధనను ఒక యజ్ఞంలా భావించి, దానికే తన జీవిత సర్వస్వాన్నీ అర్పించిన 'మానవల్లి రామకృష్ణకవి' ని మౌలిక పరిశోధనకే నిర్వచనంగా చెప్పవచ్చు. మౌలిక పరిశోధన అనేది ఎంతో కష్టమైన పని. అది ప్రభుత్వం మరియు ఇతర సంస్థల సహాయంతో జరిగితే అది వేరే విషయం. ఆర్థికంగా బలహీనుడైనా హార్దికంగా ఎంతో బలవంతుడైన కవిగారు ఒక వ్యక్తిగా ఈ వ్యాసంగాన్ని చేపట్టడమనేది ఇక్కడ గమనించాల్సిన విషయం. అముద్రిత తాళపత్ర ప్రతులను గురించి పరిశోధిస్తే లాభమేముంది? అనే ప్రశ్నరావచ్చు. పరిశోధనా

రంగంలో అడుగుపెట్టినపుడు ఆ తర్వాత ఎప్పుడు కూడా కవిగారు లాభనష్టాలను బేరీజువేసినట్లుగా కనిపించదు. మానవల్లి కవి తెలుగులోని విస్మృత ప్రాచీన కావ్యాలను 'విస్మృత కవులు' అనే గ్రంథమాల పేరుతో అచ్చువేశారు. 1908లో కుమారసంభవ మొదటిభాగం; 1909లో క్రీడాభిరామం; 1910లో నీతిసార ముక్తావళి, ప్రబంధమణి భూషణం; 1911లో పరతత్త్వ రసాయనం, అనర్ఘ రాఘవం; 1912లో త్రిపురాంతకోదాహరణం, శ్రీరంగ మాహాత్మ్యం; 1914లో కుమారసంభవ రెండవ భాగం; 1923లో సకలనీతి సమ్మతం మొదలైన గ్రంథాలను విపులమైన పీఠికలతో కవిగారు తొలిసారిగా సాహిత్యలోకానికి ప్రకటించారు. ఈ పరిష్కృత గ్రంథ పీఠికలు కవిగారికి తెలుగు సాహిత్య చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించాయి. పీఠికా రచయితగా కవిగారు తనదైన విశిష్టమైన శైలిని అంటే కవి దేశ కాలాదులకు సంబంధించిన చారిత్రక సత్యాన్ని స్థాపించే పద్ధతి పాటించారు. తద్వారా ఆ పీఠికలు సాహిత్య రంగంలో ఎంతో సంచలనాన్ని కల్గించాయి. వాదోపవాదాలకు దారి తీసాయి. ప్రత్యేక సాహిత్య కళాఖండాలుగా స్థిరపడ్డాయి. చివరికి గ్రంథాని కున్నంత ప్రసిద్ధిని సాధించాయి. కుమారసంభవ, క్రీడాభిరామాదుల పీఠికలు ఆ కోవలోకి వస్తాయి. హరిభట్టు రచించిన మత్స్య, ఉత్తర నారసింహ పురాణాలను, సాంబోపాఖ్యానం, ఐరావత చరిత్రం మొదలైన వాటిని కవిగారే తొలిసారిగా ప్రకటించడం జరిగింది.


ఈ ప్రాచీన కావ్య ప్రకటనకు సమాంతరంగానే కవిగారు అంతకుముందు సాహిత్యలోకంలో తెలియని ఎన్నో ప్రాచీన కావ్య ప్రబంధాల – కవుల విశిష్టతను వైజయంతి, భారతి, ఆంధ్రసాహిత్య పరిషత్ పత్రిక, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన పత్రిక ఇంకా ఇతర పత్రికలలో 'పుష్పాంజలి' పేర మరియు విడివిడిగా వ్యాసాల రూపంలో ప్రకటించారు. వీరి వ్యాసాలన్నీ మౌలిక పరిశోధనాత్మ కములు. కవిగారు క్రీ.శ. 1910లో **'ఆంధ్రరాజ కవులు'** అనే వ్యాసం రాశారు. అందులో వారు నన్నెచోడుని నుండి కదిరీపతి నాయకుని వరకు కల రాజకవులను గూరించి స్థూలంగా తెలపడంతోపాటు ముకుందమాల కర్త సాయపవేంకటపతిని; ద్విపద రామాయణ, శ్రీరంగ మాహాత్మ్యముల కర్త కట్టావరదరాజును సాహిత్యలోకానికి పరిచయం చేశారు. ఇంకా ఈ వ్యాసంలో ఆముక్తమాల్యదను రాయలు రచించలేదని ఎవరో వైష్ణవుడు రచించాడని కవిగారు ప్రతిపాదించారు. ఈ అంశం సాహిత్యచరిత్రలో చర్చకు దారితీసి, కావ్యం–కావ్యకర్త గురించి ఎన్నో కొత్త విషయాలు వెలుగులోకి రావడానికి తోడ్పడింది. 1915లో కవిగారు **'తెనాలి కవులు'** అనే వ్యాసంలో తెనాలి రామకృష్ణుని గురించే కాక తెనాలి వంశ ఇతర కవులను, వారి గ్రంథాలను గురించి తెలిపారు. తెనాలి రామకృష్ణుడు పాండురంగ మాహాత్మ్యం, ఉద్భటారాధ్యచరిత్రం, ఘటికాచల మాహాత్మ్యములే కాక హరిలీలా విలాసం, కందర్పకేతూ విలాసం అనే ప్రబంధాలు కూడా రచించాడని తెలిపారు. ఇది సాహిత్యలోకానికి పూర్తిగా కొత్త విషయం. కవిగారు వీరేశలింగం గారి 'కవుల చరిత్ర'లో లేని కవుల గురించి ఎక్కువ పరిశ్రమ చేశారు. 1916లో వసుచరిత్రను గురించి రాస్తూ – వసుచరిత్రకు సంస్కృతానువాదం ఉందని తెలిపారు. సంస్కృత భాషలోనే కాక తమిళభాషలో కూడా అనువాదం ఉందని తెలిపారు. సంస్కృత భాషలోని కొన్ని విస్మృత నాటకాలు, తెలుగు సంస్కృత నరసభూపాలీయాలు, కొన్ని కాకతీయ శాసనాలు, రామకృష్ణార్జున రూప నారాయణీకము, తుక్కాపంచకం, ఎలకూచి వేంకట కృష్ణరాయ కవి, శ్రీకృష్ణలీలాశుకకవి, కాళకళభకవి, ఉదయనోదయం, లీలావతి కథ, కవికంఠపాశం మొదలైన కావ్యాల రచయితలను గురించి మానవల్లికవి గారు సహృదయ లోకానికి తొలిసారిగా తమ వ్యాసాల ద్వారా ప్రకటించారు.




కవిగారు పత్రికల ద్వారా కూడా ప్రాచీన కావ్యాలను ప్రకటించారు. రఘునాథ రామాయణం, కవిగజాంకుశములను ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రికలో; శుకసప్తతి కావ్యావతారికను, వాల్మీకి చరిత్రను సరస్వతీ పత్రికలో తొలిసారిగా ప్రకటించారు. తరిగొండ వెంగమాంబ, గణపవరపు వేంకటకవి, పట్టమెట్ట సోమనాథ సోమయాజి, కస్తూరిభట్టురాజు, చింతలపల్లి కవులు మొదలైన వారిని గురించి, వారి రచనల గురించి సాహిత్యలోకానికి మొదటగా ప్రకటించిన వారు కవిగారే.

మానవల్లి వస్తుతః కవి. మృగావతి, వసంత విలాసం అనే కావ్యాలలో వీరి ప్రౌఢమైన మధురకవిత్వం బయటపడుతుంది. వారి ఈ కవితా సామర్థ్యమే **'కుమారసంభవ'** కర్తృత్వ విషయంలో వారిని ఆరోపణలకు గురిచేసింది. కళింగసేన అనే నాటకం, వత్సరాజచరిత్ర అనే నవలను రచించడంతోపాటు భాసనాటకాలైన కర్ణభారం, అవిమారకములను అనువదించారు.

కవిగారు సంస్కృత భాష కళామతల్లికి చేసిన సేవ కూడా ఎంతో కొనియాడదగింది. కవిగారు **'దక్షిణభారతీ గ్రంథమాల'** పేరుతో అపూర్వమైన విస్మృత సంస్కృత నాటకాలను, కావ్యాలను ప్రకటించారు. అందులో భాగంగా మొదటగా శూద్రకాది మహాకవులచే


नाट्यशास्त्रम्

NATYAŚASTRA
with the commentary of
ABHINAVAGUPTA

Edited with an Introduction and Index by
M. RAMAKRISHNA KAVI, M.A.

In Four Volumes
VOL. II.

1934
ORIENTAL INSTITUTE,
BARODA.

రచించబడిన **'చతుర్భాణి'**ని వెల్లడించారు. తర్వాత **'కుందమాలా'** నాటకాన్ని ప్రకటించారు. ఈ నాటకం ద్వారా... **'ఆయన జీవిత సార్థక్యానికి ఒక్క కుందమాల నాటకమే చాలు. ఎంత మంచి నాటకం ప్రపంచానికి ప్రసాదించారు'** అని మహా పండిత రాహుల్ సాంకృత్యాయన్ చేత పొగడ్తకన్న ధన్యజీవి మానవల్లి. ఈ నాటకం తెలుగువారిని కూడా ఆకర్షించింది. ఇంకా **దండి 'అవంతీసుందరి కథ' అనే కావ్యాన్ని, శూద్రకుని వత్సరాజుకథ నాటకాన్ని, విజ్జికాదేవి కౌముదీ మహోత్సవ నాటకాన్ని, దత్తక సూత్రవృత్తి అనే విటకావ్యాన్ని** కవిగారు ప్రకటించారు. కవి గారు ఆంగ్లంలో కూడా వ్యాసాలు, సమీక్షలు రాశారు. అవి కూడా తెలుగు వ్యాసాలవలె మౌలిక పరిశోధనాత్మకములే.

**కుమారసంభవం :**

మానవల్లి రామకృష్ణకవిగారికి తెలుగు సాహిత్యలోకంలో ప్రత్యేకమైన గుర్తింపును కల్పించిన కావ్యం 'కుమారసంభవం'. తొలిసారి దానిని సంపాదించి పరిష్కరించి, ప్రకటించిన ఘనత వారిదే. కుమారసంభవం తెలుగు సాహిత్య రంగంపై దేదీప్యమానంగా వచ్చి వాఙ్మయ ప్రపంచాన్నంతటిని ఉర్రూతలూగించిన కావ్యం. దీనిపై చెలరేగినంత వివాదం తెలుగు సాహిత్యంలో మరే కావ్యంపైనా రాలేదు. అందుకు కావ్యకర్త నన్నెచోడుని కాలనిర్ణయం (నన్నయకు ముందువాడనే విషయం) ప్రధాన పాత్ర వహిస్తే, కర్తృత్వం కూడా ఆంశికపాత్రను నిర్వహించింది. కవి కాల నిర్ణయంలో మానవల్లి వారు అనేక శాసన, మత విషయక ప్రమాణాలను ఆధారంగా చూపించారు. అలాగే వ్యాకరణ ఛందో విశేష అపూర్వ పద ప్రయోగాల ఆధారంగా నన్నెచోడుడు నన్నయకంటె ముందువాడని ప్రతిపాదిం చారు. ఒక కవి కాలాన్ని నిర్ణయించేందుకు భాషా ఛందో ప్రయోగాల ప్రాచీనత, శాసనాల ఆధారంగా ఎంతో విస్తృతమైన చర్చ నన్నెచోడుని విషయంలో తప్ప ఇతర ఏ కవి విషయంలోనూ జరగలేదు. చర్చలో ఆనాటి ప్రసిద్ధ పండితులంతా పాల్గొన్నారు. తద్వారా నన్నెచోడుని గురించి ఒక వాఙ్మయమే వెలువడింది. నన్నెచోడుని కాలం ఎన్నో వివాదాలకు దారితీసింది. ఈ వివాదాలకు చారిత్రక విషయాలకు సంబంధించిన అసమగ్రత, అస్పష్టతలే ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఏదైతేనేమి మానవల్లి కవి గారి వాదాన్ని సమర్థించిన వారు కొందరైతే, సమర్థించని వారు ఎక్కువగా ఉండడం చేత ప్రస్తుతం స్థూలంగా నన్నెచోడుడు నన్నయ, తిక్కనల నడిమివాడన్న అంగీకారము సాహిత్యలోకంలో స్థిరపడింది.

**అభినవ భారతీ వ్యాఖ్య, భరతకోశం :**

మానవల్లికవి గారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కీర్తిని సంపాదించి పెట్టినది భరతనాట్య శాస్త్రానికి వారు సంపాదించిన – అభినవగుప్తుని 'అభినవ భారతీ వ్యాఖ్య'. ఈ అపూర్వ వ్యాఖ్యతో కవిగారు భరతనాట్య శాస్త్రాన్ని పరిష్కరించారు. పి.వి.కాణే, యస్.కె.డే వంటి గొప్ప పండితులను కాదని కె.పి. జయస్వాలు **'ప్రాచ్య విద్వన్మహా సభ'** అధ్యక్ష స్థానంలో ఉండి **'మానవల్లి రామకృష్ణ కవి గారు'** తప్ప వేరెవ్వరూ ఈ గ్రంథ పరిష్కరణకు సమర్థులు కారని, బరోడా ప్రాచ్య పరిశోధనా సంస్థ తరఫున గ్రంథ సంపాదకత్వ బాధ్యతలు కవిగారికి అప్పగించారు. కవిగారు మొత్తం 4 సంపుటాలకు గాను 3 సంపుటాల పరిష్కరణ మాత్రమే పూర్తిచేశారు. నాట్య శాస్త్ర గ్రంథాల్లో ఇప్పటికీ కవిగారి గ్రంథాలే ప్రామాణికంగా ఉన్నాయి. అలాగే సంగీత, నాట్యశాస్త్రాల్లోని పారిభాషిక పదాలన్నింటికి సప్రమాణంగా ఒక బృహన్నిఘంటువును 'భరతకోశం' పేరిట కవిగారు రచించారు. ఈ రచన సంస్కృతమే అయినా వారు సంస్కృత గ్రంథాలే గాక తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ వాఙ్మయాలను కూడా పరిశీలించి అందులోని విషయాలను చేర్చడం విశేషం.

**స్మరణ :**

సాహిత్య పరిశోధన ఖనిలోనికి దిగిన తర్వాత ఎన్ని ఆటంకాలు, అవమానాలు ఎదురైనా కవిగారు ఎవరినీ ఏమీ అనలేదు. సాహిత్య ఖనిజాల వెలికితీతనూ, వాటిని ప్రకాశింపజేయడాన్నీ మానలేదు. కవిగారు ఈ పరిశ్రమకు పూనుకోకపోతే ఎన్నో ప్రాచీన గ్రంథాలు మనకు దక్కేవి కావు. ఆ గ్రంథాలు తెలుగు సాహిత్య చరిత్రలో కొన్ని కొన్ని అధ్యాయాల సమగ్రతకు తోడ్పడ్డాయి. శ్రీ టేకుమళ్ళ కామేశ్వర రావు గారు ఓ సందర్భంలో... **'పగడపు పురుగులు మహా సముద్రంలో చుట్టు గోడలను కట్టుకొంటాయి. అవి మానవులకు దీవులవుతాయి. అట్లే మానవులలో మేధావులు తమ లాభం కోసం పొగడ్తల కోసం గాక నైసర్గికంగా పనిచేసుకొని పోతారు. దానివల్ల జాతికి మాత్రమే శాశ్వత ప్రయోజనం.'** అని పలికిన మాటలు మన కవి గారికి అక్షరాల సరిపోతాయి. సముద్రగర్భంవలె గంభీరమైన వారు శ్రీ మానవల్లి రామకృష్ణకవి. సాహితీ విద్యార్థులమందరం వారికి కృతజ్ఞతాబద్ధులమే. కవిగారు జీవితాంతం కొనసాగించిన పరిపూర్ణ పరిశోధన – భావితరాల పరిశోధనకు ఎంతో ప్రేరణ – అందుకే ఈ స్మరణ.

◆ ◆ ◆

# తిలక్ అభిరుచులు - అలవాట్లు

**ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు,** విశ్రాంత ఆచార్యులు ఫోన్ : 99454 22742



**3. పేకాట – బ్రాకెట్టు**

పెరటి చెట్టు మందుకు పనికిరాదన్నారు పెద్దలు. తణుకులో తిలక్‌గారిని గౌరవించేవారు ఆ రోజుల్లో చాలా తక్కువగా ఉండేవారు. తిలక్‌గారు ఆగర్భ శ్రీమంతులైనా క్రమక్రమంగా ఆస్తినంతా తన అనారోగ్యానికి (గుండెజబ్బుకు, నరాలకు సంబంధించిన వ్యాధికి) వైద్యం చేయించుకోవడంలోనూ, పేకాటలోనూ, బ్రాకెట్టు (కాటన్ మార్కెట్ నంబర్స్) లోనూ, మిగిలినది స్టెయిన్‌లెస్ స్టీల్ వ్యాపారంలోనూ పాడుచేశారని తెలుస్తోంది. అందుచేత **'డబ్బు సంపాదన ముఖ్యం, అదే గౌరవ హేతువు'** అనుకునే కొందరు తణుకు పెద్దలు వీరిని చులకనగా చూసేవారు. **"తిలక్ అంటే వాడేనా ఆ పేకాట ఆడేవాడు?"** అని అడిగి, మనం 'అవు'ననే వరకూ కొంచెం పాజ్ యిచ్చి, ఆ తర్వాత పెదవి విరిచి **"నా మొహం! వాడి దగ్గర ఏమీ లేదు! అంతా తగలేశాడు!"** అనేవారు ఈ పెద్దలు. ఇటువంటి మాటలు మండపాకలో ఉన్న వీరి బంధుకోటి కూడా అనేది. అది విని నేను చాలా బాధపడేవాణ్ణి. (నేను వారితో స్నేహం చేస్తున్నానని కొందరు **"పెద్దలు"** నన్ను ఇదే ధోరణిలో హెచ్చరించారు కూడా!). ఇటువంటి పెద్దలంటే తిలక్‌గారికి అరికాలిమంట నెత్తి కెక్కేంది. **"జరీ కండువా పెద్దపులు"**లనీ, **"పరువు ప్రతిష్ఠల గాడిద"**లనీ ఈ పెద్దలను అధిక్షేపించేవారు తమ కవిత్వంలో.

స్టీల్ వ్యాపారం మానివేసినా బ్రాకెట్టూ, పేకాటా చివరి వరకూ ఆడుతూనే ఉన్నారు తిలక్‌గారు. ఉండబట్టలేక ఒకసారి ఆయన్ని అడిగి వేశాను... **"ఏమండీ! ఈ పేకాట ఎందుకు ఆడుతారు? ఈ టైంలో కూడా చక్కని రచనలు చేయవచ్చును గదా?"**

తిలక్‌గారు చిరునవ్వు నవ్వి **"ప్రతి మనిషికీ ఏదో ఒక హాబీ వుంటుంది. అస్తమానం రాస్తూ కూర్చోమంటే ఛస్తాను. నాకు పేకాట హాబీ!"** అన్నారు. తనకు పేకాటలో ప్రవేశం ఎలా కలిగిందో కారణం కూడా చెప్పేవారు. **"ఇది నాకు ఎలా అలవాటయిందో తెలుసా? 1946 నుంచీ 54 వరకూ. అంటే ఎనిమిదేళ్ళ పాటు–నేను** 'Nervous break-down'**తో బాధపడ్డాను. ఆ ఎనిమిదేళ్లు మంచం మీద నుంచి లేవలేదు, ఏమీ తోచేది కాదు. పేకాట నేర్చుకొని మిత్రులతో కాలక్షేపం చేశాను."**

పేకాటకు మిత్రులు లేనప్పుడు, ఇంట్లో అన్నదమ్ములకోనూ, భార్య ఇందిరమ్మ గారితోనూ కూడా చీట్లాట ఆడుతూ ఉండేవారు తిలక్. కొంతకాలం క్లబ్ వీరింట్లోనే నడిపారు. కాటన్ మార్కెట్ మేనేజరుగాకూడా ఉన్నారు కొన్నాళ్లు. తణుకు టౌనుహాల్లో రాత్రి తెల్లవార్లూ చీట్లాట ఆడిన రోజులు చాలా ఉన్నాయి. (అటువంటి రాత్రులలో నన్ను వారింటి దగ్గర పిల్లలకు సాయం పడుకోమనేవారు.) పేకాట నిమిత్తం ప్రత్యేకంగా పనిగట్టుకొని రాజమండ్రి క్లబ్బుకు వెళ్ళేవారు.

తణుకులో తిలక్‌గారి యింటికి సరిగ్గా ఎదురుగుండానే "టౌనుహాలు" (లాయర్స్ క్లబ్). అక్కడ లాయర్లంతా చేరి పేకాడుతూ ఉంటారు. చుట్టుప్రక్కల ఊళ్ళనుండి కూడా ధనికులైన పేకాటరాయళ్ళు అక్కడికి వస్తూ ఉంటారు. తిలక్‌గారు తరచుగా ఆ టౌన్‌హాల్లో పేకాడుతూ ఉండేవారు. చేతిలో డబ్బులు లేనప్పుడు మాత్రం నాతో కబుర్లు చెపుతూ ఇంట్లో కూర్చుండిపోయేవారు. కాని వారి మనస్సంతా ఎదురుగా ఉన్న టౌన్‌హాల్ మీదనే ఉండేది. నాతో మాట్లాడుతూ మాట్లాడుతూ ఒక్కొక్కసారి గేటు దాటి రోడ్డుమీదికి వెళ్ళేవారు. వారితోపాటు నేను వెళ్ళేవాడిని. తిలక్‌గారు ఎదురుగా ఉన్న టౌన్‌హాల్ వైపు ఆశగా చూస్తూ, ఒక్క పొడుంపట్టు గట్టిగా పీల్చి, నాటకంలో స్వగతంలాగ **"ఎంత స్టేక్ ఆడుతున్నారో?"** అనేవారు. (నాకు అప్పటికీ ఇప్పటికీ పేకాటలో ఓనమాలు తెలియవు. "స్టేక్" అంటే అసలే తెలియదు.) పేకాట అంటే అంత వ్యసనం తిలక్‌గారికి!

మొత్తంమీద పేకాట అంటే తిలక్‌గారికి పంచ ప్రాణాలూను, ('సౌందరనందం' జంటకవి కాటూరి వేంకటేశ్వరరావుగారికి కూడా ఈ అలవాటు ఎక్కువగా ఉండేది. ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు తామొక్కరే కూర్చుని పేకాట ఆడుకుంటూ ఉండేవారు). శ్రీమంతుల కిది తప్పని జబ్బు కాబోలు. కొందరు కవులలోను రచయితల లోను కూడా ఇది ఎక్కువగా కనబడుతోంది. ఈ పేకాట ఆడేవాడు పెళ్ళాం పిల్లల్ని ఎలా ఏడిపిస్తాడో తెలుపుతూ 'జ్యోతి' పత్రికలో "దొంగ" అనే కథ వ్రాశారు తిలక్‌గారు. మానవజీవితాన్ని జూదంతో (పేకాటతో) పోలుస్తూ, ఇతిహాసాలను చరిత్రను స్పృశిస్తూ "కాయ్ రాజా కాయ్" అనే వచనగీతం కూడా వ్రాశారు.

ప్రతిరోజూ రాత్రి ఏడుగంటలవేళ, తిరిగి పదిగంటలవేళ ఒక శ్రోత్రియ బ్రాహ్మణుడు తిలక్ వద్దకు వచ్చి, గదిగుమ్మం దగ్గర నమ్రతతో నిలబడేవాడు. అతన్ని చూడగానే తిలక్‌గారు లేచి గదిలోంచి బయటకు వచ్చేసి, ఆ బ్రాహ్మడితో రహస్య సంభాషణ జరిపి, తిరిగి వచ్చేవారు. తన చుట్టూ క్రొత్తవారు ఉన్నప్పుడు మాత్రమే ఇలా చేసేవారు. నే నొక్కణ్ణి ఆయన దగ్గరుంటే గదిలోంచి బయటకు రాకుండానే "ఎంత" అని అడిగేవారు. ఆ బ్రాహ్మడు ఏవో నంబర్లు చెప్పేవాడు. అంతకు ముందుగానే తనవద్ద కూడి ఉంచుకున్న పట్టికను పరిశీలించి తిలక్‌గారు కొన్ని నంబర్లు చెప్పి వెళ్లమనేవారు. నాకు మొదట్లో ఏమీ అర్థమయ్యేది కాదు. తరువాత తరువాత ఊళ్లోవాళ్లు చెప్పుకునే దాన్నిబట్టి అది **"బ్రాకెట్టు ఆట"** అని తెలుసుకొన్నాను.

**"ఈ పనులన్నీ ఏమిటండీ!"** అనేవాణ్ణి ఒక్కొక్కప్పుడు.

**"ఇది ఆడనివాడు ఎవడున్నాడోయ్! కొందరు ధైర్యవంతులు స్వయంగా ఆడుతారు. మరికొందరు పెద్దలు చాటునుంచి ఆడిస్తారు సూత్రధారుల్లాగ! మన ఊళ్లో వేదం వల్లించే శ్రోత్రియ బ్రాహ్మణుడు మొదలుకొని, అంట్లు తోమే అప్పలమ్మ వరకూ ఈ ఆట ఆడుతారు"** అని పక పక నవ్వేవారు.

తిలక్‌గారు చెప్పింది నిజమే! ఆయన దగ్గరకొచ్చే బ్రాహ్మడు మా యింట్లో మా తాతగారి ఆరాధనకు (తద్దినానికి) మడికట్టుకొని, మంత్రాలు గడగడా చదివేవాడు. సద్బ్రాహ్మణుడు కదా అని సంభావన రెండు రూపాయలు ఎక్కువ ఇచ్చేవాణ్ని. ఆ సంభావన పుచ్చుకొని ఆయన బ్రాకెట్ ఆఫీసువైపు దారితీసేవాడు.

బ్రాకెట్ ఆట చాలామంది ఆడుతారు అని, తిలక్‌గారు చెప్పింది ప్రత్యక్షర సత్యమని తరువాత తెలుసుకున్నాను. తిలక్‌గారి కన్నా సీనియర్ సాహిత్యవేత్తలు కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు, కథకచక్రవర్తి శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు కూడా ఈ "బ్రాకెట్ ఆట" (కాటన్ మార్కెట్ ఓపెనింగ్ క్లోజింగు నెంబర్ల మీద బెట్టింగ్ కట్టడం) ఆడేవారు. పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు "మిసిమి" మాసపత్రికలో **"విశ్వనాథతో మధురవాణి ఇంటర్వ్యూ"** అనే వ్యాసం వ్రాశారు. అందులో మధురవాణి చేత ఒక ప్రశ్న అడిగిస్తారు! **"మీరు బ్రాకెట్టు ఆడుతారటగా?"** ఈ ప్రశ్నకు విశ్వనాథవారి సమాధానం : **"అవును జూదం ఒక వ్యసనం. ఓపెనింగూ, క్లోజింగూ ఆ ఛార్టు అంతా నా దగ్గర ఉండేది. నేనేమిటి? కథకచక్రవర్తి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కూడా ఆడేవాడు!".** తిలక్‌గారు **"గొంగళి పురుగులు"** అనే వచనకవితలో **"బ్రాకెట్లు ఓపెనింగులూ క్లోజింగులు"** అని వ్రాశారు.

ప్రముఖ ఉర్దూకవి 'మీర్జా గాలిబ్' పెద్ద జూదగాడు. ఢిల్లీలో ఒక జూదగృహంలో ఉండగా ప్రభుత్వం ఆయన్ని అరెస్టు చేసి, మూడు రోజులు జైల్లో పెట్టింది. అయినా గొప్పకవి కావడం వల్ల కారాగారంలో కూడా ఆయన్ని చాలా గౌరవంగా చూసింది ప్రభుత్వం. రష్యన్ ప్రసిద్ధ రచయిత "దాస్తోవ్‌స్కీ" భయంకరమైన జూదగాడు. ఇవన్నీ ఎందుకు? ఒక్క ముక్కలో చెప్పేస్తాను అసలు విషయం. మహాభారతంలో సాక్షాత్తు ధర్మమూర్తి అవతారమైన ధర్మరాజంతటి మహాత్ముడే సకలసద్గుణ సంపన్నుడే జూదమాడాడు. ఒకసారి కాదు, వరసగా రెండుసార్లు ఆడాడు. మొదటిసారి భార్యను (ద్రౌపదిని) పణంగా పెట్టి ఆడాడు. ఇంతకన్నా దారుణం ఉంటుందా? దుర్యోధనుడు ద్రౌపదీవస్త్రాపహరణ ప్రయత్నంతో ఆమెను అవమానించబోయాడు. శ్రీకృష్ణపరమాత్మ ఆమెను రక్షించాడు. ధృతరాష్ట్రుడు ద్రౌపదికి వరాలిచ్చి, పాండవుల రాజ్యాన్ని వారికి తిరిగి ఇచ్చివేశాడు. పాండవులు ద్రౌపదీ సమేతులై ఇంద్రప్రస్థానికి వెళ్ళిపోతున్నారు. ఇంకా గమ్యస్థానం చేరలేదు. మార్గమధ్యంలో ఉన్నారు. కుటిలుడు, అసూయాపరుడు అయిన దుర్యోధనుడు తండ్రిని ఒప్పించి ధర్మరాజును పునర్ద్యూతానికి పిలిపించాడు. ధర్మరాజు ఏ మాత్రమూ సిగ్గులేకుండా, అంతకు కొన్ని ఘడియలకు పూర్వమే భార్యకు జరిగిన తీవ్రమైన అవమానాన్ని పరగణించకకుండా, తిరిగివచ్చి, మళ్ళీ జూదమాడి, రాజ్యమంతా ఒడ్డి, ఓడిపోయి, అడవుల పాలయ్యాడు. (13 ఏళ్ళు అరణ్యవాసం, ఒక ఏడు అజ్ఞాత వాసం చేశాడు.) అంతేకాదు, ఇంకో విచిత్రం చూడండి. ధర్మరాజు అరణ్యవాసానికి వెడుతూ వెడుతూ ఏమి పట్టుకొని వెళ్ళాడో తెలిస్తే పాఠకులు ఆశ్చర్యపోతారు! తాను, తమ్ములు, భార్య అష్టకష్టాలు పడటానికి మూలకారణమైన జూదంలోని పాచికలు తీసికొని వెళ్ళాడు. బంగారు పాచికలు, వెండి పాచికలు, ఇనుప పాచికలు మూడు సెట్లు భద్రంగా మూటకట్టుకొని పట్టుకొని వెళ్ళాడు ధర్మరాజు! (ఈ పాచికలతోనే అజ్ఞాతవాసంలో విరాటరాజును ఆనంద పరిచాడు.) ఇంతకన్నా వ్యసన పరుడు ఈ భూమండలంలో ఇంకెవరైనా ఉంటాడా? (ధర్మరాజుకన్నా కొన్ని వందల ఏండ్లు పూర్వమున్న నలమహారాజుకూడా జూదంవల్లనే సర్వనాశనమై పోయి, భార్యను కోల్పోయాడు.)

నేను పైన చెప్పిన కవులు, రచయితలు, ధర్మరాజుకన్నా గొప్పవాళ్ళు కారుకదా! విశ్వనాథవారు చెప్పినట్లుగా **"జూదం ఒక వ్యసనం!"** అది ఎంతటి మహాత్ముణ్ణి అయినా సరే లోబరచు కుంటుంది! ఇక మన **"విశ్వనాథ-శ్రీపాద-తిలక్"**లు ఒక లెక్కా? జమా? మన ప్రసిద్ధకవులు, రచయితలలో కొందరు భయంకరమైన త్రాగుబోతులున్నారు. ఆ వ్యసనం వారి కవితాశక్తిని రచనా సామర్థ్యాన్ని తగ్గించలేదు కదా! అలాగే ఈ ద్యూతవ్యసనం కూడా!

### 4. వక్కపొడి - ముక్కుపొడి

తిలక్ గారు ఎక్కువగా వక్కపొడి నమిలేవారు. వక్కపొడి అంటే ప్యాకెట్లలో అమ్మే వక్కపొడి కాదు. పల్చని పోకచెక్కలు ఏరి ఏరి కొనుక్కొనే వారు. ఈ పక్కలు కొనుక్కొనేందుకు వారు ప్రత్యేకంగా రిక్షాలో బజారుకు వెళ్ళి, తెచ్చుకొనేవారు. ఎప్పుడూ వక్క నోట్లో

నానుతూ ఉండవలిసిందే! (విశ్వనాథ సత్యనారాయణగారికీ, తిలక్ గారికీ ఈ విషయంలో చాలా పోలిక ఉంది).

తిలక్‌కు సిగరెట్లూ చుట్టలూ త్రాగే అలవాటు లేదు కాని, ముక్కుపొడి పీల్చందే ఒక్కక్షణం కూడా ఉండేవారు కారు. కాటూరివారికి చుట్టలాగ తిలక్ గారికి ముక్కుపొడుం ట్రేడ్ మార్క్. ఈ ముక్కుపొడుం కూడా ఏ కొట్లో పడితే ఆ కొట్లో కొనుక్కునేవారు కారు. తణుకులో తాలూకా ఆఫీసు ఎదురుగా శ్రీ నూలు సూర్యారావు అనే ఆయన షోడాషాపు పెట్టాడు. ఆయన దగ్గర చాలా ప్రశస్తమైన ముక్కుపొడుం ఉండేది. రిక్షామీద స్వయంగా వెళ్ళి కాని, నాలాంటి శిష్యమిత్రుణ్ణి పంపించికాని, ఆ పొడుం తెప్పించుకొనే వారు. మిత్రుడూ, తిలక్ అభిమాని అయిన శ్రీ చల్లా నరసింహారావు 'మీనా బిస్కెట్ షాప్' పెట్టాక అతనిదగ్గర పొడుం కూడా వాడేవారు. అతడు కేవలం తిలక్‌గారి కోసమే బిస్కెట్ల అమ్మకానికి పొడుం కూడా జోడించాడు. మంచి ముక్కుపొడుం తెప్పిస్తే తిలక్‌గారు తన అంగడికి పదేపదే వస్తారని సంతోషపడేవాడు నరసింహారావు.

ముక్కుపొడుం చిన్న రేకుడబ్బాలో పోసుకొని. ఎడమ చేతితో పట్టుకొనే వారు. కుడిచేతి బొటన వేలు, చూపుడు వేలు–ఈ రెండింటితో ఒకపట్టు పొడుం నొక్కిపట్టి ఉంచేవారు. మాట్లాడేటప్పుడు "do you know? do you know?" అని తరచుగా అనేవారు. ఇది వారి 'మేనరిజం'. ఎడమ అరచెయ్యి, కుడిచేతి వ్రేళ్ళు ఎప్పుడూ ముక్కుపొడుం వాడడంవల్ల దోరగా ఉండేవి. వారి డ్రాయింగ్ రూము అంతా చాలా శుభ్రంగా ఉండేది. కాని వారి పడక కుర్చీకి రెండు వైపులా నేల మీద గోధుమవన్నె త్రాచుపాములాగ పొడుం చీదిన మరకలు చాలా ఉండేవి!!

**"ముక్కుపొడుం పీల్చేవాళ్ళకి ఎప్పుడూ జలుబే"** అనేవారు. ఇంత ప్రియమైన పొడుం డబ్బీ అప్పుడప్పుడు మాయమై పోయేది! దానికోసం వెతుక్కుంటూ ప్రతివాడి మీదా చిరాకుపడేవారు. పనివాణ్ణి పట్టుకొని తిట్టేవారు. **"మీరే ఎక్కడో పెట్టారండీ!"** అని నవ్వుకుంటూ, వాడు దాన్ని వెదకి వెదకి, ఆఖరికి కృతకృత్యుడయ్యేవాడు!!

### 5. అమృతాంజనం

తిలక్ గారికి ఎప్పుడూ పడిశంపట్టి ఉండేది; తలనొప్పి కూడా తరచు వచ్చేది. అందుచేత అమృతాంజనం వాడుతూఉండేవారు. ఎక్కువగా అమృతాంజనం రాయడంవల్ల కణతల దగ్గర చర్మం కొంచెం దాగుపడినట్లు ఉండేది.

తరచుగా మలబద్ధకంతో బాధపడుతూ ఉండేవారు. కాబట్టి ఎక్కువగా 'ఫ్రూటాల్' (FRUTAL) త్రాగేవారు. వీరికి చిన్నప్పటినుండి అజీర్ణ సమస్య ఉందని వీరి తమ్ముడు డి.జి. రామారావుగారు "మా అన్నయ్య" అనే వ్యాసంలో వ్రాశారు. దానివల్ల కాబోలు "ఈనో" (ENO) అనే మందు వాడేవారు. హోమియోపతీ గ్రంథాలు చదివి, ఆ వైద్యంకూడా ప్రయోగిస్తూండేవారు. శ్రీ పెమ్మరాజు రాజగోపాలం అనే మిత్రునివల్లకూడా వీరికి హోమియోపతీ మీద అభిరుచి ఏర్పడి ఉండవచ్చు.

### 6. దుస్తులు

తిలక్‌గారు ఎప్పుడూ తెల్లటి ఇస్త్రీమడతలు ధరించి, వానలో తడిసిన మల్లెమొగ్గలా, పరిశుభ్రంగా ఉండేవారు. తెల్లటి బట్టల్లో వారి ఎర్రటి శరీరం. మంచు అంటుకున్న కాశ్మీర్ యాపిల్ పండులా ఉండేది! గ్లాస్కో పంచె కట్టుకొని, షర్టు లేదా లాల్చీ ధరించేవారు. లాల్చీ తొడుక్కున్నప్పటికన్న షర్టు తొడుక్కున్నప్పుడే అందంగా కనబడేవారు నా కంటికి! టెర్లిన్‌బట్టలు కాని. రంగుబట్టలు కొని తొడుక్కునేందుకు జంకేవారు. లేత రోజారంగులో ఒక్క సిల్కు లాల్చీ మాత్రం ఉండేది. మిగిలిన వన్నీ తెల్లబట్టలే! ఒకరోజు మీటింగుకు ఆ రంగులాల్చీ తొడుక్కొని వెళ్లడానికి చాలా సందేహించారు. ఆయనికి తెల్లటి తెలుపమీదే ఎక్కువ మక్కువ.

### 7. అనుమానం – అతి సుకుమారం

తిలక్‌గారు అతి సుకుమారులు. దీర్ఘకాలం రోగగ్రస్తుడై ఉండడమే దీనికి కారణం కావచ్చు. ఎంత దగ్గరి ప్రదేశమైనా నడిచి వెళ్ళేవారు కాదు. రిక్షా లేందే ఇంట్లోంచి అడుగు బయట పెట్టేవారు కాదు. సొంతంగా ఒక రిక్షా కొనుక్కుని, దాన్ని త్రొక్కడానికొక మనిషిని పెట్టుకొని, కొన్నాళ్లు కాలక్షేపం చేశారు. తరువాత బయట రిక్షాలే ఉపయోగిస్తూ ఉండేవారు. రోజుకు కనీసం ఒక రూపాయి అయినా ఖర్చయ్యేది రిక్షాలకి. కిరాయి దొరకని రిక్షావాళ్ళకి తిలక్‌గారు కల్పవృక్షంలా కనబడేవారు!

**"ఏమిటండి. మీరు మరీ సుకుమారులు!"** అని అంటే – **"ఏంచెయ్యనోయ్? నా హెల్తు మంచిదికాదు. నాకు పల్పిటేషన్ ఉంది"** అనేవారు. 1946 నుంచి 1954 వరకూ **'నెర్వస్ బ్రేక్ డౌన్'** వచ్చి, ఆ ఎనిమిదేళ్ళపాటు మంచంమీదనే ఉండేపోయారట. (వీరికి వచ్చిన వ్యాధిని **"సైకో న్యూరోసిస్"** అంటారు!)

నెలజీతం ఇచ్చి ఒక పనివాణ్ణి పెట్టుకునేవారు. ఏ ఊరు వెళ్ళినా వాడు తమ కూడా రావలసిందే!

నిజానికి రోగంకన్నా ఆయనకు అనుమానం ఎక్కువగా ఉండేది. రాత్రివేళ చేతిలో టార్చిలైటు లేందే బయట అడుగుపెట్టేవారు కాదు. పాములూ తేళ్ళూ ఉంటాయని భయపడేవారు. రాత్రిళ్ళు లఘుశంక తీర్చుకునేందుకు గేటుదాటి రోడ్డు మీదకు వచ్చేవారు. రోడ్డుమీద విద్యుద్దీపం ఉన్నాసరే. చేతిలో టార్చిలేందే వచ్చే వారు కాదు. ప్రతిచోటా ఏదో విషజంతువు లున్నాయనే భ్రాంతితో లైటువేసి పదే పదే చూసేవారు (ఇది నరాలకు సంబంధించిన ఒక విధమైన రోగం). వారితో కబుర్లు చెపుతూ నేను రాత్రి చాలా ప్రొద్దు పోయేవరకు ఉండేవాడిని. మా యిల్లు ఊరు బయట ఉంది. తిలక్‌గారి ఇల్లు ఊరిమధ్య ఉంది. పదకొండు గంటల వేళ **"నేను వెళ్ళివస్తానండి"** అనేవాడిని. **"ఓరి నీ తస్సాదియ్యా! ఇప్పుడెలా వెడతావోయ్ ఆ**

అరణ్యంలోకి? పాము లుండవూ?" అనేవారు తిలక్.

**"ఏమీ. ఫరవాలేదండి, వెడతాను. నాభార్య భోజనం చెయ్యకుండా నాకోసం ఎదురుచూస్తూ ఉంటుంది"** అని చెప్పి వెళ్ళిపోయేవాడిని. ఒక్కొక్కప్పుడు వారింటి వద్దనే భోజనంచేసి, అక్కడే పడుకునేవాడిని.

**8. అతిశుభ్రత**

శుభ్రత విషయంలో కూడా వారికి విపరీతమైన అనుమానం ఉండేది. ఆయన వాడుకునే వస్తువులు ప్రత్యేకంగా ఉంచుకునేవారు. నాలాంటి అతి సన్నిహితులను తప్ప తన బెడ్రూంలోకి ఎవరినీ రానిచ్చే వారు కాదు. ఎవరొచ్చినా డ్రాయింగ్ రూంలో మాటాడి పోవలసిందే! చేతులు డెట్టాల్తో పదేపదే కడుక్కునేవారు. ఏ ఊరు వెళ్ళినా పెద్దపెద్ద హెూటల్లో బసచేసేవారు. ఆ ఊళ్లో బంధువులున్నా సరే హెూటల్లోనే ఉండేవారు. పనివాడిని మంచినీళ్లు తెమ్మనేప్పుడు **"ఒరేయ్! చేతులు శుభ్రంగా కడుక్కొని మంచినీళ్ళు తీసుకురా!"** అనేవారు.

**9. కుటుంబం**

బాలగంగాధర తిలక్‌గారి కుటుంబం చాలా పరిమితమయినది; ఇద్దరు కొడుకులు, ఒక్క కూతురు. పెద్దకొడుకు 'సత్యనారాయణ మూర్తి'. ఇతనికి తిలక్‌గారు తమ తండ్రిగారి పేరు పెట్టుకున్నారు. ఈ కుర్రవాడు **"సత్యశంకర్"** అనే కలం పేరుతో కథలు వ్రాస్తూ ఉండేవాడు. **"వీడు చూడు శుభ్రమైన పేరును ఎలా తగలేసుకున్నాడో!"** అని వేళాకోళం చేసేవారు తిలక్. ఇతనిని **'సత్యం'** అని పిలిచేవారు తిలక్. రెండవవాడు **'సుబ్రహ్మణ్యం'**. కాని తిలక్ గారు ఇతనిని **'సుబ్బన్న'** అని పిలిచేవారు. తండ్రిలాగే అందమైన కుర్రవాడు. (ప్రస్తుతం పెద్దవాడు లండన్‌లోను, రెండవవాడు అమెరికాలోను డాక్టర్లుగా చాలా ప్రసిద్ధులయ్యారు.) ఈ కొడుకు లిద్దరి తరువాత **'చంద్రలేఖ'** అనే అమ్మాయి. ఆరోజుల్లో జెమినీ స్టూడియో అధినేత ఎస్.ఎస్.వాసన్ "చంద్రలేఖ" అనే ఒక అద్భుతమైన సినిమా తీశాడు. అందులో హీరోయిన్ పేరు "చంద్రలేఖ". ఆ పేరే తన కూతురికి పెట్టారు తిలక్. (తిలక్‌గారికి సినిమాలంటే చాలా యిష్టం.) ఈ అమ్మాయి చంద్రలేఖ అంటే తిలక్‌గారికి విపరీతమైన ప్రేమ. **"మా అమ్మాయి మంచి డాన్సరు అవుతుంది. అడయార్ పంపిస్తాను"** అనేవారు. కాని వారి కోరిక నెరవేరలేదు. (ఆచంట జానకిరాంగారు కూడా చంద్రలేఖను అడయార్ కళాక్షేత్రానికి పంపించమని మిక్కిలిగా ప్రోత్సహించారు.) చిన్నతనంలో కొంచెం నృత్యం, వీణ మాత్రం అభ్యసించింది. (1966లో చనిపోవడానికి కొన్ని వారాల ముందు ఈ చంద్రలేఖకు పెండ్లి చేశారు తిలక్) ఈ చంద్రలేఖ తర్వాత ఒక మగశిశువు పుట్టి పోయాడట. ఆ ప్రసవసమయంలో ఇందిరమ్మ (తిలక్‌గారి సతీమణి) గారికి ఆపరేషన్ చేయవలసి వచ్చిందట. అప్పటి నుంచీ ఆమెకు సంతానం కలుగలేదు. "It is a blessing in disguise!" అనేవారు తిలక్‌గారు.

కూతురుకన్నా కొడుకు లిద్దరూ చాలా చురుకైన వాళ్ళు. ఇంట్లో ఎన్నో పుస్తకాలు ఉండడంవల్లా, తండ్రిగారు ఎప్పుడూ ఏదో రచనా వ్యాసంగంలోనూ, కవులతో రచయితలతో సంభాషిస్తూనూ ఉండడంవల్లా వీరిద్దరికీ విపరీతమైన పఠనాసక్తి, రచనా కుతూహలం జనించాయి. (చంద్రలేఖ భర్తతో అమెరికాలో స్థిరపడింది.)

**10. చిరాకు**

పిల్లలమీద కాని ఇతరులమీద కాని తిలక్‌గారు ఎప్పుడూ కోప్పడేవారు గాదు; కొంచెం చిరాకు పడేవారు అంతే! ఆ చిరాకులో **"దొంగముండా కొడకా!"** అని తిట్టే వారు. ఇంతకన్నా పరుషవాక్యాలు మాట్లాడేవారుకాదు. (ఇదే పరుషవాక్యం కదా! ఇతంకన్నా పరుషవాక్యం ఏముంది? అని భావిస్తారేమో! ఆ శబ్దాన్ని తిలక్‌గారు మనమంతా ఉపయోగించేటంత కటువుగా ప్రయోగించే వారు కాదు. మెచ్చుకోలుకు కూడా ఇదే వాడేవారు. పైగా పారుష్యార్థం కోల్పోయిన శబ్దాలలో ఇది ఒకటి). దూషించేటప్పుడూ, భూషించేటప్పుడూ కూడా ఈ శబ్దాన్నే ప్రయోగించేవారు తిలక్. **"ముండాకొడుకు బాగా వ్రాశాడోయ్! ముండాకొడుకు జీనియస్"** అనేవారు కొందరు ప్రతిభావంతులైన ఆధునికుల రచనలను తలచుకొన్నప్పుడు. శ్రీశ్రీ "కవితా! ఓ కవితా!" ను కూడా ఇదే ఊతపదంతో మెచ్చుకొనేవారు. (తిలక్‌గారినుండి ఈ ఊతపదం నాకు కూడా అంటుకుంది. 86 ఏళ్ళు వచ్చినా ఇంతవరకూ వదల్లేదు.)

**11. బంధుప్రీతి**

తమ్ముళ్ళలో గంగాధర రామారావు (తణుకులో లాయరుగా పనిచేశారు) గారంటే తిలక్‌గారికి ఎక్కువ అభిమానం. రామారావు గారికి సంగీతం, సాహిత్యం, అభినయం మొదలైన కళల్లో ప్రవేశం ఉండటమే దీనికి కారణం కావచ్చు. అప్పుడాయన మద్రాసులో లా చదువుతూ ఉండేవారు. ఈయన సెలవులకు తణుకు వచ్చినప్పుడు ఎక్కువ కాలాన్ని అన్నగారి వద్దనే గడిపేవారు. తిలక్‌గారు నూతన రచన ఏం చేసినా నేనూ రామారావుగారూ ప్రథమశ్రోతల మయ్యేవాళ్ళం!

తణుకులోనే ఉంటున్న వేలు విడిచిన బావగారైన ఈమని సత్యంగారినీ (మా "సత్యంబావ!" అని వీరి నెంతో ఆప్యాయంగా పిలిచేవారు తిలక్. వీరు తిలక్‌గారి కన్నా ముందే గతించారు); తన చెల్లెలు ఎల్లమ్మగారి భర్త అయిన పెద్ద ఇంజనీరునూ (వీరు అమెరికాలో హఠాన్మరణం చెందారు); తన మేనకోడలి భర్త అయిన ప్రఖ్యాత వైణికుడు ఈమని శంకరశాస్త్రిగారినీ; తన అన్న బావమరిది ప్రఖ్యాత ఆంగ్ల రచయిత R.M. చల్లాగారినీ ఎక్కువగా తలచుకుంటూ ఉండేవారు తిలక్. తన జబ్బులో అహెూరాత్రాలు సేవచేసిన తన శ్రీమతిని (ఇందిరమ్మగారిని) కూడా తరచు ప్రశంసిస్తూ ఉండేవారు!

### 12. మిత్రమండలి

శ్రీయుతులు మల్లవరపు విశ్వేశ్వరరావు, పాలగుమ్మి పద్మరాజు, పిలకా గణపతి శాస్త్రి, సంపత్ రాఘవాచారి, సూరంపూడి భాస్కరరావు, భీమశంకరం వీళ్లు తిలక్‌గారికి సన్నిహిత మిత్రులు. వీరిని చాలా ఎక్కువసార్లు తలచుకుంటూ ఉండేవారు. **"గణపతిశాస్త్రీ, సంపత్తూ నాకు** family friends" అనేవారు తిలక్. శ్రీయుతులు అనిసెట్టి సుబ్బారావు, అబ్బూరి వరదరాజేశ్వరరావు, తాపీ ధర్మారావుగారి పుత్రులూ, రాయప్రోలు సుబ్బారావుగారి పుత్రులూ (రాజశేఖర్, సుబ్రహ్మణ్యం). అడివి బాపిరాజుగారు, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు కూడా వీరికి సఖులే. **"అడివి బాపిరాజు మా యింటికి వచ్చినప్పుడు నాతో వారం రోజులు గడిపితేనే కాని వెళ్లేవాడు కాదు"** అనేవారు. దేవులపల్లివారిని చిన్నతనంలో బాగా అనుకరించారు తిలక్. ఆయన శిల్పం అంటే చెవికోసుకునేవారు. కృష్ణశాస్త్రిగారి ఉపన్యాసాన్ని పదే పదే మెచ్చుకొనేవారు. గోరాశాస్త్రిగారి రచనల యెడల విపరీతమయిన అభిమానం చూపేవారు తిలక్. (1959 లో హైదరాబాద్ వెళ్ళినప్పుడు దేవులపల్లివారినీ, గోరాశాస్త్రిగారినీ కలుసుకున్నారు). **"శ్రీశ్రీ నన్ను ఎరుగును కాని, కృష్ణశాస్త్రితో ఉన్నంత పరిచయం అతనితో నాకు లేదు"** అనేవారు.

ఇటీవల కాలంలో (అంటే చనిపోవడానికి పది సంవత్సరాల క్రితంనుంచి) శ్రీయుతులు శ్రీపాద కృష్ణమూర్తి, తంగిరాల వెంకట సుబ్బారావు, ఏలూరిపాటి అనంతరామయ్య (అనంతం), చల్లా నరసింహారావు, వరవరరావు, వెల్చేరు నారాయణరావు – ఇంకా అనేకమంది యువరచయితలూ, కవులూ వీరి మైత్రిని మహాభాగ్యంగా భావించి అనుయాయులయ్యారు. బాలగంగాధర తిలక్‌గారికి అనుయాయులు ఏర్పడినా, మిత్రులు ఏర్పడినా కేవలం వారి రచనలలోని పసతో ఆకృష్టులై దగ్గరకు వచ్చిన వారే కాని, సాహిత్య సమితులవల్లనూ, రాజకీయ ప్రాబల్యంవల్లనూ, ముఠాతత్త్వంవల్లనూ ఏర్పడినవారు కారు! ఇది ముఖ్యంగా గమనింపదగిన విషయం! దీనివల్లనే తిలక్ రచనాపాటవం ఎంతటి మహత్తరమైనదో గుర్తించ గలుగుతాం!!

### 13. మొహమాటం

**'ఎంతటి ఆప్తమిత్రునితోనైనా సరే మొహమాటం లేకుండా నిజం చెప్పాలి'** అనుకునేవారు బాలగంగాధర తిలక్. కాని మరుక్షణమే ఆ మిత్రుడు. బాధ పడతాడేమోనని జంకేవారు. ఒకసారి సూరంపూడి భాస్కరరావుగారు ఒక గేయకావ్యం వ్రాసి, దానికి పీఠిక వ్రాయమని తిలక్‌గారికి పంపారు. (తణుకు వాస్తవ్యులైన ఈ భాస్కరరావుగారు ఆరోజుల్లో అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో సంస్కృతోపన్యాసకులుగా పనిచేసేవారు.) ఆ కావ్యంలో ఒకటి రెండు శీర్షికలు తప్ప మిగిలినవన్నీ చాలా పేలవంగా ఉన్నాయి. దానిలో ఉన్న లోపాలన్నీ స్పష్టంగా వ్రాసి, రిజిస్టరు పోస్టులో భాస్కరరావుగారికి పంపివేశారు తిలక్. పోస్టాఫీసునుంచి ఇంటికి వచ్చారు. ఆయన మనస్సులో ఆందోళన ప్రారంభమైంది. నాతో మెల్లగా ఇలా అన్నారు– **"చూడు సుబ్బారావ్! పాపం నామీద ఎంతో గౌరవంతో పీఠిక వ్రాయమని పంపించాడు. నేను చాలా హార్ష్‌గా వ్రాశాను. అతనొక్కడూ చదువుకుంటే పరవాలేదు. కాని అది ప్రింటవుతుంది. అందరూ చదువుతారు. అతని కవిత్వాన్ని పరిహసిస్తారు. అతడు బాధపడతాడు! ఛీ! చాలా పొరపాటు చేశాను. మళ్ళీ మార్చి వ్రాస్తాను. ఈ రోజు పంపిన పీఠిక ముద్రించ వద్దని వెంటనే వైరిచ్చిరా!"** అన్నారు. అలాగే అని నేను వెళ్ళి టెలిగ్రాం యిచ్చివచ్చాను.

మర్నాడు మరో పీఠిక వ్రాశారు. కావ్యాన్ని పొగడుతూ వ్రాసి పంపించారు. కాని భాస్కరరావుగారు **"నీవు మొదట వ్రాసిన పీఠికే నిజమైనది. దానినే నేను పీఠికగా ముద్రించుకుంటున్నాను."** అని జవాబిచ్చారు.

**"హారి వీడి తస్సాదియ్యా.....చూడు ఇతనికి నామీద ఎంత గౌరవమో!"** అన్నారు తిలక్, సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోతూ.

ఇలాగే మరి కొందరు ప్రసిద్ధ కవిమిత్రుల రచనల పేలవత్వాన్ని గురించి కూడా యథార్థం చెప్పాలని చాలాసార్లు అనుకున్నారు కాని, మొహమాటం అడ్డు రావటంవల్ల చెప్పలేకపోయారు. నా దగ్గర మాత్రం ఏకాంతంగా వారి లోపాలన్నీ చెప్పేవారు.

### 14. పెద్దమనుషులు

అక్రమంగా డబ్బు నిలవజేసి, పరువూ ప్రతిష్ఠా అంటూ, డబ్బుతో ప్రతీ దాన్నీ కప్పి పుచ్చుకుంటూ, మానవత్వం కరుణా ఏ మాత్రం లేకుండా, భగవద్గీత ఉపన్యాసాలు శ్రద్ధగా వింటున్నట్టు నటిస్తూ, శ్రీరంగ నీతులు చెపుతూ సిద్ధమకర ధ్వజం గుళికలు సేవిస్తూ ఉండే ముసలివాళ్ళంటే తిలక్‌గారికి విపరీతమైన అసహ్యం. ఇటువంటి పెద్దమనుష్యులు అన్ని ఊళ్ళల్లో ఉన్నట్టుగానే మా ఊళ్లోనూ ఉన్నారు. సాయంకాలం అయ్యేసరికి టౌన్‌హాల్ పార్కులో సిమెంటు బెంచీల మీద చేరి, పెద్ద పెద్ద కేకలు పెడుతూ ఉపన్యాసాలు దంచేసేవారు. వాళ్ళని నాకు చూపుతూ **"చూడు చూడు! ఆ ముసలి వెధవలు ఎలా కబుర్లు చెపుతున్నారో?"** అనేవారు తిలక్. **"మనం కూడా కొన్నాళ్ళకి అలా అవుతాం కదా?"** అనేవాడిని నేను. **"శరీరానికి ముసలితనం రావచ్చును కాని, ఆలోచనలకు ముసలితనం రాకూడదు సుబ్బారావ్!"** అనేవారు తిలక్.

తన కవిత్వంలో వీలైన చోటల్లా ఈ ముసలి పెద్దలను ఏకేసేవారు తిలక్! **"జరీ కండువా పెద్దపులులు..."** అనీ, **"గడుసుదనం, మోసం. పరువూ ప్రతిష్ఠలనే గాడిదలమీద బ్రతుకుపాతబట్టల మూటల్ని వేసి తోలుతున్న వాళ్ళ"**నీ అధిక్షేపించారు.

### 15. నాటకాలూ – సినిమాలూ

ఔత్సాహిక నాటకాలన్నా, సినిమాలన్నా తిలక్‌గారికి చాలాఇష్టం.

మార్గనాటకాల (పద్యనాటకాల) విషయం ఆయనకు తెలియదు. ఎప్పుడూ చూడలేదు. నాకు పద్యనాటకాలంటే మహాప్రాణం. రఘురామయ్య, అబ్బూరి, పీసపాటి, షణ్ముఖి మొదలైన మహానటులు కృష్ణపాత్రలు ధరించి, కురుక్షేత్రం నాటకంలో పద్యాలు పాడుతుంటే నేను ఆనంద వివశుడనైపోతాను! ఈ నటులను గురించీ, వీరి పద్యపఠనాన్ని గురించీ తిలక్‌గారితో అప్పుడప్పుడు చెపుతూ ఉండేవాడిని. **"అది సంగీత కచ్చేరీ కాని నాటకం కాదు. నటన అంతకన్నా కాదు. వాళ్ళని కుర్చీవేసి కూర్చోబెట్టి ఆ పద్యాలు పాడించుకున్నా సరిపోతుంది"** అనే వారు తిలక్. నేను వారి అభిప్రాయం సరికాదని వాదించేవాడిని.

నిజానికి తిలక్‌గారు ఎప్పుడూ పద్యనాటకాలు చూడలేదు. **"మీరు ఆ మహానటుల పద్యాలు వినలేదు. అందుకనే ఇలా వాదిస్తున్నారు. ఒకసారి విని ఆ తర్వాత మాట్లాడండి. షణ్ముఖి ఆంజనేయరాజుగారిది మన తణుకే! ఆయన పద్యం పాడుతూంటే అమృతం సేవిస్తున్నట్టు ఉంటుంది. 'ఆంధ్ర బాల గంగధర్వ' అని ఆయన బిరుదు. ఆయన పద్యం ఒక్కసారి వినండి!"** అన్నాను. నేను ఒక్కడే కాకుండా, మరో మిత్రుడు కూడా తిలక్‌గారికి ఈ విషయంలో ఇదే సలహా ఇచ్చాడు. తిలక్‌గారు ఒప్పుకున్నారు. ఆంజనేయరాజుగారి ఇంటికి వెళ్ళి పద్యాలు వినడానికి కూడా తీర్మానించుకున్నారు. (కాని తర్వాత వెళ్ళినట్టు లేదు. ఆ రాజుగారు ఎక్కువగా ఊళ్లో ఉండకపోవడం, ఉన్నా సరే నిత్యం 'సుర' లోకంలో ఉండడం కారణంగా తిలక్ వీరిని దర్శించలేకపోయారు).

మార్గనాటకాల పద్యాలు పాడే 'వెంకన్న' అనే యువకుడు తిలక్‌గారి దగ్గరకొచ్చి ఏకపాత్రాభినయానికి ఒక స్క్రిప్టు వ్రాసి పెట్టమని అడిగాడు. తిలక్ 'సరే'నని **'భరతుని స్వగతం'** వ్రాసిపెట్టారు. అందులో నాలుగుగైదు పద్యాలు కూడా వ్రాశారు. ఆ పద్యాలు వెంకన్న రాగాలాపనతో పాడుతుంటే మెచ్చుకున్నారు కూడా. అందుచేత తిలక్‌గారికి పద్యనాటకాలు చూడకపోవడం మూలాన వైముఖ్యం ఏర్పడింది కాని, నిజంగా ఆయన పద్యనాటక ద్వేషికాదు! జగత్ప్రసిద్ధికెక్కిన కూచిపూడి భాగవతుడు వేదాంతం సత్యనారాయణ గారి "ఉషాపరిణయం" చూడడానికి పనిగట్టుకొని, తణుకుకు ఆరుమైళ్ళ దూరంలో ఉన్న రేలంగి గ్రామం వెళ్ళారు తిలక్!! శ్రీ భద్రం (రేలంగి గ్రామం) అనే రచయిత వ్రాసిన "పల్నాటి యుద్ధము" అనే పద్యనాటకానికి ఈయన పీఠిక వ్రాశారు!

ఔత్సాహిక (సాంఘిక) నాటకాలంటే తిలక్‌గారికి చెప్పలేనంత యిష్టం. తణుకు చుట్టుప్రక్కల ఎక్కడ నాటకప్రదర్శనం జరిగినా వీరిని ఆహ్వానించేవారు. ఏదో పిలిచారని అలక్ష్యం చెయ్యకుండా, తప్పక ఆ ప్రదర్శనలకు హాజరయ్యే వారు తిలక్. ఒకసారి తణుకులో **"పల్లెపడుచు"** నాటకం చూసి, అందులో 'గంగులు'. పాత్రకు ముగ్ధులై అతనికి స్వయంగా ఒక బహుమతి నిచ్చారు. ఆంధ్రనాటక కళాపరిషత్ పోటీలు 1959 లో తణుకులో జరిగినప్పుడు విడవకుండా ప్రతీనాటకాన్నీ చూశారు తిలక్. బాగా నటించే యువకులు ఉన్నారనీ, రచనలు మాత్రం సరైనవి రావడంలేదని అంటూండేవారు. **"అమెరికా ఇంగ్లండు దేశాలలో లాగ నెలల తరబడి ఆడే నాటకాలు రావాలి"** అనేవారు. శ్రీ నాగభూషణం (రవీ ఆర్టు థియేటర్స్-మద్రాసు) ప్రదర్శించే **"రక్తకన్నీరు"** నాటకాన్ని తణుకులో ఆ రోజుల్లో రెండుసార్లు ప్రదర్శించారు. తిలక్‌గారు ఆ ప్రదర్శనాన్ని చూసి, చాలా మెచ్చుకున్నారు. **"నాటకంలో ఒట్టి వచనమేకాదు; పాట, పద్యం, నృత్యం అన్నీ ఉండాలి. సెట్టింగులు బాగుండాలి. ప్రదర్శన త్వరత్వరగా జరగాలి. ఇవన్నీ ఉన్నాయి కాబట్టే రక్తకన్నీరు నాటకం విజయం సాధించింది"** అన్నారు.

1957 లో తణుకు పూర్వ విద్యార్థి సంఘం వార్షికోత్సవానికి నాటికల పోటీ పెట్టారు. నేను అందులో పాల్గొనే నిమిత్తం ఒక నాటిక వ్రాసిపెట్టమని తిలక్ గారిని అడిగాను. **'సుచిత్ర'-'సుబ్బారావు'** అనే నాయికా నాయకులతో **"విచిత్ర ప్రణయం"** అనే నాటిక వ్రాశారు.

నేను నిరంతరం తిలక్‌గారితో ఉండటంవలనా, మా పరిచయం అత్యంత సన్నిహితం కావడంవల్లా వారిరచనల్లో నాపేరు ఎక్కువగా దొర్లుతూ ఉండేది. **"నీ మీద వ్రాస్తాను చూడు!"** అని చెప్పి **'సుందరీ-సుబ్బారావు'** అనే కథ వ్రాశారు. అలాగే ఈ **"విచిత్ర ప్రణయం"** నాటికలో హీరోకి నాపేరు పెట్టాడు.

**"నాటికలో హీరో పేరు మార్చి వెయ్యండి. లేకపోతే నేను వేషం వెయ్యను"** అన్నాను నేను.

"ఏం?" అన్నారు తిలక్.

**"నాపేరూ, హీరో పేరూ ఒక్కటే. అంతా హాస్యం. పైగా ఆ హీరో, రోడ్ల వెంబడి హీరోయిన్ వెనకాల eve-teaser లాగా పడతాడు. రేపటినుండి హైస్కూలు పిల్లలు నన్ను వేళాకోళం చేస్తారు."** అన్నాను.

**"అయితే నీ యిష్టం వచ్చిన పేరు పెట్టుకో. హీరో వేషం మాత్రం నువ్వే వెయ్యాలి"** అన్నారు తిలక్.

నేను 'సుబ్బారావు' అనే హీరో పేరు తీసివేసి **"శేఖర్"** గా మార్చాను. (కాని అలా మార్చినందుకు ఇప్పుడు బాధపడుతూ ఉంటాను. శేఖర్ పేరుకన్నా సుబ్బారావు పేరులోనే ఎక్కువ తెనుగుతనం ఉంది). ఆ నాటిక బ్రహ్మాండమైన విజయాన్ని సాధించింది. నాకు ప్రథమ బహుమతి వచ్చింది. ఒక్కొక్క డైలాగ్ వినేసరికి ప్రేక్షకులు పొట్ట చెక్కలయ్యేలా నవ్వేవారు. ఇది వీరి మొట్టమొదటి నాటిక!

1958లో తణుకు టౌనుహాలు వార్షికోత్సవానికి తిరిగి ఇదే నాటికను ప్రదర్శించాము. అప్పుడు కూడా అద్భుత విజయాన్ని సాధించింది. ఈ నాటిక తరువాత **'సుచిత్రప్రణయం'** అనే పేరుతో

భారతి 1958 అక్టోబరు సంచికలో వచ్చింది. (కాని ముద్రణలో చివర కొంచెం అస్తవ్యస్తంగా పడింది. నాటికను వీరి బావమరది పెయిర్ చెయ్యడంలో ఈ పొరపాటు జరిగింది. చాలామంది నటులు ఈ పొరపాటును గుర్తించకుండానే ప్రదర్శించి వేశారు!)

ఇదే సంవత్సరం **"సుశీల పెళ్ళి"** అనే పెద్ద నాటకం వ్రాశారు తిలక్‌గారు. మన ఆచారాల మీదా, సంఘం మీదా, చాలా విప్లవాత్మకమైన సిద్ధాంతాలు లేవదీశారు ఈ నాటకంలో. ఒక సన్నివేశంలో భర్త, భార్యమెడలోని మంగళసూత్రాన్ని త్రెంచివేసి, ప్రేమించిన వ్యక్తితో వెళ్ళిపొమ్మని ఆదేశిస్తాడు తన భార్యను! ఈ నాటకాన్ని 'నింబుల్స్ ఎసోసియేషన్' (పాతవూరు) వారు తణుకు మారుతీ టాకీసులో ప్రదర్శించారు. వీరి నాటకాలలో ముఖ్యమైన పాత్రలను మిత్రుడు శ్రీ చిట్టూరి సూర్యారావు చాలా సామర్థ్యంతో నటించేవాడు.

తణుకులో నటనాభిలాషులైన యువకులందరినీ సమకూర్చి, 1959 లో **"బృందావన కళాసమితి"**ని ఏర్పాటు చేయించారు తిలక్‌గారు. నేను దానికి ప్రధాన కార్యదర్శిని. ఈ సమితి ఆంధ్ర నాటక కళాపరిషత్తులో పాల్గొనే నిమిత్తం "సాలె పురుగు" అనే నాటకాన్ని వ్రాశారు ఆయన. ఈ నాటకానికి శిక్షణ యిచ్చేటందుకు డా॥ గరికిపాటి రాజారావుగారి ట్రూపులో హీరో వేషాలు వేసే శ్రీ సత్యనారాయణ అనే నటశేఖరుణ్ణి రాజమండ్రీ నుంచీ, శ్రీ పి.యస్. భాస్కరరావు అనేవారిని కాకినాడ నుంచీ రప్పించారు తిలక్. ఈ నాటకంలో హీరో పాత్రకు సరియైన వ్యక్తి లభించకపోవడం మూలాన కళాపరిషత్తులో పాల్గొనలేకపోయాము. కాని 1960 టౌనుహాలు వార్షికోత్సవానికి ఇదే నాటకాన్ని డాక్టర్ తేతలి నరసింహారావుగారు సమర్థవంతంగా ప్రదర్శించారు. (ఈ నాటకం పేరును "సాలెగూడు" గా మార్చి తరువాత కాలంలో ముద్రించారు.)

**ఇక సినిమాల విషయం :** వచ్చిన ప్రతిసినిమానూ చూసే అలవాటుంది తిలక్‌గారికి. ఏవో కోర్టు వ్యవహారాలమీద తరచుగా రాజమండ్రి వెళ్ళేవారు. వెళ్ళినప్పుడల్లా రెండు మూడు సినిమాలు చూసి వచ్చేవారు. ఇంగ్లీషు, హిందీ చిత్రాలు కూడా ఎక్కువ చూసేవారు. ('వీరకంకణం', 'అనగనగా ఒక రాజు' 'ఝనక్ ఝనక్ పాయల్ బాజే', 'దో ఆంఖేన్ బారా హాత్', 'వీరపాండ్య కట్టబ్రహ్మన' మొదలైనవి ఏడెనిమిది సినీమాలు తిలక్‌గారితో కలిసి చూశాను నేను.) ఇంగ్లీషు చిత్రాల్లో 'గ్రేటా గార్బో', 'మార్లెన్ మన్రో', హిందీ చిత్రాల్లో 'సుచిత్రసేన్', తెలుగు చిత్రాల్లో 'భానుమతి' తిలక్‌గారికి మిక్కిలి ఇష్టమైన తారలు! మాయాబజార్ సినిమాలో ఎన్.టి. రామారావు గారు ధరించిన కృష్ణపాత్ర సౌందర్యాన్ని మిక్కిలిగా ప్రశంసించేవారు. (ఈ కృష్ణపాత్ర చిత్రంతో ఉన్న కాలెండర్ ఒకటి వారి డ్రాయింగ్ రూంలో ఉండేది). బెంగాలీ తార సుచిత్రాసేన్ అంటే వీరికి చాలా ఇష్టం. 'విచిత్ర ప్రణయం' నాటికలో నాయికకు 'సుచిత్ర' అని పేరు పెట్టడానికి కారణం వీరికి ఆ బెంగాలీ తారపై గల అభిమానమేనని నాతో స్వయంగా చెప్పారు.


కాని తిలక్‌గారు అరవ సినిమాలనూ, వారి హాస్యాన్ని ఆక్షేపించేవారు. మేమిద్దరం కలిసి తణుకులో వేంకటేశ్వరా టాకీస్‌లో "అనగనగా ఒకరాజు" అనే తమిళం నుండి తెలుగులోకి డబ్బైన చిత్రాన్ని చూస్తున్నాము. ఎం.జి. రామచంద్రన్ హీరో, భానుమతి హీరోయిన్. భానుమతి తిలక్‌గారి అభిమానతారకాబట్టి ఆమె నటించిన ప్రతిసినిమా చూచేశారు. సినీమా మధ్యలో తిలక్ నాతో ఇలా అన్నారు, **"చూడు సుబ్బారావ్! ఒక సుత్తి పట్టుకు రాగలవా?"**


**"ఎందుకండీ?"** అన్నాను నేను తెల్లబోతూ...

**"ఆ హీరో మూతిమీద కొట్టడానికి. వాడి ముందుపళ్ళు కొంచెం ఎత్తుగా ఉన్నాయి. సుత్తితో కొడితే సర్దు కొంటాయి!"** అన్నారు పక పకా నవ్వుతూ!!

అలా అని ప్రతీ అరవ సినిమానీ ఆక్షేపించేవారని అర్థం కాదు. **'వీరపాండ్య కట్టబ్రహ్మన'** సినిమా చూస్తుంటే కట్టబ్రహ్మన్నను ఉరితీసే ఘట్టంలో తిలక్‌గారికి శోకం కంఠపూర్తి అయిపోయింది. కట్టబ్రహ్మన తెల్లవాడిపై కత్తి దూసి **"ఒరేయ్ తెల్లవాడా నీకు పన్ను కట్టాలా? ఎందుకు కట్టాలిరా పన్ను? నువ్వు దుక్కు దున్నావా? నారు పోశావా, నీరు పెట్టావా, చెమటోడ్చి చేలో పనిచేశావా? ఎందుకు కట్టాలిరా నీకు పన్ను?"** అని ప్రశ్నిస్తుంటే, భూస్వామీ, ఆగర్భశ్రీమంతుడూ అయిన తిలక్ విపరీతంగా సంచలించిపోయి **"చూడు చూడు సుబ్బారావ్! ఆ మాటలు ఒక్క ఇంగ్లీషువాడికే కాదోయ్! మనకి కూడా తగులుతున్నాయ్!"** అన్నారు. కుప్ప నూర్చి రైతు ధాన్యం ఇంటికి పట్టుకువస్తే గాదెల్లో పోసుకోవడం తప్ప, అసలు పొలం ఎక్కడుందో కూడా తెలియని బ్రాహ్మణ ఈనాందార్లు చాలామంది ఉన్నారు మా ప్రాంతంలో.

ఈ మధ్య మా తణుకులో ఇద్దరు ముగ్గురు సినిమా ప్రొడ్యూసర్లు బయలు దేరారు. "పరమానందయ్య శిష్యులకథ" - "గాంధారి గర్వభంగం" వంటి విజయవంతమైన చిత్రాలు కొన్ని తీశారు. వీరు భవిష్యత్తులో తిలక్‌గారిని ఆహ్వానించి మంచి పాటలు వ్రాయించు కుంటారని ఆశించాను. కాని భగవంతుడు వీరికి ఆయుర్దాయమూ ఇవ్వలేదు...!! వారికి అంత మంచి ఆలోచనా రానివ్వలేదు.





# మూసీ పదవినోదం - 31

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 3 ల | | 8 గా | 5 | ర | | లక్ |
| 2 ర | | కం | | య | | X | 7 |
| 4 | మా | X | 6 | న | X | 20 | X |
| ల | 9 | X | హ | X | 17 | ర | 21 |
| X | 10 ము | 11 | మం | | పం | X | ష |
| 13 | X | 12 ని | | ల | | 19 క | |
| 14 క | 15 | జ | X | 18 | చే | | న |
| 16 | త | | లు | X | 22 | వ | X |

**ఆధారాలు (అడ్డం)**

1. స్వరాజ్యం నా జన్మహక్కు అని పలికిన స్వాతంత్ర్య నాయకుడు, అమృతం కురిపించిన కవి ఇద్దరూ ఇందులో ఉన్నారు (8)
2. రసపట్టు, కుతూహలము (6)
4. ఉర్దూలో వినేవాడు - శ్రోత (2)
6. అల్పమైన వర్షము (2)
9. సద్గుణములతో అందరిని కట్టివేసిన మహారాజు తడబడ్డాడు (2)
10. దేవాలయములో గోపురమునకు దగ్గరగా ఉండు మండపము(5)
12. నిటీలపు కతలో (నుదుటియొక్క కథ) ఒక్క అక్షరం మారింది (6)
14. శివుని జటాజూటములో ముడిపోయింది (3)
16. ఈ సుఖాలు ఆభ్యంతరము, బాహ్యమని రెండు రకాలు (4)
17. వైరము (3)
18. చైతన్యం కలవాడు (4)
22. పదియాతేండ్లు మొదలు ముప్పదియేండ్ల వరకుగలవయసు ఉన్న వాడు (2)

**ఆధారాలు (నిలువు)**

1. రాయలసీమ ప్రాంతంలో నామకరణము, తెలంగాణములో తొట్టెల(4)
3. ప్రకాశించుచున్నది (5)
5. సంస్కృతంలో పానము, త్రాగుట (3)
7. వాడు ఇటు ఇటయి....... ఇచ్చాడు (2)
8. దాసోహమంటే అను ప్రశ్న మాండలిక ఉచ్చారణలో ఒక అక్షరము ముందుగా చేర్చి పలికితే ఇలా ఉంటుంది (6)
11. గనుల నుండి త్రవ్వి తీయబడిన లోహము (4)
13. చేదుగా ఉండే కూర (3)
15. తీగ (2)
17. ఈ పదానికి వేగముగా కొట్టుట, వేగముగా ఆజ్ఞను నిర్వర్తించుట అని రెండు అర్థాలు (5)
19. పంటకాలవ నుంచి పొలానికి తీసిన కాలవ (3)
20. తొమ్మిదవ నందుని భార్య. ఈమె కొడుకు చంద్రగుప్తుడు
21. కపటత్వము మొత్తం పోలేదు కాని చివరి అక్షరం తుడిచిపెట్టుకు పోయింది (5) **(సమాధానాలు ఈ సంచికలోనే మరో పేజీలో....)**

నిర్వహణ


**డా. తాడేపల్లి పతంజలి**

ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట.

ఫోన్ : 98666 91587

## సత్సంగం

### సుషుప్తీ, మనోలయం, సమాధీ



సుషుప్తిలో మనస్సు విలీనం అవుతుందే గాని, వినాశం కాదు. విలీనమయినది మళ్ళీ ఉదయిస్తుంది. ధ్యానంలో కూడా అట్లా జరుగవచ్చు. ధ్వంసమైన మనస్సు మళ్ళీ ఉదయించలేదు. మనస్సుని నాశనం చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలి గానీ - లయంలో ఇంకిపోవటాన్ని కాదు. ధ్యానంలో కలిగే శాంతిలో మనోలయం సంభవం, కాని అది చాలదు. మనస్సుని ధ్వంసం చేయాలంటే వేరే కొన్ని అభ్యాసాల అవసరముంది. ఏదో ఒక అల్పమైన భావం వల్ల యోగంలో, సమాధిస్థితిలో పడేవారున్నారు - అయినా, చాలాకాలం తరువాత మెలకువ వచ్చినా, ఆ భావంతో మేల్కొంటారు. ఈ లోగా ఈ లోకంలో కొన్ని తరాలు వచ్చి, వెళ్ళి ఉండవచ్చు. మనస్సుని నిజంగానే ధ్వంసం చేయటమంటే, మనస్సు ఆత్మకి భిన్నం కాదని గుర్తించటమన్నమాట. ఇప్పుడు కూడా, మనస్సంటూ ఏమీ లేదు. దీనిని గ్రహించు. నీ ప్రమేయమే లేకుండా జరిగే నిత్యకృత్యాల బట్టే ఆ విషయాన్ని గ్రహించగలుగుతావు. వాటిని జరిపించే మనస్సు నిజం కాదనీ, ఆత్మ నుండి ఉదయించే భూతమనీ తెలుసుకో. మనస్సును ఆ విధంగానే ధ్వంసం చేయాలి.

కేవల సమాధి, సహజ సమాధి .. ఈ రెండు అవస్థలలోనూ మనస్సు ఆత్మానందంలో మునిగి ఉంటుంది. మొదటి దాంట్లో భౌతిక పరిస్థితులలో మార్పులు ధ్యానం చేసుకునే వానికి అంతరాయం కలిగించవచ్చు. దీనికి కారణం, మనస్సు పూర్తిగా ధ్వంసం కాకపోవటమే. అది ఇంకా సజీవంగానే ఉంది. సుషుప్తి తర్వాత అయినట్లే, ఎప్పుడైనా తిరిగి పని చేయవచ్చు. నీళ్ళలో పూర్తిగా మునిగిన బాల్చీని దానికి తగిలియున్న తాడుతో ఎప్పుడైనా పైకి లాగవచ్చు, అట్లాగే ఇదీను. సహజస్థితిలో అంతరాయం చెందటానికి గాని, లోకంలోకి తిరిగి రప్పించటానికి గాని ఏమీ మిగిలి ఉండదు. నిద్రలో తల్లి పాలు త్రాగినా, ఆ విషయమే ఎరుగని శిశువు స్థితి వంటిదే ఇది.

# ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం – కరపత్రాల దోహదం

**వేల్పుకొండ వెంకటేశ్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఫోన్ : 9949574058

చరిత్ర రచనకు ప్రధాన ఆకరాలు పురావస్తు ఆధారాలు, సాహిత్య సమాచారం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వచ్చిన తర్వాత వర్తమాన చరిత్ర మొత్తం వివిధ రూపాల్లో నిక్షిప్తం అవుతోంది. కానీ ఆధునిక కాలానికి పూర్వపు సమాజాల చరిత్రను అధ్యయనం చేయడం కోసం, నిక్షిప్తం చేయడం కోసం, తర్వాతి తరాలకు ఆ సమాచారాన్ని పంచడం కోసం ఉన్న ఆకరాలు కేవలం పురావస్తు ఆధారాలు, సాహిత్యం మాత్రమే మౌలికంగా దోహదపడ్డాయి. ప్రఖ్యాత చరిత్రకారుడు డి.డి.కోశాంబి చరిత్ర రచనకు ఆకరాలుగా పురావస్తు ఆధారాలు, సాహిత్యం మాత్రమే కాకుండా వర్తమాన మానవ సమాజంలో అనూచానంగా వస్తున్న, సాంస్కృతిక ప్రసరణంగా ప్రవహిస్తోన్న అనేకానేక సాంస్కృతిక విషయాలు కూడా ఒకానొక ఆకరంగా స్వీకరించాలని నూతన ఆకరాన్ని బోధించాడు. అయినప్పటికీ ఆయన కూడా పురావస్తు, సాహిత్య ఆధారాల కచ్చితత్వాన్ని, నిర్దిష్టతను తోసిపుచ్చలేదు. ఏ కాలంలోనైనా, ఏ సమాజంలోనైనా చరిత్ర రచనకు ఈ మూడు ఆకరాలే ఇప్పటికీ మూల ధాతువులుగా నిలుస్తున్నాయి.

చరిత్ర నిర్మాణంలో సాహిత్యానిది వర్ణనాత్మక వనరు. భారతీయ సమాజ నిర్దిష్టత గురించి చెప్పినప్పుడు వేదాలు, ఉపనిషత్తులతోపాటు మహాభారతం, రామాయణం మొదలైన రచనలు వెలకట్టలేని సమాజ చరిత్రను నిక్షిప్తం చేశాయి. వాటి తర్వాత వచ్చిన అనేకానేక పురాణేతిహాసాలు కూడా ఆ పాత్రను సమర్థవంతంగా నిర్వహించాయి. 21వ శతాబ్దంలో జీవిస్తున్న మన ఆరాట పోరాటాలను కూడా తర్వాతి తరాలకు అందించడం కోసం వర్తమాన సాహిత్యం ఎంతో దోహదకారిగా ఉన్నదనడంలో అతిశయోక్తి లేదు.

హైదరాబాదు రాష్ట్రం స్వతంత్ర రాజకీయార్థిక, సామాజిక, సాంస్కృతిక ప్రత్యేకతలు కలిగిన ఒక భౌగోళిక ప్రదేశం. ఇక్కడి ప్రజలకు ఏనాడూ ఆంధ్రా, రాయలసీమవారితో కలిసి జీవించాలని లేదు. కానీ స్థానిక ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ఆంధ్రా, రాయలసీమ, హైదరాబాదు రాష్ట్రం (ఇప్పటి తెలంగాణ) ఈ మూడింటినీ కలిపి 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు జరిగింది. ఆనాటికి దేశవ్యాప్తంగా ఆంగ్లేయ పాలనలోని ప్రావిన్సీలు, ప్రెసిడెన్సీలు, రాచరికంలోని ఆస్థానాలు మాత్రమే ఉండేవి. వీటి స్థానే, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత స్వతంత్ర భారత నిర్మాణం కోసం రాష్ట్రాల పునర్విభజన చేయాల్సిన అవసరం ఆనాటి పాలకులకు వచ్చింది. పాలన, విధానాలు ప్రజాభీష్టం మేరకే జరగాలి కాబట్టి రాష్ట్రాల పునర్విభజన కోసం ఆనాటి ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ (ప్లెబిసైట్) చేయడంలో భాగంగా ఫజల్ అలీ కమీషన్ (మొదటి ఎస్సార్సీ) నియమించి దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజల అభిప్రాయాన్ని సేకరించింది. ఆ సందర్భంలో హైదరాబాదు రాష్ట్ర ప్రజలు తాము ప్రత్యేక రాష్ట్రంగానే ఉంటామని కమీషన్ ముందు చాలా స్పష్టంగా చెప్పారు. కానీ హైదరాబాదు రాష్ట్రంలో ఉన్న విస్తారమైన నీటి వనరులు, హైదరాబాదు నగరంలోని నిర్మాణ ప్రత్యేకతలు, రెవెన్యూ, వాతావరణ సౌలభ్యం మొదలైన సానుకూలతల పైన కన్నేసిన ఆంధ్రా పాలకవర్గం కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి, హైదరాబాదు రాష్ట్రాన్ని, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంతో కలిపి 'ఆంధ్రప్రదేశ్' రాష్ట్ర ఏర్పాటును కుటిలంగా సాధించుకున్నది. ఉమ్మడి రాష్ట్రం ఏర్పాటు అయింది మొదలు ప్రతి నిత్యం తెలంగాణ రాష్ట్రం అనేకానేక సమాజిక రంగాల్లో వివక్షకూ, నిర్లక్ష్యానికీ, దోపిడీకి గురయ్యింది.

అణచివేత ఉన్నచోట తిరుగుబాటు తప్పనిసరిగా ఉంటుందన్నది చారిత్రక సత్యం. ప్రపంచంలోని అనేక తిరుగబాట్లు ఈ సత్యాన్ని నిరూపణ చేశాయి కూడా. కాకతీయుల కాలం నుండే పోరాట వారసత్వాన్ని సంస్కృతిగా కలిగిన తెలంగాణ ప్రజలు, ఆంధ్రా సంపన్న పాలకవర్గం తమ మీద చూపుతున్న వివక్షకు, అమలు చేస్తున్న అన్యాయాలకు వ్యతిరేకంగా తిరగబడ్డారు. ఆ క్రమంలోనే 1968లో ఖమ్మం జిల్లాలో రాజుకున్న ప్రజా ఉద్యమం తెలంగాణ అంతటా విస్తరించింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 370 మంది అమరులయ్యారు గానీ వాస్తవ లెక్కలు అంతకు మూడింతలుంటాయి. ఉద్యమం నిర్వహిస్తున్న సమయంలో క్షతగాత్రులైనవారి సంఖ్య వేలల్లోనే ఉంటుంది. ఇంతటి మహత్తర పోరాటం ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ కుయుక్తులతో ఆగిపోయింది. మళ్లీ 1996లో చాలా చైతన్యవంతంగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమం రాజుకుంది. మళ్లీ కాంగ్రెస్ కుతంత్రాల, అణచివేతల కారణంగా 2004 తర్వాత ఉద్యమం వెనుకపట్టు పట్టింది. మళ్లీ 2009లో తెలంగాణ ప్రజలు పట్టవదలని విక్రమార్కుల్లా ఆంధ్రా పాలకుల పెత్తనం మీద తిరుగుబాటు మొదలు పెట్టి ప్రత్యేక తెలంగాణ నినాదాన్ని ఊరూరా ప్రచారం చేసి 2014లో ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నారు. ఇక్కడ ప్రస్తావించినంత సంక్షిప్తంగా, ప్రశాంతంగా ఉద్యమం సాగలేదు. అనేక ఆత్మబలిదానాలు, సృజనాత్మకమైన పోరాట రూపాలు, త్యాగాలు ఎన్నెన్నో ప్రపంచాన్ని నివ్వెరపోయేలా చేశాయన్నది నిర్వివాదాంశం.

1969లో, 1996లో మొదలైన ప్రజా ఉద్యమాలు విజయవంతం కాకుండా, వాటి కొనసాగింపుగా 2009లో వచ్చిన ఉద్యమమే విజయ

తీరాలకు చేరడం వెనుక ఉన్న కారణాల్లో చాలా మౌలికమైనది తెలంగాణ ప్రాంతంలోని విభిన్న ప్రజారాశులంతా ఉద్యమంలో భాగస్వాములు కాకపోవడమే. 1969,1996 ఉద్యమాల్లో తెలంగాణ లోని అన్ని ప్రాంతాల, అన్ని సెక్షన్ల ప్రజలు పాల్గొనకపోవడం కారణంగా, ఆనాటి ఆంధ్రా పెత్తందారీ పాలకవర్గాలు ఆ ఉద్యమాలను సులభంగా అణచివేయగలిగాయి. కానీ 2009లో మొదలైన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో మారుమూల గ్రామాల ప్రజలు మాత్రమే కాకుండా కొండకోనల్లోని గిరిజనులు, ఆదివాసీలతో సహా విశాల ప్రజారాశులు భాగస్వామ్యం వహించాయి. ఉద్యమం నడిచినన్ని రోజులు గూడాలు, తాండాలు, గ్రామాలు, పట్టణాలు, నగరాలు మొత్తం ఎక్కడికక్కడ విభిన్నమైన సృజనాత్మక పోరాటరూపాలతో మారిమోగాయి. ఆంధ్రా పెత్తందారీ పాలకవర్గం దగ్గర ఉన్న పోలీసు, మిలటరీ యంత్రాంగం ఎన్నెన్ని అణచివేత రూపాలను ప్రయోగించినా ఉద్యమంలోని ప్రజలు వెరవకుండా పోరాడారు. రాష్ట్రాన్ని త్యాగాల పునాది మీద నిర్మాణం చేసుకున్నారు. ఇక్కడ విశేషంగా గుర్తించాల్సిన విషయం ఏమిటంటే 2009 ఉద్యమంలో తెలంగాణ ప్రాంత ప్రజలంతా పాల్గొనేలా చేసింది సాహిత్యం. తెలంగాణ ప్రాంతంలో విప్లవోద్యమం బలంగా నడుస్తున్న కాలంలో ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ గోచి కట్టి, భుజం మీద గొంగడి వేసుకుని, కాలికి గజ్జె కట్టి, చేతిలో పట్టుగోల పట్టుకుని ప్రజావాణిని మైక్‌లో దద్దరిల్లేలా గానం చేశాడు. కానీ 2009 ఉద్యమంలో లక్షలాది మంది గద్దర్‌లు వేలాది గ్రామాల్లో, వేలాది వేదికల మీద ఆంధ్రా పాలకవర్గ కుయుక్తుల్ని, వివక్షాపూరితమైన విధానాలను, తెలంగాణకు జరిగిన అన్యాయాలను, పోరాటం చేయవల్సిన అవసరాలు, పోరాట రూపాలను, త్యాగాల అనివార్యతను, వెరవకుండా ఉండే చైతన్యాన్ని పాటల రూపంలో వినిపించారు. సహజంగానే దృశ్య, శ్రవణ రూపాల్లోని సందేశానికి ప్రజలు ఆకర్షితులు అవుతారు. వాగ్గేయకారులు పాటలు పాడుతూ, లయబద్ధంగా అభినయిస్తూ ప్రజల మెదళ్లను కదిలించి వేశారు. తమకు జరుగుతున్న అన్యాయాలను, పోరాట ఆవశ్యకతను తెలుసుకున్నారు. వెనువెంటనే పిల్లాజెల్లలతో కలిసి ఉద్యమంలో భాగస్వాములయ్యారు. అందుకే రైతు జేయేసీలు, కార్మికుల జేయేసీలు, మహిళా జేయేసీలు, పోలీసు జేయేసీలు, అడ్వకేట్ జేయేసీలు, టీచర్ జేయేసీలు, విద్యార్థి జేయేసీలంటూ వేలాది జేయేసీలుగా ఏర్పడి ఉద్యమాన్ని నడిపించారు. ఈ నడక వెనుక, వెన్నెముకగా ఉన్నది, ఎప్పటికప్పుడు వెన్నుదన్నుగా ఉంటూ స్ఫూర్తినీ, చైతన్యాన్నీ రగిలించింది పాటే అని చెప్పాలి. పాట లేని మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని, దాన్ని విజయాన్ని ఊహించడం కూడా సాధ్యం కాదు.

మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాట ఎంతటి ముహత్తరమైన పాత్ర నిర్వహించిందో కరపత్ర సాహిత్యం కూడా అంతే పాత్ర నిర్వహించింది. సాహిత్య పరిగణనలో కావాలని దూరం పెట్టిన సాహిత్య రూపాలు ఉంటాయి, యాదృచ్ఛికంగా దూరమైన సాహిత్య రూపాలూ ఉంటాయి. తెలంగాణ ఉద్యమానికి పాట చేసిన దోహదాన్ని ఇప్పటికే చాలామంది సాహిత్యకారులే కాదు, సాహిత్యేతర రంగాల్లో పనిచేసేవారు కూడా గుర్తించవల్సినంతగానే గుర్తించారు. కానీ యాదృచ్ఛికంగా పాట నిర్వహించిన పాత్ర స్థాయిలోనే కరపత్రాలు కూడా ఉద్యమాన్ని ప్రచారం చేయడంలోనూ, కార్యనిర్వహణా బోధ చేయడంలోనూ, ప్రజారాశుల్ని సమీకృతం చేయడంలోనూ గణనీయమైన పాత్రనే నిర్వహించాయి.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్ర ప్రపంచానికంతా తెలుసు. తెలంగాణలోని వివిధ యూనివర్శిటీల విద్యార్థులందరూ జేయేసీలుగా ఏర్పడి రాష్ట్ర విద్యార్థులందరినీ సమీకృతం చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనూ, కాకతీయ విశ్వవిద్యాలయంలోనూ లక్షలమంది భాగస్వామ్యంతో భారీ బహిరంగ సభల్ని నిర్వహించారు. ఆ నిర్వహణ కంటే ముందు ఆయా జేయేసీలు ఉద్యమ కార్యాచరణను, బహిరంగ సభల ఉద్దేశ్యాల్ని, లక్ష్యాలను నిర్దిష్టంగా, సంక్షిప్తంగా కరపత్రాల రూపంలో రాసి, లక్షలాది కాపీలను ప్రింటు చేసి తెలంగాణ వ్యాప్తంగా పంచిపెట్టాయి. కరపత్రాలను అందుకున్న ప్రతీ ఒక్కరు ఎంతో చైతన్యాన్ని పొంది బహిరంగ సభలకు చీమల బారుల్లా కదిలి, సభలను విజయవంతం చేసి ప్రభుత్వాన్ని వణికించారు. ఈ మహత్తర చలనం వెనుక చోదకశక్తిగా ఉన్నది కరపత్రాలే అన్నది తప్పకుండా గుర్తించాలి.


రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, న్యాయవాదులు, పోలీసులు, వేర్వేరు ఉద్యోగులు, సాహితీవేత్తలు.. ఇట్లా విభిన్న ప్రజా సమూహాలు తాము నిర్వహించబోయే కార్యక్రమాల గురించీ, సభల గురించీ, సమావేశాల గురించీ, బహిరంగ సభల గురించీ తమ చుట్టూ ఉన్న ప్రజల మధ్య ప్రచారం చేయడం కోసం ప్రధానంగా ఆధారపడింది కరపత్రాల మీదనే. ఏరోజు, ఎక్కడ, ఏ సమయంలో ఫలానా కార్యక్రమం నిర్వహిస్తున్నారో, ఎందుకు నిర్వహిస్తున్నారో, దాని చారిత్రక అవసరం ఏమిటో కరపత్రాల ద్వారానే ప్రజలు తెలుసుకున్నారు, ఆయా కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొన్నారు. తద్వారా ఉద్యమం సామూహిక చైతన్య రూపంగా పరిణమించి మహత్తర తెలంగాణ రాష్ట్ర సాధన కల నెరవేరింది. కరపత్రాలు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నిర్వహించిన పాత్రకు ఇదొక పార్శ్వం మాత్రమే.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. పునర్నిర్మాణం వేగవంతంగా కొనసాగుతోంది. వర్తమానంలో జీవిస్తున్నవాళ్లు తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని నడుస్తున్నప్పుడే ఉన్నప్పుడే కళ్లారా చూశారు. కానీ ఆ ఉద్యమ చరిత్ర భవిష్యత్తరాలకు తెలవాలంటే ఉద్యమ చరిత్ర నిక్షిప్తం కావాలి. ఉద్యమ చరిత్ర రాసేవాళ్లకు ఆకరాలు కావాలి. తెలంగాణ ఉద్యమ చరిత్ర నిర్మాణానికి కరపత్రాలు మాత్రమే ప్రధాన ఆకరాలుగా ఉన్నాయన్నది అందరూ గుర్తించాల్సిన వాస్తవం. భవిష్యత్తరాల వారు,

తెలంగాణలోని ఏయే ప్రాంతాల్లో ఏయే ప్రజాసమూహాలు, ఏయే కార్యక్రమాలు చేశారో, ఏయే సభలూ, సమావేశాలూ నిర్వహించారో, వాటి లక్ష్యాలేమిటో, నిర్వహించిన కార్యాచరణ ఏమిటో తెలుసుకు నేంత నిర్దిష్టమైన చరిత్ర నిర్మాణం కావడానికి కరపత్రాలే ప్రధాన వనరు.

సాహిత్యం మనిషి సంస్కారం మాత్రమే ఇవ్వదు. మనిషి వర్తమానంలో మానవీయంగా ఎట్లా జీవించాలో, తమకన్నా ముందు సమాజాల్లో జీవించిన ప్రజలు ఎంతటి స్ఫూర్తివంతమైన జీవితం గడిపారో, తమకు ఎటువంటి సాంస్కృతిక వారసత్వాన్ని బాధ్యతగా బోధించివెళ్లారో కూడా బోధిస్తుంది. తమ చైతన్యవంతమైన, సాహసోపేతమైన, సృజనాత్మకమైన, మహత్తరమైన పోరాటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న తెలంగాణ ప్రజల తెగువను భవిష్యత్తరాలు పొందాలంటే ఉద్యమ ప్రచార బాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వహించిన కరపత్రాలను తప్పకుండా అధ్యయనం చేయాలి. అప్పుడు మాత్రమే కాకతీయుల నుండి నేటిదాకా వస్తున్న, పోరాటమే సంస్కృతిగా జీవిస్తున్న తెలంగాణ ఆత్మను ఆవాహన చేసుకోగలము.

## నమ్రతగా మాట్లాడు




నమ్రతగా మాట్లాడు, ఇది ఎంతో ఉత్తమం, సముచితం
భయపెట్టి పాలించడం కన్న ప్రేమించి పాలించడం;
నమ్రతగా భాషించూ కఠిన పదాలను దొర్లనివ్వడం
మన చేయబోయే మంచికి కావచ్చు విఘాతం.

చిన్న పిల్లలతో నమ్రతగా మాట్లాడడం!
ఈ ప్రేమకు తప్పని బహుమానం సత్ఫలితం;
బోధించు మృదు భాషణం, వినమ్ర సంభాషణం;
బాల్యంలో నేర్చిన పాటవం, యావజ్జీవిత సందేశం.

యువతతో మృదువుగా మాట్లాడు
వారి భారం పెద్దది, జీవితాన్ని,
సఫలం చేసుకోవడానికి యత్నిస్తున్నారు.
గుండెల నిండా ఆవేదనతో?

వయో వృద్ధులతో నమ్రతగా మాట్లాడటం అవశ్యం
బరువు బాధ్యతల్లో హృదయాలని విచారించకు;
జీవిత గమ్యం చరమాంకంలోకి పరుగిడడం తథ్యం
అటువంటి వారి జీవితాల్లో శాంతిని నింపు

పేదవారితో నమ్రతగా, దయతో మాట్లాడు
కఠినంగా మాట్లాడకు;
వారు ఓర్పు, వారి పెన్నిధి,
కటువైన పదం పలుకకు.

పొరపాటున తప్పు నమ్రతగా మాట్లాడు
వారు శ్రమ వృథా అయింది కాబోలు;
బహుశ వారి నిర్దయత్వం వారినలా చేసింది కాబోలు;
వారిని తిరిగి మనవారిగా చేసికొనే విధంగా ప్రయత్నించు!



మూలం : డేవిడ్ బేట్స్
అనువాదం : కట్టా రాజమౌళి

## సాధన పంచకమ్

**సంగః సత్సు విధీయతాం భగవతో భక్తిర్ దృఢాఽఽధీయతాం**
**శాన్త్యాదిః పరిచీయతాం దృఢతరం కర్మాఽఽశు సంత్యజ్యతామ్**
**సద్విద్వానుప సర్ప్యతాం ప్రతిదినం తత్పాదుకా సేవ్యతాం**
**బ్రహ్మైకాక్షర మర్థ్యతాం శ్రుతి శిరోవాక్యం సమాకర్ణ్యతామ్.**

తాత్పర్యం : 1. సత్పురుషులతో సాంగత్యమును ఏర్పరచుకొన వలెను. 2. దృఢమైన భగవద్భక్తిని కలిగి ఉండవలెను. 3. శాంతి మొదలైన సద్గుణములను తెలిసికొని ఆచరించవలెను. 4. వదలని కర్మబంధనము (కామ్యకర్మలు) వెంటనే వదిలిపెట్ట బడు గాక! 5. సద్గురువును ఆశ్రయించవలెను. 6. ప్రతిదినము గురుదేవుని పాదుకలను సేవించవలెను. 7. అద్వితీయమగు బ్రహ్మజ్ఞానమును అర్థించవలెను. 8. వేదములకు శిరస్సుల వంటి ఉపనిషత్తుల వాక్యములను శ్రవణము చేయవలెను.

### వివరణ

**1. సంగః సత్సు విధీయతామ్ –**

సత్పురుషులతో సాంగత్యమును ఏర్పరచుకొనవలెను. సత్పురుషుల సాంగత్యము చాలా గొప్పది. ఏ మహాత్ముని జీవితాన్ని పరీక్షించి చూసినా సత్పురుషుల చేత ప్రభావితమై చరిత్ర పుటల్లో చెరగని ముద్రగా నిలిచిన వారెందరెందరో ఉన్నారు. శ్రీకృష్ణుని సాంగత్యం వలన అర్జునుడు, నారదమహర్షి సహవాసంతో ధ్రువుడు, ప్రహ్లాదుడు, శుకయోగీంద్రుని సాంగత్యంతో పరీక్షిన్మహారాజు తరించిపోయిన సంగతి మనందరికీ తెలిసినదే. అందుకే **"త్రిజగతి సజ్జన సంగతిరేకా భవతి భవార్ణవ తరణే నౌకా"** – మూడు లోకాలలో సంసారమనెడు సాగరమును దాటించగల ఏకైక నావ సత్పురుష సాంగత్యమేనని శ్రీ ఆది శంకరాచార్యులు భజగోవిందంలో పేర్కొన్నారు.

మనలో చెలరేగే అనవసరపు ఆలోచనా ప్రవాహానికి అడ్డుకట్ట వేసి వాటిని సక్రమమైన మార్గంలోకి మళ్ళించడానికి ఉపయోగ పడేదే సత్సంగము. మన ఆలోచనా విధానము ఎట్లుండాలి? మనం సాధించవలసినది ఏమిటి? అందుకు తగిన మార్గము ఏది? ఏవిధంగా ముందుకు వెళ్ళాలి? ఎదురయ్యే సాధకబాధకా లను ఎట్లు అధిగమించాలి? అంటే ఇవన్నింటికి ప్రయత్న పూర్వకంగా సత్సాంగత్యము చేయుటయే సమాధానము..

(సశేషం)

## మాండుక్యోపనిషత్తు

అదియు జాగ్రదవస్థ గాకను
కలలు గనియెడి స్థితియు గాకను
కోరికలు మరి కోరకుండగ
సుఖముగా నిద్రించు స్థితి యది 17

విశ్వసృష్టి వినాశములకును
ముఖ్య కారణమనగ వెలుగుచు
జ్ఞానమే తానైన బ్రహ్మము
చెప్పబడు నానందమయుడని 18

సృష్టికార్యముల లెల్ల దీరగ
స్వస్వరూపము నందు వెలుగుచు
శాశ్వతానందంబు నొందెడి
వేళ యనలుడు ప్రళయ కాలము 19

సుఖము దుఃఖము లేని ఆనం
దాత్మకంబగు లోకమోయను
ప్రళయ కాలము నందు బ్రహ్మం
బలరుచుండు ప్రజ్ఞాన ఘనుడై 20

అట్టి సర్వేశ్వరుని సర్వ
జ్ఞుండునై యున్నట్టి వానిగ
సర్వభూతములందు బ్రాజిలు
నట్టివానిగ తెలియవలయును 21

సర్వ సృష్టికి కారణంబయి
వస్తువుల నుత్పత్తి జేయుచు
మరి వినాశ మొనర్చు వాడే
సర్వమున కధినాయకుండగు 22

నిజముగా బ్రహ్మమున కంతః
ప్రజ్ఞ యనియెడి మాట చెల్లదు
బహిః ప్రజ్ఞము, నుభయ ప్రజ్ఞము
ననెడి మాటలు కూడ చెల్లవు 23

'ప్రజ్ఞ' మను 'అప్రజ్ఞ'మను 'ప్ర
జ్ఞాన ఘన' మను పదములందు – చ
రించువాడే కాదు బ్రహ్మము
సత్యమును గ్రహియింపగల్గిన; 24

**జక్కని వెంకటరాజం**
**సిరిసిల్ల, ఫోన్ : 9440021734**

గ్రంథాంతరంగం 04

# ఆంధ్ర కవిత్వ చరిత్రము

**శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు,** ఫోన్ : **9964082076**

వంగూరి సుబ్బారావుగారు వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యాన్ని 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము' (1920) రూపంలో రచిస్తే, భోగరాజు నారాయణమూర్తిగారి దృష్టి తెలుగు కవిత్వానికి మాత్రమే పరిమితమై 'ఆంధ్ర కవిత్వ చరిత్రము' 1924లో భారతిలో వరుసగా తర్వాత పుస్తకరూపంలో వచ్చింది. మూర్తిగారు విజయనగరం మహారాజావారి కళాశాలలో తెలుగు ఉపన్యాసకులుగా పనిచేసేవారు. ఆ కళాశాలలో తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషలకే కాక చరిత్ర, సంస్కృతులకు సంబంధించిన పరిశోధనకు కూడా ప్రాధాన్యమివ్వబడింది. డా. బుర్రా శేషగిరిరావు, ఏచూరి నరసింహం పంతులు, మేడేపల్లి రమణాచార్యులు ప్రభృతుల సూచనలు, సలహాలు స్వీకరిస్తూ, కొమఱ్ఱాజు లక్ష్మణరావు పంతులుగారి మార్గదర్శనంలో భోగరాజు నారాయణమూర్తిగారు **'ఆంధ్రకవిత్వ చరిత్రము'** రచించారు.

నారాయణమూర్తిగారు కావ్యం, కావ్య లక్షణాలు, ప్రయోజనాలు, తెలుగు కవుల గురించి అప్పుడప్పుడు వ్యాసాలు రాసి విజయనగరం మహారాజా కళాశాల పత్రికలోను, ఇతర పత్రికల్లోనూ ప్రచురిస్తూ, కాలక్రమంలో 'ఆంధ్ర కవిత్వ చరిత్రము'ను వెలువరించారు. 250 పేజీలు కల ఈ పుస్తకం మొదటి భాగపు ఉపోద్ఘాత సంపుటమని పేర్కొన్నారు. అయితే మిగతా సంపుటాలు వెలువడ్డాయో లేదో తెలియదు.

'ఆంధ్ర కవిత్వ చరిత్రము' ఐదు ప్రకరణాలుగా వర్గీకరింపబడింది. మొదటి ప్రకరణంలో కవి, కవిత్వం గురించి చర్చింపబడింది. రెండవ ప్రకరణంలో తెలుగు కవుల కవితాభిప్రాయాలు వెల్లడింపబడ్డాయి. మూడవ ప్రకరణంలో ఆంధ్ర లాక్షణికులు, కవిత్వ తత్త్వం గురించి వివరించబడింది. నాలుగవ ప్రకరణంలో యుగ విభాగం గురించిన వివరాలున్నాయి. ఐదవ ప్రకరణంలో ఆంధ్రకవితా పోషకుల చర్చ చూడవచ్చు.

భోగరాజు నారాయణమూర్తిగారు 'అవతారిక'లో పేర్కొన్న ఈ మాటలు గమనించతగ్గవి. **".... సామాన్యముగ గవితా ప్రపంచమున బ్రచారములో నున్న విషయములను మాత్రమే గైకొని, వాటికి గ్రొత్త వన్నె వెట్టి నూతన మార్గమ్మున బ్రకటించుటకు మాత్రమే ప్రయత్నించి నాడనగుటచే నా యీ యుద్యమము నేను భయపడినంత నిరర్థకము గాక కొంతవరకైన సార్థకత గాంచకపోదని విశ్వసించుచున్నాను. ఇక బండిత సామాన్యములగు కవితామత భేదము లెవరివి వారివే యగుట నయ్యవి నన్ను నిరుత్సాహపరుం గావింపజాలవు"** (పేజీ.7)

పై మాటల వల్ల గ్రంథకర్త ఆంధ్రకవిత్వం గురించి పూర్వ విద్వాంసుల అభిప్రాయాలకు తమ స్వతంత్రాలోచనలు జోడించి కొత్తబాటలో ఆంధ్రకవిత్వ చరిత్ర రచనకు సంకల్పించారన్న సంగతి



తెలుస్తుంది. భోగరాజుగారు **'కవి – కవిత్వము'** అనే 47 పేజీల మొదటి ప్రకరణములో కీట్సు, మిల్టను లాంటి ఆంగ్ల మహాకవుల జీవితాల్ని, వాళ్ల కావ్యాల్ని ప్రస్తావిస్తూ, వామన, జగన్నాథ పండితాదుల లక్షణ గ్రంథాల్ని స్పృశిస్తూ, పోతన, అల్లసాని పెద్దన, ధూర్జటి లాంటి మహాకవుల జీవిత, కావ్యాల్ని పరామర్శిస్తూ కవిత్వ ఆశయాల్నీ, లక్షణాల్నీ పరిశీలించారు. ఆంగ్ల విమర్శకులైన మాథ్యూ ఆర్నాల్డు, టి. హెచ్. వార్డు గ్రంథాలనుంచి ఉటంకిస్తూ కవి, కవిత్వాన్ని నిర్వచించేందుకు ప్రయత్నించారు. మహాకవి లక్షణాల్ని ఇలా చెప్పారు. **"విషయ లౌల్యము, ఐహిక సుఖైకానురక్తి, అసంతృప్తి, కష్టసుఖముల యందు సమత్వాభావము, ఎడతెగని తాపత్రయము మొదలగు దుర్గుణములకు లోబడక, స్వతంత్రుడై, సంతృప్తుడై, తన యుత్కృష్ట కవిత్వమునకు వినాశనము గలుగనీక పవిత్రతయు, మతింత పెంపును గలిగించు కవి సాధారణముగ నే భాషా కవులలో నైన మిక్కిలి యరుదుగా నుందును. ప్రాయికముగా గవి ప్రపంచమున కీట్సులనేకులుందురు. పోతనామాత్యు లెచ్చటనో గాని కానరారు".** (ఆంధ్ర కవిత్వ చరిత్రము, పేజీ. 19).

**"నానృషి: కురుతే కావ్యమ్"** అనే సంస్కృతోక్తికి ఇది భోగరాజుగారి వివరణే కదా! వస్తువు ఒక్కటే అయినా భావుకుని దృష్టి భేదం వల్ల కవిత్వం వేర్వేరు రూపాల్ని ధరిస్తుందని నారాయణమూర్తిగారు

అభిప్రాయపడ్డారు. వారి మాటలివి – **"ఒక్క దీపమే పలురంగుల గాజుకుప్పెల యందు బలు విధములగు కాంతుల నీనుచున్నది. కవితా ప్రకాశమును గూడనట్టిదియే"** (పేజి.24)

భోగరాజువారు కల్పనాశక్తి కంటె భావనాశక్తి మహత్తరమైనదన్నారు – **"వీనిలో గల్పనాశక్తిని మాత్రము కవి రస విశిష్టములైన భాగముల యందుపయోగింపదు రసపోషణమునకు భావనా శక్తివలె గల్పనాశక్తి తోడుపడలేదు. అందుచే నయ్యది కవికావ్యము నందు బ్రాయికముగా రసానంతరము నందే కాని రసాంతరమునందు గానరాదు"** (పేజి.29) నారాయణమూర్తిగారు కావ్యసృష్టికి మూడు ఉపకరణాలు కావాలన్నారు. – **"కావ్యరచన యందొకానొక రసము నుత్కర్షించుటకు భావములును, తద్భావము లను బ్రకటించుటకు బదగుంఫనమును సాధనము లగుచున్నవి. ఈ రసభావములు మూడును గాఢమైన పరస్పరానుకుల్యమును బొందినప్పుడే వాస్తవమైన కవితా స్వరూప మేర్పడగలదు"**. (పేజి.41)

భోగరాజు గారు వ్యంగ్య కవిత్వం అతి ఉత్తమమైనదనీ (పేజి.28), శబ్దౌచిత్యాన్నీ (పేజి.42) అర్థగౌరవాన్నీ (పేజి.43), అలంకారాల సహజత్వానికీ పెద్దపీట వేశారు. (పేజి.44).

గ్రంథకర్త ప్రకరణం చివర్లో పుట్టకొక బుద్ధి, జిహ్వ కొక రుచిలాగా కవులకు, విమర్శకులకు కావ్యమొక్కొక్క విధంగా కనిపిస్తుందని భావించారు. నానాగుణ సంపన్నమైన కావ్యం నానారుచి స్ఫూర్తి కలిగించి, సహృదయుల్ని అలరిస్తుందన్న అభిమతం ప్రకటించారు.

రెండవ ప్రకరణం **'ఆంధ్రకవుల కవితామతములు'** 67 పేజీల విస్తారమైనది. కవిత్రయం ఆంధ్ర మహాభారతాన్ని రచించడానికి ప్రధాన ఉద్దేశం సామాన్య జనులకు ఉపయోగపడటమే అని గ్రంథకర్త అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా భోగరాజు వారన్న ఈ మాటలు చర్చనీయాంశమని భావిస్తున్నాను –

**"నన్నయ కూతగా బనికిరాదగిన యుత్కృష్ట గ్రంథమేదియు లేకపోయినను, దత్పూర్వ విరచితములును, సమకాల విరచితము లును నగు సామాన్య కవితలైన నప్పుడు లేకపోలేదు. కాని నూతన కావ్య నిర్మాణమునం దప్రతిమ ప్రతిభావంతుడగు నన్నయ వంటి మహా కవీశ్వరున కట్టి సామాన్య కవితలు కొంతవఱకైన మార్గదర్శకములై యుండునని నాకు దోపదు"** (పేజి.55)

ఇక్కడ గమనించవల్సిన అంశాలు ఒకటి, రెండున్నాయి. నన్నయకు పూర్వం కాని సమకాలంలో కాని 'ఉత్కృష్ట గ్రంథం' ఏదీ వుండలేదనే మాట నమ్మదగినది కాదు. నన్నయ కంటె ముందు బౌద్ధ, జైన– ముఖ్యంగా జైనమత స్థాపక, ప్రతిపాదక రచనలు వుండినట్లు సాక్ష్యాలు దొరికాయి. కాని ఆ కావ్యగ్రంథాలు లభించడం లేదు. ఆంధ్రలో జైన మతం విజృంభించి, చాలాచోట్ల జైన బసదులు, దేవాలయాలు నిర్మింపబడినట్లు సాక్ష్యాలు పుష్కలంగా లభించాయి. జైనమతం ఎంతగానో విజృంభించి వుండకపోతే, దాన్ని అరికట్టి వైదికమత పునఃప్రతిష్టకు రాజరాజనరేంద్రుడు సంకల్పించి వుండడు. ఆ జైన కావ్యాల్ని తలదన్నేవిధంగా వైదికమత పునర్జీవనానికి దోహదకారి అయ్యే మహాభారత రచనకు నన్నయ్య కంకణబద్ధుడై వుండేవాడు కాదు. నన్నయ్య భావజాలానికి విరుద్ధమైన జైనమత ప్రతిపాదకమైన కావ్యాలు ప్రజల్లో ప్రచారంలో వుండిన కారణంగానే, వాటిని ఎదుర్కొనడానికే దీక్షా తత్పరుడై, ద్విగుణీకృత ఉత్సాహంతో భారతరచనకు సంకల్పించాడని చెప్పవలసి వస్తుంది. అగ్నికి వాయువు తోడైనట్లు **'అన్యరాజ తేజో జయశాలి శౌర్యుడు'** రాజరాజ నరేంద్రుడు నన్నయ్యకు బాసట అయినాడు. **'రాజకులైక భూషణు'**డైన రాజరాజ నరేంద్రుని ప్రోత్సాహంతో, సంస్కృత, కన్నడాంధ్ర భాషా పారంగతుడైన నారాయణభట్టు సహకారంతో ఆంధ్రభారత రచనకు నడుం బిగించాడు నన్నయ్య.

ఆంధ్రదేశంలో నన్నయ్యకు పూర్వం జైనకవులుండకపోలేదు. కన్నడంలో **'ఆదికవిగా'** పూజలందుకొంటున్న పంపడు జైనమతం అవలంబించిన వేగిపఱ్ఱు వైదిక బ్రాహ్మణుడే. పూర్వ చాళుక్యరాజుల ప్రోత్సాహం కొరవడి, వాళ్ళ వొత్తిళ్లకు తట్టుకోలేక పశ్చిమ చాళుక్య రాజుల అండదండలతో కర్ణాటకకు వలసపోయిన జైన మతాభిమాని అయిన తెలుగుబిడ్డడే.

నన్నయ్యకు సుమారు నూరేళ్ళ మునుపటివాడైన పంపడు రచించిన కన్నడ భారతం – **'విక్రమార్జున విజయ'** భావం, వస్తువు, రచనలో నన్నయపై గొప్ప ప్రభావాన్నే ప్రసరించింది. ఆంధ్రనుండి కర్ణాటకకు వలసపోయిన జైనకవులైన తెలుగు ప్రతిభావంతులు ఎందరో వుండిరని వంగూరు సుబ్బారావు పంతులు ఇలా వాక్రుచ్చారు – **"అట్లుగాక జైనకవుల కిచ్చటనే ప్రోత్సాహమున్న యెడల వారు – దూరదేశములకు చోటు మన వేంగి బ్రాహ్మణులు – జైనమత ప్రియులు – కర్ణాటకములో నంత వాఙ్మయము సృష్టించి, దానిని భాగ్యవంత మొనరింప నవసరము కాన్పింపదు"**. (ఆంధ్ర వాఙ్మయ చరిత్రము. పేజి.55.1920) ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు నన్నయను భారతరచనలో ప్రభావితం చేయగలిగినంతటి కావ్యాలు ఆయన కాలంలో కాని, ఇంకా ముందుగాని వున్నట్లు కనిపించవని ఇలా అభిప్రాయం వెల్లడించారు.

**"అంతకంటె ప్రాచీనమైన గ్రంథము లభించువరకు భారతము తోనే ఆంధ్ర వాఙ్మయము ప్రారంభమయ్యెనని ఒప్పుకొని ముందడుగు వేయుట మంచిది. మరియు తత్పూర్వము లోకమున ఎంత విరివిగ పద్యరచన సాగినను, ఆ పద్యములన్నింట వాఙ్మయారంభమునకు మూలభూతములు కాజాలవు"**. (ఆంధ్ర సాహిత్యచరిత్ర. పేజి. 26. 2018).

నన్నయకు ముందు ప్రచారంలో వున్న కావ్యాలు ఏవీ ఆంధ్ర మహాభారత రచనకు ప్రేరకాలు కాజాలవని లక్ష్మీకాంతంగారు భావించడం సమంజసం కాదు. జైనమత ప్రచార ప్రదీప్తమైన తెలుగు

కావ్యాలు నన్నయను వైదిక మత ప్రచారం కోసం భారత రచనకు తీవ్రంగానే ప్రభావితం చేసి వుంటాయని నా భావన.

భోగరాజు నారాయణమూర్తిగారు రెండవ ప్రకరణంలో **'ఆంధ్రకవుల కవితా మతములు'**ను పరామర్శిస్తూ, కవిత్వం లక్షణాలు, ప్రయోజనాలు, భావం, వస్తువు, రచనల రీత్యా చాలామంది కవుల కృతి విమర్శనం కూడా కావించారు. ఇది ఒక విలక్షణ విధానంగా రూపొందింది ఈ గ్రంథంలో. నన్నయ, తిక్కనాది కవులు కవిత్వం గురించి తమ అభిమతాల్ని వెల్లడిస్తూ, తమ కవితావిశేషాల్ని కూడా ప్రకటించి విమర్శకుల మార్గం సుగమం చేశారు. భోగరాజువారు పనిలో పనిగా తిక్కన కవతా వైశిష్ట్యాన్ని ఇలా పేర్కొన్నారు. **"జాతీయ పద ప్రయోగమునందును, యతికూర్పు నేర్పునందును గవిబ్రహ్మకు గల కౌశలము తెనుగు కవులలో మఱియొకరికి లేదు. అందు పదమధ్య యతులన్న తిక్కనకు మక్కువ ఎక్కువ. విపులమైన భాగమును గొలది పదములలో నుడువుట అతని రచనల యందాచారమగుటచే నందందు గొన్న పద్యముల యందన్వయము కొంచెము కష్టముగా నుండినను నారికేళ పాకమును జూరనీక యతడు తన కవితకు సహజమైన ద్రాక్షాపాకమును నాద్యంతము నొక్కరీతిగ బోషించుట యెంతయు శ్లాఘనీయము".** (పేజీ.77)

భోగరాజువారు తెలుగుకవుల కవితామతాల్ని క్రోడీకరిస్తూ ప్రాచీనతెలుగు కవుల్లో చాలామందికి కవిత్వం పట్ల పూజ్య భావమున్నట్లు వెల్లడించారు. (పేజీ. 92). చాలామంది ఆంధ్రకవులు ఆత్మస్తుతి చేసుకొన్నా, అది చాలావరకు స్వభావోక్తిగానే కనపడుతుందన్నారు. గ్రంథకర్త తెనాలి రామకృష్ణుని కవితా ప్రాగల్భ్యాన్నిలా ప్రస్తుతించారు–

పాండురంగ మాహాత్మ్యము **"ప్రపంచానుభవము నందును, గవితా ప్రపంచానుభవము నందును సంపూర్ణ పరిణతి గాంచినది గాని సామాన్య కృతి గాదు"** (పేజీ.102) ఈవిధంగా 'ఆంధ్ర కవిత్వ చరిత్రము' రచయిత ప్రఖ్యాతాంధ్ర కవుల కవితా వైశిష్ట్యాన్ని ఉగ్గడించారు.

భోగరాజుగారు పింగళి సూరన్న వంటి గొప్పకవులు తమ కావ్యజీవితంలో కొన్నిసార్లు తమ కావ్యరచనా విధానంలో మార్పులు చేసుకొని తమ కవిత్వానికి మరిన్ని మెరుగులు దిద్దుకోగలిగారని చెప్పడం గమనార్హం. పింగళిసూరన **'కళాపూర్ణోదయ'** ప్రబంధంలో, చెప్పిన **'పొసగ ముత్తెపు సరుల్ పోహళించిన లీల'** పద్యాన్నీ, **'ప్రభావతీ ప్రద్యుమ్నం'**లోని **'శబ్ద సంస్కారమెచ్చుటను జారగనీక'** పద్యాన్ని ఉటంకిస్తూ కవి క్రమంగా కావ్యకళా మర్మజ్ఞతను వృద్ధి పరచుకొన్నారని భోగరాజుగారు భావించారు.

గ్రంథకర్త ఈ ప్రకరణంలో కొందరు తెలుగు మహాకవులు కావ్యరచన పట్ల ప్రకటించిన అభిప్రాయాల్ని పరిశీలించడంతో పాటు, వాళ్ల కవితావైశిష్ట్యాన్ని వెల్లడించడం అభినందనీయం.



**"ఆంధ్ర లాక్షణికులు - కవిత్వ తత్త్వము"** అనబడే మూడవ ప్రకరణంలో ప్రముఖ సంస్కృతాంధ్ర లాక్షణికులు కవిత్వ తత్త్వాన్నీ, కవుల్నీ విశ్లేషించిన వైనాన్ని 40 పేజీల్లో పరామర్శించారు. విన్నకోట పెద్దన తన **'కావ్యాలంకార చూడామణి'**లో సత్కవికి సమయజ్ఞత, సమచిత్తత, సమశబ్దార్థ ప్రయోగ చతురత, భావక్రమ రసపోషణ రచనా కమనీయ ప్రతిభలు వుండవలెనని పేర్కొన్నాడు. భోగరాజువారు ఈ సుగుణాలు **"సుకవులగు వారి యందుండక తప్పనివి"** (పేజీ.122) అని చెప్పారు. సంస్కృత లాక్షణికులు కవుల్ని ఏడు విధాలుగా విభజిస్తే, తెలుగు లాక్షణికులు ఆ వరుసను కొద్దిమార్పులతో ఈవిధంగా చెప్పారు. - వాచికుడు, ఆర్థుడు, శిల్పకుడు, శౌచికుడు, భూషణార్థి, మార్దవానుగతుడు, వివేకి. రసానికి ప్రాధాన్యమిచ్చిన కవి, మార్దవానుగతుడనీ, రస ప్రాముఖ్యంతో పాటు ఇతర కావ్య లక్షణాలకు అగ్రస్థానమిచ్చిన కవి వివేకి అనీ, ఇతనే సర్వశ్రేష్ఠుడనీ విన్నకోట పెద్దన భావించాడు. కావ్యాల్లో పద,వాక్య, అర్థ దోషాదులుండగూడదని తెలుగు లాక్షణికులు శాసించారు. అయితే పట్టు విడుపుల్ని ప్రదర్శించారు. చాలామంది తెలుగు లక్షణ కర్తలు రసమే కావ్యానికి జీవమని తెలిపారు.

విన్నకోట పెద్దన మహాకావ్యంలో అష్టాదశ వర్ణనలు వుండాలని శాసిస్తే, అప్పకవి మరినాలుగు వర్ణనలు జోడించాడు. భోగరాజు వారు **"శాస్త్రోక్తమైన ప్రతి విషయమును యథావిధి దన కావ్యమున జేర్పవలయునను నియమము పెట్టుకొనరాదు. అట్టి నియమమే యున్న యెడల నీ లక్షణ గ్రంథములలోని కావ్యలక్షణముల ననుసరించి మన వాఙ్మయమునందు జాల భాగము సవరించి**

**మార్చవలసి వచ్చును".** (పేజి.151). కొందరు లాక్షణికులు కవి జిహ్వాబంధమనీ, కవి సర్పగారుడమనీ, కవి కంఠపాశమనీ, లక్షణ గ్రంథాలు రాసి కవికులంపై కుఠారాఘాతం చేయాలని ప్రయత్నించారు.

భోగరాజు నారాయణమూర్తి గారు ప్రకరణం చివర్లో కవులకు లాక్షణికుల అభిప్రాయాల పట్ల గౌరవం సన్నగిల్లిందని భావించారు. అందుకని కవి, పండితులైన మండపాక పార్వతీశ్వర శాస్త్రిగారి ఈ వాక్యాల్నే ఉటంకించి తమంతకు తామే వూరట చెందారు– **"లక్షణకర్తలందఱు నౌకరి పైన నౌకరు పోటీగానే చెప్పిరి గాని, సూటిగాను, గ్రంథములొనరించిరని నమ్మజాలము. కావున బురాతన మహాకవి ప్రయోగముల కన్న మత్సర ప్రధాన లక్షణ గ్రంథము లెక్కువ గావని నా యభిప్రాయము. లక్షణ గ్రంథములలో జిక్కువడక, చక్కని కవి ప్రయోగంబులే శరనంబులుగా గవితా సరణిం బురణించి ప్రసిద్ధి కెక్కినవారే బుద్ధిమంతులని తలంతును"** (పేజి. 155–156)

48 పేజీల దాకా విస్తరించిన నాలుగవ ప్రకరణంలో గ్రంథకర్త తెలుగు సాహిత్యయుగ విభజన గురించి చర్చించిన తర్వాత యుగ విభజన కావించి, ఆయా యుగాల్లోని ప్రముఖ రచయితల గురించి విమర్శనాత్మకంగానూ, స్థూలంగానూ రాశారు. భోగరాజు గారి సూచీముఖమైన విశ్లేషక దృష్టి ఈ ప్రకరణంలో పలుచోట్ల వ్యక్తమైంది. ప్రాచీనాంధ్ర కవుల్లో ప్రముఖులు రాజాశ్రయంలో జీవించిన వారగుట వల్ల రాజులు మారితే కావ్యరచనా సంప్రదాయాలు కూడా మారతాయని గ్రంథకర్త సోదాహరణంగా నిరూపించారు.

భోగరాజువారి సూక్ష్మ పరిశీలనకు ఈ వాక్యం ప్రబల సాక్ష్యం – **"రాజ నరేంద్రుడిట్లు భిన్న మతస్థుడగుట చేతనే, జైన మతాను కూలముగ నదివరకు గన్నడమున రచింపబడిన పంపాభారతమునకు బోటీగా నన్నయచే నాంధ్ర మహానుభారతమును వేదమతాను కూలముగ వ్రాయించెను"** (పేజి.160) నన్నయ భారత రచనకు ప్రేరకశక్తిగా విభిన్న మత దృక్పథంతో రచింపబడ్డ కన్నడ పంప భారతం పనిచేసిందని, ఇంత స్పష్టంగా రాసిన ఆంధ్ర సాహిత్య చరిత్రకారులు లేరని చెప్పవచ్చు. భోగరాజువారు నన్నయ పద్యం **"సారమతిం గవీంద్రులు ప్రసన్న కథా కలితార్థయుక్తి లోనారసి...."** ఉటంకిస్తూ రాసిన ఈ మాటలు **"ఇట్టి సాహితీ మత భేదములు, విమర్శనములును వాఙ్మయము కేవలము శైశవము నందున్నప్పుడు కలుగనేరవు. అందుచే నన్నయనాటికే యాంధ్ర కవిత్వము మిక్కిలి ప్రచారము నందుండెననియు దత్పూర్వపు టజ్ఞాత యుగము నిరాంధ్రయుగము గాదనియు నిశ్చితమగుచున్నది"** (పేజి.168)

**'ఆంధ్ర కవిత్వ చరిత్రము'** కర్త భోగరాజు గారు ఒకప్పుడు బౌద్ధ, జైన మత గురువులు ఆంధ్రదేశంలో మత ప్రచారం కావిస్తూ తెలుగులో గ్రంథ నిర్మాణం చేసి యుండవచ్చునని చెప్తూ కంచిలోని ఒక జైనమఠంలో తెలుగు జైన శతకమొకటి వున్నట్లు సూచించిన వైనాన్ని తర్వాతి తెలుగు సాహిత్య చరిత్రకారులు వుల్లేఖించినట్లు కనపడదు. (పేజి.174) పోనీ, భోగరాజువారు సూచించి దాదాపు నూరేళ్లు కావస్తున్నా ఏ పరిశోధకుడి దృష్టి అయినా ఈ చీకటి కొట్టు వైపు ప్రసరించిందా? శాంతమ్ పాపమ్!

నారాయణమూర్తిగారు కందుకూరి, గురజాడ శ్రీరామమూర్తి, కూచిమంచి నరసింహం పంతులుగారు Encyclopaedia of the Madras Presidency and adjacent States (1920–21) పుస్తకంలో తెలుగు సాహిత్యచరిత్ర గురించి రాసిన ఓ ఇంగ్లీషు వ్యాసంలోని యుగవిభజనను చక్కగా విశ్లేషించారు. తెలుగు సాహిత్య చరిత్రలో యుగ విభజన చేసేటప్పుడు ఆయా కాల పరిధుల్లో ఘనమైన కృషి చేసిన కవుల్ని యుగకర్తలుగా పేర్కొనాలి కాని కవి పోషకులైన రాజమహారాజుల తలలపై కీర్తి కిరీటాన్ని అలంకరింపకూడదని ఘంటాపథంగా ఘోషించారు భోగరాజువారు. (పేజి.189) ఈయన తెలుగు సాహిత్య చరిత్రలో ఈవిధంగా యుగ విభజన చేశారు.

1. నన్నయ యుగము 1022–1250
2. తిక్కన యుగము 1250–1350
3. ఎఱ్ఱన యుగము 1350–1440
4. పోతన – శ్రీనాథయుగము 1440–1520
5. పెద్దన యుగము 1520–1880
6. వీరేశలింగ యుగము 1830 – నేటివరకు

భోగరాజువారి ఈ యుగ విభజన సమంజసంగా తోచడంలేదు. నన్నెచోడడు, పాలకురికి సోమన్న, రంగనాథ, భాస్కర రామాయణ కర్తల్ని ఈ యుగంవాళ్లుగా చెప్పటం సూక్తం కాదు. నన్నయ పురాణకవి అయితే నన్నెచోడుడు, పాలకురికి సోమనలాంటి శివకవుల్ని ఒకేయుగంవాళ్లుగా నిబంధించడం న్యాయసమ్మతం కాదు. ప్రబంధయుగం తర్వాత వర్ధిల్లిన దక్షిణాంధ్ర యుగకవుల ప్రస్తావనే లేకుండటం పెద్దలోటు. వీరేశలింగయుగంలో **'శ్రీరంగరాజ చరిత్రము'** నవలాకర్త నరహరి గోపాలకృష్ణమసెట్టి పేరు ప్రస్తావించబడలేదు. పైగా నవల, కథానిక, నాటకం, వ్యాసం, విమర్శ మొదలైన ప్రక్రియల గురించి రాయాల్సింది ఎంతో వుంది. గురజాడ వారి 'కన్యాశుల్కం' ప్రస్తావించబడిందే కాని జాతీయోద్యమ కవిత్వం, భావ కవిత్వాల వూసే లేకపోవడం విచారకరం. భోగరాజువారు తాము తర్వాత రాయబోయే **'వీరేశలింగ యుగ కవిత్వ చరిత్రము'**లో మిగతా చరిత్రను అక్షరబద్ధం చేస్తామన్న వాగ్దానం ఆనందదాయకమే. కాని అది నెరవేరకపోవడం మాత్రం విషాదకరం. నారాయణమూర్తిగారి ఈ యుగవిభజన మహాకవులకు యుగకర్తల గౌరవాన్ని ప్రసాదించ గలిగిందే కాని యుగలక్షణాల్ని, ప్రతిపాదించే రచనల బేరీజు వేయలేకపోయింది. కాగా వాటిని సూచించలేకనూ పోయింది. మొత్తంమీద ఈ యుగవిభజన పండిత, విమర్శకుల మన్నన పొందలేకపోయింది.

చివరిదైన ఐదవ ప్రకరణం 44 పేజీల పరిమితి కలది. ఏ తెలుగు సాహిత్య చరిత్రలోనూ అధ్యాయ వివేషంగా రచింపబడని **'ఆంధ్ర కవితా పోషకులు'** ఈ గ్రంథంలోని విశిష్టతల్లో ఒకటి భోగరాజువారు రాజరాజ నరేంద్రుని మొదలు ఆంధ్రభోజుడైన శ్రీకృష్ణదేవరాయలు, అనంతర సాహిత్య పోషకులైన రాజుల్ని, మంత్రుల్ని ఈ ప్రకరణంలో ప్రస్తావించారు. పిల్లలమర్రి పినవీరభద్రుని **'శకుంతలా పరిణయము'** కావ్యాన్ని అంకితం పుచ్చుకొన్న ఒక సామాన్య గృహస్థుడైన చిల్లర వెన్నయ్య సహృదయతనూ, ఔదార్యాన్నీ ప్రశంసిస్తూ **".... రాజాదరణ నుండి యాంధ్ర కవిత్వము ప్రజాదరణ దశలోనికి మాఱుచుండెననుట కింకెట్టి తార్కాణము కావలెను?"** (పేజీ.245) అన్న మాటలు భోగరాజువారి నిశిత పరిశీలనాదృష్టికి నిదర్శనం.

భోగరాజు నారాయణమూర్తిగారి **'ఆంధ్రకవిత్వ చరిత్రము'** 250 పేజీలతో 1924-25 కాలావధిలో ముద్రితమయింది. ఈ మహానుభావుడు ఆంగ్ల సాహిత్య అధ్యయన ప్రభావం వల్ల కవిత్వ నిర్వచన, లక్షణ, ప్రయోజనాల్ని, సంస్కృతాంధ్ర లాక్షణికుల అభిప్రాయాలతో మేళవించి తన అభిమతాన్ని వ్యక్తం చేశారు. కవిత్వ తత్త్వ విచారం చేస్తూ సమాంతరంగా తెలుగు ప్రాచీన కవుల రచనల్ని కూడా పరిశీలించారు. గ్రంథకర్త ప్రాచీనకాలంలో కొందరు మాత్రమే బ్రాహ్మణేతరులు తెలుగు కావ్యరచనకు పూనుకొన్నా, బ్రాహ్మణకవులు వాళ్లను ఆదరించకున్నా కాలం మారిందని చెప్పారు.

**"ఈ నవయుగమున గవితావిద్య యొకరి సొమ్ము గాక వరణీయులగు సకల వర్ణముల వారి చేతను నభ్యసింప బడుచున్నది.... ఈ నవ యుగమున బ్రాహ్మణ కవిత్వము, బ్రాహ్మణేతర కవిత్వమును సమానముగానే ప్రకాశించుచున్నవి."** (పేజీ.177-178) అని కాలం తెచ్చిన మార్పును సుమారు నూరేండ్ల క్రితమే గ్రహించిన భోగరాజుగారి సహృదయత, వివేకాలు ప్రశంసనీయం.

భోగరాజు నారాయణమూర్తి గారు తెలుగు కవిత్వ రచన యుగ ధర్మాన్ని ప్రతిబింబించిందనీ, కాల పరివర్తనంతో పాటు తన స్వరూప స్వభావాల్ని కూడ మార్పు చేసుకొంటూ నడిచిందనీ నూరేళ్ల కిందటే గుర్తించడం విశేషం. వివిధ యుగాల్లో వర్ధిల్లిన కవులందర్నీ, సాహిత్య ప్రక్రియలన్నింటినీ పరామర్శించకున్నా, **"ఆయాయా యుగముల యందలి తదితర సామాన్య కవులను, వారి కావ్యములను గవులనియు, గావ్యములనియు గణింపకున్న యెడల, నింక మహాకవులనియు, మహాకావ్యములనియు నిర్ణయింపవలసిన యవసరమే యుండదు. అందుచే సామాన్య కవులును, సామాన్య కావ్యములను, మహాకవులకును, మహా కావ్యములకును గీర్తి సాధనములగు కతన, మన కవిత్వ చరిత్రము నందట్టికవులను, గావ్యములను గూడ బ్రసంగించుట యవసరమని నా విన్నపము"** (పేజీ.183) భోగరాజువారి ఈ కవి ప్రతిభా సామర్థ్య విచక్షణా గ్రహణశక్తి దృష్టులు సాహిత్య చరిత్రకారుల్లో అరుదుగా కనిపించే సులక్షణం.

# రమ్మంటున్నదందుకనే!

నువు బయటకు రావు నీ ప్రతిభనీ బయటకు రానీవు
ఎవరు ఏమంటారోనన్న భయంతోనే
ఎక్కడ తొట్రుపాటు పడతానన్న ఆందోళనతోనో
నీకు నువ్వుగా సంకెళ్లు వేసుకుంటావు
నీకు తెలియకుండానే నీ బాల్యం గడిచిపోయింది
నీకు తెలుస్తూనే యవ్వనమూ కరిగిపోతుంది
ఏమైనా చేద్దామని నిర్ణయించుకునేలోపే
ముసలితనపు దుప్పటి నిన్ను సాంతం కప్పేస్తుంది
అయినా నీవు అలాగే ఉంటావు
కదలని రాయిలా వదలని రేయిలా
బాల్యపు జ్ఞాపకాల పడవలోనే జీవితాంతం ప్రయాణించాలని
నువ్వెప్పుడూ తలపోస్తావు
నీ ఉడుకు రక్తం తెచ్చిపెట్టిన బహుమతులను
తదేకంగా చూసి అవి నీ జీవిత కాల ప్రతిభకు నిదర్శనాలని
అవే ఒలింపిక్ సాక్ష్యాలనీ నోబెల్ సాదృశ్యాలనీ
నీకు నువ్వుగా మురిసిపోతావు
మోడుబారిన నీ ప్రతిభావృక్షానికి
పచ్చరంగును పులిమి అదే వసంతమని భ్రమపడతావు
కాలం కల్పించిన అవకాశపు జల్లులతో
కలల పంటలను సాగుచేయకుండా
వీరులు కలిగించిన స్ఫూర్తితో విజయపతాకాన్నెగరేయకుండా
నీ ఊహా జగత్తులోనే ఊయలలూగుతూ
నిజం చేసుకోని తీయని స్వప్నాల వెంట
వడివడిగా పరుగులు తీసావు
వేళ్ళ సందుల్లోంచి ఇసుక జారిపోయినట్టు
కాలం నీ చేతినుండి జారిపోతుంది
అప్పుడు నీ కన్నీళ్లు కాలువలై
ఉప్పునీటి సముద్రాలను తయారుచేస్తాయి
కావ్యమై వెలగాల్సిన నీ చరిత్ర కన్నీటితో ముగుస్తుంది
అందుకనే నేస్తమా నిన్నిప్పుడు బయటకు రమ్మంటున్నది

**ఎన్. నరేశ్ చారి**
ఫోన్ : 9701334516

# పద్యమనోహరం - 22

## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

వరంగల్, ఫోన్ : 994 901 3448

**"కరటి చర్మముఁదానుగట్టి భక్తులకు సు**
**వర్ణచేలంబు లెవ్వాడొసంగె**
**ఫణిహారములు దానుబైదాల్చి యెవ్వాడు**
**మణిహారములు దానగణమునకిడెఁ**
**గాలకూటముఁదాను కబళించి సేవక**
**తతుల కెవ్వాడమృతం బొసంగెఁ**
**దాను గపాలంబు ధరియించి యెవ్వాడు**
**మితిలేని భాగ్యమాశ్రితుల కిచ్చె**

**అట్టి పరమదయాశాలి నబ్జమౌళి**
**నఖిల లోకేశు భూతేశు నభ్రకేశుఁ**
**బ్రమథ గణనాథు వినత సుపర్వనాథుఁ**
**బార్వతీనాథు మదిలోన బ్రస్తుతింతు"**


వెంకటగిరి సంస్థాన కవి గోపీనాథము వేంకటకవి రచించిన గోపీనాథ రామాయణములోని దేవతాస్తుతులలో చేసిన పరమశివుని వర్ణించిన ఈ పద్యం పలు అంశాలను, శివ సంబంధమైన పలు విశేషాలను, శివతత్త్వాన్ని వ్యక్తీకరిస్తూ ఉంది.

పరమశివుని వేషధారణ చాలా విశిష్టంగా ఉంటుంది. దాన్ని భూమికగా చేసుకొని గోపీనాథము వేంకటకవి తన స్తుతిలో ఆ విశిష్టతను గొప్పగా తెలియజేశాడు.

'పరమేశ్వరుడు తాను గజ చర్మధారియై భక్తులకు పట్టు వస్త్రాలను ప్రసాదించాడు. పాములనే తాను ఆభరణాలుగా ధరించి దాసులకు మణిహారాలిచ్చాడు. తాను కాలకూట విషాన్ని స్వీకరించి దేవతలకు అమృతము నందించాడు. తాను పుఱ్ఱెలను ధరించి తనను ఆశ్రయించిన వారికి అంతులేని సంపదలనిచ్చాడు. అటువంటి గొప్ప దయగలిగిన వాడు, సకల దేవతాధీశుడు, భూతనాథుడు, ప్రమథ గణాధీశుడు, పార్వతీపతి, దేవతలకు అధినాథుడైన స్వామిని నా మనస్సులో స్తుతిస్తాను' అంటూ చెప్పిన ఈ సీస పద్యం అనేక విశేషాల సమాహారంగా భాసిస్తున్నది.


గోపీనాథ రామాయణంలోని కవిత్వం రసవంతమై, సుశబ్ద సంపన్నమై పద్యకావ్యశ్రేణిలో మొదటిపంక్తిలో నిలబడగలిగిన కావ్యం. కవి ఎంతటి ప్రతిభావంతుడో కావ్య ప్రారంభంలోనే స్తుతి పద్యాలే సాక్ష్యంగా నిలుస్తాయి. ప్రతికావ్యావతారికలోను దేవతాస్తుతి చెయ్యడమనేది ఒక కావ్య సంప్రదాయం. దాన్ని అనుసరించి చేసిన ఈ శివస్తుతి కావ్య పాఠకునికి శివపురాణాది శివపారమ్య గ్రంథాల లోని అనేకాంశాలను తెలియజేస్తూ ఉంది. గజచర్మధారణకు సంబంధించిన గజాసుర వృత్తాంతము, క్షీరసాగర మథన వృత్తాంతము మొదలైన శివతత్త్వ విశేషాలను స్మరించజేయడంతో పాటు ఆశ్రితులకు అష్టైశ్వర్యాలను ఇవ్వడమే "మితిలేని భాగ్యం"గా వర్ణించాడు కవి. ఇక్కడ "భాగ్యం" - ధనం కాదు. అణిమాద్యష్ట విభూతులే నన్నది తాత్పర్యం. ఈ అష్టైశ్వర్యాలే అందించగలిగే సామర్థ్యం పరమశివునికే ఉన్నదన్న విషయం ధ్వనిస్తున్నది. ఇవి శాశ్వతైశ్వర్యములని కూడా లోకానికి చెప్పినట్లైంది.

తనను విశ్వసించిన వారికి, తనను నమ్ముకున్నవారికి మనకు లేకున్నా సరే వాళ్ళను ఆదుకోవాలన్న గొప్ప సత్యాన్ని ఈ పద్యం ఆవిష్కరించింది. ఆనందాలు, సంపదల పరమార్థాన్ని పద్యం స్ఫురింపజేసింది. ఎవరైతే ఈ విధమైన రీతిలో ఆదుకుంటారో వారే అసలైన దైవాలు. ఇవ్వగలగడమనే ఉత్తమ దైవగుణంగా తెలియజేసిన ఈ సీస పద్యం చక్కని శైలీవిన్యాసంతో కూడియున్నదే గాక, ఎత్తుగీతిలోని పదాల పోహళింపువల్ల అందమైన శబ్దాలంకార భూషితమై అలరారుతూ పాఠకునికి హృదయాహ్లాదకరమై ప్రకాశించింది. గోపీనాథము వేంకటకవి కవిత్వ ప్రతిభకు ఈ పద్యం ప్రబల సాక్ష్యం నిలుస్తుంది.




# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**




ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-

**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

మూసీ సాహిత్యధార
ప్రధాన ప్రసంగం

# పరిశోధన - స్వరూప స్వభావాలు -1

ఆచార్య జి.ఎస్. మోహన్, విశ్రాంత తెలుగు ఆచార్యులు, బెంగుళూరు.
ఫోన్ : 9

విశ్వ విద్యాలయాలలో పరిశోధన ముమ్మరంగా జరుగుతుంది. లెక్కలేనన్ని ఎం.ఫిల్, పిహెచ్.డి., పట్టాలు వచ్చాయి. సిద్ధాంత వ్యాసాలు కూడ ప్రచురింపబడ్డాయి. కొన్ని సిద్ధాంత వ్యాసాలను పరిశీలిస్తే **'పరిశోధన చేయడం'** అనేది కేవలం డిగ్రీకోసమే పరిమితం అయినట్టు కన్పిస్తుంది. ఏదో ఒక అంశాన్ని తీసుకోవడం, గడువులో సిద్ధాంతవ్యాసాన్ని సమర్పించడం జరుగుతోంది. అలాగని అందరూ ఇలాంటి ప్రవృత్తితో ఉన్నారని చెప్పడం భావ్యం కాదు.

'పరిశోధన'ను పరిశోధన కోసమే చెయ్యాలన్న ప్రవృత్తి ఉన్నవారు, లక్ష్యం ఉన్నవారు, ఉత్సాహం ఉన్నవారు లేకపోలేదు. అలాంటివారికి పరిశోధన అంటే ఏమిటో, ఎలా చెయ్యాలో వివరించే పుస్తకాలు తెలుగులో వ్రేళ్ళమీద లెక్కించదగ్గవి మాత్రమే ఉన్నాయి.

పూర్వ పరిశోధకులు పరిశ్రమించి, అన్వేషించేవాళ్ళు. వాళ్ళకు నిబద్ధత ఉండేది. నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, నిష్కర్షగా ఉంటూ తమ ప్రతిపాదనలను వెల్లడించేవాళ్ళు. తెలుగు భాషా సాహిత్యాలకు తమ జీవితాలను అంకితం చేసి సాహిత్యచరిత్ర నిర్మాణానికి కృషి సల్పిన పండితులు, మహానుభావులు పరిశోధకులెందరో మనకు మార్గదర్శకులుగా ఉన్నారు. సాహిత్యచరిత్రను వ్రాసినవాళ్ళు శాసనాలను, వ్రాతప్రతులను పరిశీలించినవారు ప్రాచీన గ్రంథాలను, కవులను పరామర్శించి కొంతవరకు భాషా సాహిత్యాంశాలను మన పూర్వ పరిశోధకులు సేకరించి పెట్టారు. వాటిని ఆధారంగా తీసుకొనే ఆయా కవుల కావ్యాలను, వ్రాతప్రతులను, శాసనాలను పరిశోధనాంశాలుగా స్వీకరిస్తున్నాం. అంటే మనం పరిశోధన చేయడానికి ముందే కొంతసమాచారం మన దగ్గర ఉంది. అలా మన పండితులు పరిశీలించిన వాటిని మళ్ళీ మనం అధ్యయనం చేసి సిద్ధాంతవ్యాస రూపంలో విశ్వవిద్యాలయాలకు సమర్పిస్తున్నాం. అలాగే జానపద సాహిత్యాన్ని, ఆధునిక సాహిత్యాన్ని పరిశోధన రూపంలో అధ్యయనం చేస్తున్నాం.

ఇక్కడ మనం గమనించాల్సింది –మన పండితులు విద్వాంసులు మనకు భాషా సాహిత్యవిషయాలను కొంతవరకు search చేసిపెట్టారు. అంటే శోధ, వెదకడం. మనం వాటిని RE-SEARCH చేస్తున్నాం. మన కవులు, రచయితలు, పరిశోధకులు మన ఆస్తి. ఎంతో అమూల్యమైన సాహిత్య సంపదను మనకు వదలిపెట్టి పోయారు. మనకు కావలసిన ముడిసరుకు ఉంది. వనరులు ఉన్నాయి. Resources ఉన్నాయి. అయితే మనం సరిగా ఉపయోగించుకోవటం లేదనిపిస్తుంది. పాశ్చాత్యులు ఏమాత్రం ముడిసరుకు లభించినా అద్భుతంగా పరిశోధనకు పూనుకుంటారు. సిద్ధాంతాలను రూపొందిస్తారు.

ఒక మంచి సిద్ధాంత వ్యాసరచన పరిశోధకుడికి, పర్యవేక్షకుడికి మంచిపేరు తెచ్చి పెట్టడమే కాదు. ఆ విశ్వవిద్యాలయానికి కూడ అది గర్వకారణంగా ఉంటుంది.

అందువల్ల పరిశోధన చేసేవాళ్ళకు తాము ఎంపిక చేసుకునే పరిశోధనాంశం మీద అభిరుచి, అభిలాష, ఆసక్తి ఉండాలి. అలాగే పరిశోధకుడు తనకు అవసరమైన వనర్లు, మూలాధారాలతో పాటు తనకు కావలసిన సమాచారం అందుబాటులో ఉంటుందా, ఉండదా అన్న విషయాన్ని ముందుగా ఆలోచించాలి.

ఏ విషయం మీద పరిశోధన చేయాలనుకొంటారో, ఆ విషయం గురించి సమగ్రమైన అవగాహన ఉండాలి. అందువల్ల విశ్వవిద్యాలయానికి పరిశోధనాంశం గురించి Synopsisను సమర్పించడానికి ముందు పరిశోధనాంశానికి సంబంధించిన అంశాలను సిద్ధం చేసుకోవాలి. దీన్ని Research Proposal అంటాము. ఇందులో పరిశోధన ఉద్దేశంతో పాటు పరిశోధన సామగ్రిని, సిద్ధాంత వ్యాస స్వరూపాన్ని (format), అధ్యాయాల విభజనను, ఆకరాలను ఇవ్వడం జరుగుతుంది. గమనించాల్సిన అంశాలు :

1. Problem to be investigated/ Title of Research Topic - పరిశోధించాల్సిన సమస్య ఏమిటి? లేదా పరిశోధనాంశం శీర్షిక ఏమిటి?

2. Scope – పరిమితి లేదా పరిధి లేదా విస్తృతి ఏమిటి?

3. Objectives - ఉద్దేశ్యం ఏమిటి/ లక్ష్యం ఏమిటి? Aims ఏమిటి?

4. Hypothesis - పరిశోధన ప్రమేయం ఏమిటి?

5. Research Design & Methodology / Plan of Analysis - పరిశోధన రూపకల్పన లేదా సిద్ధాంత వ్యాసరూపకల్పన లేదా పరిశోధన ప్రణాళిక. దీనికి అనుసరించే పరిశోధన పద్ధతులేమిటి?

6. Tools to be used in Collection of Data / లేదా Techniques లేదా Source of Data : పరిశోధన పరికరాలు లేదా పరిశోధన సామగ్రి ఏమిటి? సాంకేతిక పరిజ్ఞానం ఏమిటి? ఆధార సామగ్రి ఏమిటి?

సార్వజనిక గ్రంథాలయాలు, విశ్వవిద్యాలయ గ్రంథాలయాలు, వ్యక్తిగత గ్రంథాలయాలలో సేకరించే విషయాలు, కవులు, రచయితలను, భాషా సాహిత్యవేత్తలను కలిసి ముఖాముఖిగా సేకరించే విషయాలు, క్షేత్రపర్యటనలో సేకరించే విషయాలు, ప్రశ్నావళిలో సేకరించే విషయాలు మొదలైనవన్నీ పరిశోధన సామగ్రిలో ప్రముఖమైన అంశాలు.

7. Significance of the study : అంటే అధ్యయన ప్రాముఖ్యం ఏమిటి?

8. Its relevance to the present day problems and useful for the society : అంటే నేటి సామాజిక సమస్యలకు పరిశోధనాంశం ఎలా తోడ్పడుతుంది అన్న ప్రశ్న వేసుకొని పరిశోధనాంశాన్ని ఎంపిక చేసుకోవాలి. ఇంటర్వ్యూలకు వెళ్తే experts అడిగే ప్రశ్నల్లో ఇది కూడ ఒకటిగా ఉంటుంది.

9. Its likely contribution to the knowledge : జ్ఞాన సముపార్జనకు ఎలా సహకరిస్తుంది?

10. Bibiliography- ఆకర గ్రంథాలు లేదా పరిశీలించిన గ్రంథాలు.

**పరిశోధన :** జ్ఞానార్జన కోసం మానవుడు ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఆ ప్రయత్నంలో ఎన్నో కొత్తకొత్త విషయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస, తృష్ణ, కుతూహలం, ఉబలాటాలతో నిత్యం శ్రమిస్తూనే ఉన్నాడు. ఈ శ్రమ బుద్ధి సంబంధమైంది కాబట్టే తన చుట్టుప్రక్కల ఉన్న అనేక విషయాలను అర్థం చేసుకుంటున్నాడు. అర్థం చేసుకోలేని తన సమస్యల పరిష్కారానికి సమాధానాల కోసం అన్వేషిస్తున్నాడు. ఈ అన్వేషణకు సంబంధించిన Invention, Discovery, Research అన్న విభిన్న అర్థాలనిచ్చే ఇంగ్లీషు పదాలు వాడుకలో ఉన్నాయి. ఈ ఆంగ్ల పదాలకు పర్యాయంగా మనం తెలుగులో 'పరిశోధన' అనే పదాన్ని ప్రయోగిస్తున్నాం.

Discovery అనే నామపదం DISCOVER అనే క్రియాపదం నుంచి వచ్చింది. ఇక్కడ DIS అనేది నిషేదార్థక ప్రత్యయం. COVER అంటే మూత, ముసుగు, ఆవరించుకొను అనే అర్థాలు ఉన్నాయి. Discover అన్న పదానికి is-cover ఆవరించుకొన్న తెరను జరిపి సత్యాన్ని ఆవిష్కరించడం అని అర్థం. ఉదా : అద్దంకి, ఎర్రగుడిపాడు శాసనాల పరిశోధన ఇత్యాది.

Invention అనేది Invent అనే పదం నుంచి నిష్పన్నమైన పదం. ఇక్కడ Invent అంటే సృష్టించడం, నిర్మించడం అనే అర్థాలు ఉన్నాయి. అందువల్ల Invention అనే పదానికి కొత్త సృష్టి, కొత్త నిర్మాణం అని అర్థం. ఉదాహరణానికి ఎడిసన్ విద్యుత్తును కనుగొనడం Invention అవుతుంది. ఈ రెండు ఇంగ్లీషు పదాలలోను **'వెదకడం'** అనేది సామాన్యం.అ యితే ఈ వెదకడంలో రెండు విధాలు కన్పిస్తాయి. భూతకాలానికి సంబంధించిన పాతదాన్ని వెదకడం Discovery అవుతే, భవిష్యత్కాలానికి సంబంధించిన కొత్తదాన్ని వెదకడం Invention అవుతుంది. ఆంగ్లంలో ఈ రెండు పదాలు ఒక నిర్దుష్టమైన అర్థంలో ప్రయోగింపబడతాయి. ఈ రెండింటిలోను **'శోధించడం'** అనే ప్రక్రియ ఉంది. ఈ రెండూ అన్వేషణలే. అయితే భాషా సాహిత్య పరిశోధనల్లోను, జానపద విజ్ఞాన పరిశోధనల్లోను విశ్లేషణ చాలా అవసరం. అందువల్ల మనం Research అనే ఆంగ్ల పదానికి 'పరిశోధన' లేదా 'సంశోధన' అనే పదాన్ని ప్రయోగిస్తున్నాం.

RESEARCH అన్న పదం ఫ్రెంచి భాషా పదమైన RECHERCHER (దీని అర్థం Search Back) నుండి వచ్చింది. (Research Methodology in Social Sciences, P.3)

RE-SEARCH ఇందులో RE అన్న ఉపసర్గ (Pre fix) కు REPETITION అన్న అర్థం కనిపిస్తుంది. అంటే మరల లేదా మళ్ళీ అనే అర్థంలో వచ్చే ప్రత్యయం. Again అని ఇంగ్లీషులో అర్థం. Recapture, Rebuild, Reactivate, Recollect పదాల లాగా Re-search కూడా. ప్రాచీనాంగ్లంలో Research అన్న పదానికి 'The Repetition of a Search', 'Searching again' అన్న అర్థాలు ఉన్నాయి. అయితే నేటి వ్యవహారంలో Careful search లేదా Intense Investigation అన్న అర్థాలు కన్పిస్తాయి. సి.పి.బ్రౌన్ తెలుగు - ఇంగ్లీషు నిఘంటువులో Enquiry అనీ, పరిశోధించుట అనే భావార్థకానికి To examine, Investigate, To try, search అనీ అర్థాలు చెప్తారు. ఆప్టే సంస్కృత- ఆంగ్ల నిఘంటువులో పరిశోధన అంటే Purifying, Cleansing అనే అర్థాలు ఉన్నాయి. అంటే శుద్ధి చెయ్యడం అని అర్థం. అలాగే Research అనే పదానికి సమానార్థకాలుగా ఆప్టే ఇంగ్లీషు - సంస్కృత నిఘంటువులో అన్వేషణం, నిరూపణం, అనుసంధానం, జిజ్ఞాస, మార్గణం, విచారణం అనే అర్థాలు ఉన్నాయి.

'పరిశోధన' అంటే శుద్ధం చెయ్యడం, దిద్దడం అని అర్థం. దీనికి 'వెదకడం' అనే పర్యాయార్థం వచ్చి ఈ అర్థమే ఇప్పుడు వాడుకలో ఉంది. (సంశోధనె (కన్నడ గ్రంథం) డా. చిదానందమూర్తి ఎం.) పరిశోధన అనేది సత్యాన్ని చూడడానికి చేసే ఒక ప్రామాణిక ప్రయత్నం. అందువల్ల పరిశోధకుడికి ప్రామాణికత, నిబద్ధత అవసరం అన్న విషయం స్పష్టమవుతుంది. పరిపరివిధాల శోధించడం పరిశోధన. పరి అనడానికి మార్గం, విధం, రీతి పద్ధతి అనే అర్థాలు ఉన్నాయి.

'Essentially research is a matter of gathering and Evaluating information in order to be able to draw reasonable conclusions' J.H. Brurivand (Folklore- A study and Research guide 1976. P.85)

పరిశోధన అనేది సత్యాన్ని మిక్కిలి జాగ్రత్తతో నిర్ణయించే శక్తిగా ఫ్రాన్సిస్ బాకొన్ అభివర్ణించాడు. ప్రధానంగా పరిశోధన అంటే సామగ్రిని సేకరించి, వాటికి విలువ కట్టి సమంజసమైన నిర్ణయాలు చెయ్యడం అంటాడు జె.హెచ్. బ్రూన్‌వాండ్. మొత్తం మీద పరిశోధన అంటే ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో ఒక క్రమపద్ధతిలో సాగే సత్యాన్వేషణ, నూతనాంశాల ఆవిష్కరణ.

**పరిశోధన రీతులు :** ఆంగ్లంలో Methodology అన్న పదం వ్యవహారంలో ఉంది. ఇది Method అన్న పదం నుంచి వచ్చింది. పరిశోధన విషయంలో మనం రెండు అంశాలను గుర్తుంచుకోవాలి. 1. పరిశోధన విషయం (Content) 2. విధానం (Method). Content అనేది మనం పాఠకులకు అందించే అంశం. అంటే పరిశోధనాంశ వివరణ. Method అనేది పరిశోధనాంశ వివరణకు అవలంబించే పద్ధతి, విధానం లేదా మార్గం. దీన్నే 'రీతి' అంటే సరిపోతుంది. Research Methodology అంటే 'పరిశోధన రీతులు' లేదా 'పరిశోధన పద్ధతులు' లేదా 'పరిశోధన విధానం'. పరిశోధన విషయం మీద మనసును కేంద్రీకరించడమే కాకుండా పరిశోధన ఎలా చెయ్యాలో, వాటికి అవలంబించాల్సిన పద్ధతులేమిటో ఇందులో చేరుతాయి.

'Research Methodology is a way to systematically solve the research problem. It may be understood as a science of studying how research is done scientifically' (Research Methodology - Methods of Techniques, P.10m C.R.Kothari) శాస్త్రీయంగా, వ్యవస్థితంగా, సమగ్రంగా చేసే పరిశోధన విధానం Research Methodology అవుతుంది.

ఈ మాటల్ని గమనిస్తే పరిశోధకుడు తాను ఎందుకోసం ఆ సమస్యను ఎన్నుకొన్నాడో, ఆ సమస్యను పరిష్కరించడానికి ఎలాంటి విధానాన్ని లేదా పద్ధతుల్ని అవలంబించాడో, ఆ పద్ధతులనే తన పరిశోధనకు ఎందుకోసం ఉపయోగించుకొన్నాడో, లేదా తక్కిన పద్ధతుల్ని ఎందుకోసం ఉపయోగించుకోలేదో మొదలైనవన్నీ Methodology క్రిందికే వస్తాయి. అంటే **'పరిశోధన రీతులు'** అనేది పరిశోధనని శాస్త్రీయంగా చెయ్యడానికి పరిశోధకుడు అనుసరించే మార్గాలన్నమాట. కవితారీతుల లాగానే 'పరిశోధనారీతులు' కూడ. కళలు, విజ్ఞానశాస్త్రం మొదలైన విభాగాలకు ఒకేవిధమైన పద్ధతుల్ని అవలంబించడానికి వీలుకాదు. రసాయనశాస్త్రం, భౌతికశాస్త్రం మొదలైన విజ్ఞానశాస్త్రాలకు ప్రయోగశాల ఉపయోగపడితే, జానపద విజ్ఞానం భాషాశాస్త్రాలకు క్షేత్ర పర్యటన (Field work) ఉపయోగ పడుతుంది. అంటే ఈ రెండింటి విషయ సేకరణలకు పరిశోధకుడు అవలంబించే విధానంలో తేడా ఉంది. జానపద విజ్ఞానాంశాల సేకరణకు ప్రయోగశాలను కానీ, రసాయన శాస్త్రానికి క్షేత్ర పర్యటనను కానీ ఉపయోగించడానికి వీలుకాదు. అలాగే తక్కినవి కూడా. జానపద విజ్ఞానానికి అవలంబించే క్షేత్రపర్యటనను కవి లేదా కావ్యానికి సంబంధించిన పరిశోధనకు అనుసరించడానికి వీలు కాదు. క్షేత్ర పర్యటనకు సంబంధించిన సామగ్రి, ప్రాథమిక సమాచారం (Primary data) అవుతుంది. అంటే ఇది మూలసామగ్రి. కావ్యాలనుండి లేదా గ్రంథాలయాల నుండి లభించే సామగ్రి (Secondary data) అవుతుంది. దీన్ని ఆనుషంగిక సామగ్రి అంటారు.

The purpose of research is for gaining knowledge which will be used for solving problems. అందువల్ల ఇది applied research అవుతుంది. అలాకాకుండా for satisfying one's thirst for knowledge అవుతే ఇది pure research అవుతుంది. జ్ఞానార్జనకు ఇది సహకరిస్తుంది.

అలాగే పరిశోధన ముఖ్యంగా రెండు రకాలుగా ఉంది. ఒకటి శాస్త్ర సంబంధం, రెండోది వాఙ్మయ సంబంధం. శాస్త్ర సంబంధాన్ని Experimental లేదా ప్రయోగాత్మకం అనీ, వాఙ్మయ సంబంధాన్ని Observational లేదా పరిశీలనాత్మకం అంటాం. ప్రయోగాత్మక పద్ధతిలో మనకు కావలసిన అంశాలను ప్రత్యక్షంగా ప్రయోగం చేసికొంటాం. అయితే వాఙ్మయానికి సంబంధించిన పరిశోధన పద్ధతిలో ముఖ్యమైంది వివరణాత్మకం. ఇలాంటి పరిశోధనలో ఎంత ఎక్కువ సమాచారం సేకరిస్తే అంత ఫలితం ఉంటుంది. సేకరించిన అంశాలను వ్యాకరించి, క్రోడీకరించి వాటిలో ఒక సమన్వయాన్ని ఏర్పరచడమే ఇక్కడ చేయవలసిన పని. ఈ అంశాలు మనం ప్రప్రథమంగా కనిపెట్టినవి కాకపోయినా సమన్వయం మనం చేసేదే. అందువల్ల సామగ్రి సేకరణ, వ్యాఖ్యానాలతో కూడిందే పరిశోధన అవుతుంది.

**సిద్ధాంత వ్యాసం :**

ఏదైనా ఒక విషయానికి సంబంధించిన విశిష్టాంశాలను క్రమపద్ధతిలో అన్వేషించడం, కొత్త విషయాన్ని ఆవిష్కరించడం, కొత్త సంబంధాన్ని ఏర్పాటు చెయ్యడం, సమన్వయించడం, కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించడం, ప్రస్తుతం ఉన్న సిద్ధాతాన్ని లేదా విషయాన్ని పున:పరిశీలించడం అనేవి పరిశోధన ప్రధాన లక్ష్యాలు కాబట్టి ఈ లక్ష్యాన్ని సాధించడానికి పరిశోధకుడు సాక్ష్యాలను సేకరించి ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో ఒక క్రమపద్ధతిలో సిద్ధాంత వ్యాసాన్ని రూపొందించాల్సి ఉంటుంది. అందువల్ల స్పష్టంగా విషయాన్ని నివేదించడం సిద్ధాంత వ్యాస ముఖ్య ధ్యేయం.

సిద్ధాంత వ్యాసం అనేది పరిశోధన పూర్తయ్యాక పరిశోధకుడు సిద్ధం చేసే వ్రాతప్రతి. దీనికి ఇంగ్లీషులో 'Thesis', 'Dissertation, ' Research Report', 'Monograph' అన్న పేర్లు ఉన్నాయి. ఇవన్నీ 'Research Paper' కంటే భిన్నమైనవి. 'Research Paper' కొన్ని పుటలకు మాత్రమే పరిమితమయితే, ఇవి

దీనికంటె అధికమైన పుటలతో కూడి ఉంటాయి. సాధారణంగా 250 పుటలకు తక్కువ కాకుండా ఉన్న పరిశోధన వ్యాసాన్ని 'Thesis' అనీ, 100 పుటలకు తక్కువ కాని వ్యాసాన్ని 'Dissertation' అనీ వ్యవహరించడం పరిపాటి. ఈ రెండు పదాలనే మనం స్వీకరించి Thesis అన్న మాటకు 'సిద్ధాంత వ్యాసం' లేదా 'సిద్ధాంత గ్రంథం' అనీ, Dissertation అన్న మాటకు 'లఘు సిద్ధాంత వ్యాసం' అనీ వ్యవహరిస్తున్నాం.

**సిద్ధాంత వ్యాస రూపకల్పన**

**1. సిద్ధాంత వ్యాస రచన :** దీన్ని మూడు భాగాలుగా చేసుకోవాలి.

1. పరిచయాత్మకమైన మాటలు / పుటలు
2. ప్రధాన విషయ నివేదన
3. ఆధార విషయ నిరూపణ.

పరిచయాత్మకమైన పుటల్లో పరిశోధన విషయం (Title of the Thesis). సంవత్సరం, కృతజ్ఞతలు, ముందుమాటలు, సంకేతాల వివరణ చేరుతాయి. ఆ తర్వాత విషయసూచిక. ప్రధాన విషయ నివేదనలో ఉపోద్ఘాతం, పరిశోధన ఫలితాలు, ప్రధాన విషయం, ఉపసంహారం చేరుతాయి. ఉపోద్ఘాతంలో తాను పరిశోధనకు ఆ విషయాన్నే ఎందుకోసం స్వీకరించవలసి వచ్చిందో, తన ఉద్దేశ్యాలేమిటో స్పష్టంగా తెలియజెయ్యాలి. అలాగే తాను పరిశోధనలో అవలంబించిన పద్ధతుల్నీ, అధ్యయన ఆవశ్యకతనూ వివరించాలి. పరిశోధన ఫలితాల విభాగంలో పరిశోధకుడు క్లుప్తంగా తన పరిశోధనలో బయటపడ్డ విషయాలను తెలియజెయ్యాలి. ప్రధాన విషయంలో తాను ప్రతిపాదించే అంశాలను వివరణాత్మకంగా ప్రత్యేక అధ్యాయాలను సమకూర్చుకొని వివరించాలి. ఉపసంహారంలో తాను ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని తెలియజెయ్యాలి.

ఆధార విషయ వివరణలో అనుబంధాలు, ఆధార గ్రంథాల వివరణ నివ్వాలి. (గ్రంథాలు, పత్రికలు, వ్యాసాలు, రిపోర్టులు, ఇత్యాది).

2. సిద్ధాంత వ్యాస రూపకల్పనలో పుట ప్రకరణాలను (Page & Chapter format), అధో జ్ఞాపికలు / పాద సూచికలను (Foot notes), ఉల్లేఖాలను (References), ఉద్ధరణాలను (Quotations), అనుబంధాలను (Appendixes), ఆధార గ్రంథాలను (Bibliography) ఒక క్రమపద్ధతిలో పాటించాలి.

3. సిద్ధాంతవ్యాసం సంక్షిప్తం (Concise) గాను, వస్త్వాశ్రయం (Objective) గానూ, భాష సరళంగాను ఉండాలి. దురవబోధాలైన పదాలను 'ఉండవచ్చు', 'ఉండే ఉంటుంది' మొదలైన అస్పష్ట వ్యక్తీకరణలను పరిహరించాలి.

4. భాష మీద అధికారం ఉండాలి. తాను వ్యక్తీకరించే మాటలు పాఠకుడికి సులభంగా అర్థం కావాలి. సందర్భానికి అనుగుణంగా ఆయా పదాలను ప్రయోగించాలి. అలా అయినప్పుడే తన పరిశోధన ఫలితాలను స్పష్టంగా బహిర్గతం చెయ్యడానికి వీలవుతుంది.

5. సామగ్రి సేకరణ విషయంలో తన అనుభవాలను పరిశోధకుడు క్లుప్తంగా తెలియజెయ్యాలి.

పరిశోధకుడు పరిశోధనకు ఉపక్రమించేముందు తాను పరిశోధన చేయదలచుకున్న విషయం లేదా సమస్యను ఎన్నుకోవడం అత్యంత ప్రధానం కాబట్టి ఏదో విషయాన్ని ఎంపిక చేసుకొని డిగ్రీ సంపాదించుకోవాలనే తపన చాలామందిలో ఉండడం సహజం. దిగిన తరువాతే లోతు తెలుస్తుంది. కనుక తాను ఎన్నుకొన్న విషయానికి న్యాయం చేకూర్చగలనా లేదా అని ముందుగా ఒకసారి ఆత్మవిమర్శ చేసుకుంటే మంచిది. తాను తీసుకొన్న అంశం తనకు తృప్తిని, ముందుకు వెళ్లే ధైర్యాన్ని ఇచ్చేదిగా ఉండాలి. సమగ్రంగా విషయాన్ని సేకరించగలను, పరిశోధన చేయగలను అన్న ధీమా ఉన్నప్పుడే పరిశోధనకు పూనుకోవడం సమంజసం. ఎన్నుకొన్న సమస్యకు ఒక రూపకల్పన జరగాలి. తన సమస్యను ఏవిధంగా పరిష్కరించుకోవాలో, దానికి అనుసరించాల్సిన మార్గాలేమిటో ముందుగా ఒక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. తర్వాత విషయ సేకరణ, సిద్ధాంతీకరణ, సాక్ష్యాధార నిరూపణ. ఆ తర్వాతనే సిద్ధాంత వ్యాస రచన జరగాలి. సిద్ధాంతవ్యాసం కేవలం సమీక్షావ్యాసాలుగా ఉండకూడదు.

ఆలోచన, అన్వేషణ (సత్యాన్వేషణ), విషయ సేకరణ, విషయ విశ్లేషణ, నిరూపణ (సిద్ధాంత నిరూపణ) / ఆవిష్కరణ (నూతనాంశాల ఆవిష్కరణ) అనేవి సిద్ధాంత వ్యాస రూపకల్పనలో ప్రాధాన్యం వహిస్తాయి.

**సిద్ధాంత వ్యాసరచన / సిద్ధాంత వ్యాస రూపకల్పన : ప్రధానాంశాలు** :

**1. ముఖపత్రం** (Cover page) తో మొదలవుతుంది సిద్ధాంత వ్యాసరచన

**ముఖపత్రం మీద ఉండాల్సిన విషయాలు మాదిరి / నమూనా**

స్త్రీ పాటలు

(అనంతపురం జిల్లా)

జి.ఎస్.మోహన్

పిహెచ్.డి, పట్టం కోసం బెంగుళూరు విశ్వవిద్యాలయానికి సమర్పించబడిన సిద్ధాంతవ్యాసం – 1978

ముఖపత్రం

**2. పీఠిక / ఉపోద్ఘాతం** (Preface) : **పరిచయాత్మకమైన మాటలు**

పీఠిక లేదా పరిచయాత్మకమైన మాటల్లో పరిశోధనాంశ శీర్షిక/ సిద్ధాంత గ్రంథ శీర్షిక (Title of the Thesis), సంవత్సరం, కృతజ్ఞతలు, ముందుమాటలతో పాటు తాను పరిశోధనకు ఆ విషయాన్నే ఎందుకు స్వీకరించాడో, తన ఉద్దేశమేమిటో, తాను అవలంబించిన పద్ధతులేమిటో, అధ్యయన ఆవశ్యకత ఏమిటో తెలియజేయాలి.

3. విషయ సూచిక (Table of contents)

4. అక్షర సంకేతాల పట్టిక (List of Abbreviations)

5. సిద్ధాంతవ్యాస ముఖ్య భాగం : అధ్యాయాల విభజన / పుట ప్రకరణాలు (Page & Paper format)

6. ముగింపు / ఉపసంహారం / సింహావలోకనం

ముగింపులో తాను ప్రతిపాదించిన సిద్ధాంతంతో పాటు పరిశోధన సామగ్రి సేకరణ విషయంలో తాన అనుభవాలను క్లుప్తంగా తెలియజేయాలి. ఇది భావి పరిశోధకులకు మార్గదర్శకమవుతుంది.

7. అనుబంధాలు (Appendixes)

8. ఉపయుక్త గ్రంథసూచి (Bibliography / Reference Books)

అలాగే

1. అథస్సూచికలు / పాదసూచికలు (Foot notes)

2. ఉల్లేఖాలు (References)

3. ఉదాహృత వాక్యాలు (Quotations)

వీటిని క్రమపద్ధతిలో పాటిస్తే సిద్ధాంత వ్యాసరూపకల్పన అవుతుంది. సిద్ధాంత గ్రంథరచన సాఫీగా జరిగిపోతుంది.

సిద్ధాంత వ్యాసాన్ని పరిశోధకుడు కొన్ని అధ్యాయాలుగా లేదా ప్రకరణాలుగా విభజించుకోవాలి. అధ్యాయాలకు ప్రాధాన్యాన్ని బట్టి శీర్షికలు పెట్టాలి. అవసరాన్ని బట్టి ప్రధాన శీర్షికలో పార్శ్వశీర్షికలను, ఉపశీర్షికలను పెట్టుకోవాలి.

అధ్యాయంలోని విషయాలను చిన్న చిన్న పేరాలుగా విడగొట్టుకోవాలి. ప్రతిపుటలోను పాదసూచికలను పుట చివరి భాగంలో తెలియజేయాలి.

పాదసూచికలను మూడువిధాలుగా వ్రాయవచ్చు.

1. పుటకు క్రింది భాగంలో 2. అధ్యాయం చివర 3. సిద్ధాంతవ్యాసం చివర. మొదట ఎలా పాదసూచికలను సూచిస్తామో సిద్ధాంతవ్యాసం చివరిదాకా అదే విధానాన్ని పాటించాలి.

**పాద సూచికలలో :** 1. గ్రంథకర్త / రచయిత పేరు 2. గ్రంథం పేరు 3. ప్రచురణకర్త 4. ప్రచురణ స్థలం 5. ప్రచురించిన స్థలం 6. ప్రసక్త విషయం ఉన్న పుట.

ఉదా: జి.ఎస్.మోహన్, జానపద విజ్ఞానాధ్యయనం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం, 2002, పుట...

ఒక గ్రంథాన్ని గురించి మళ్ళీ మళ్ళీ చెప్పాల్సి వస్తే Ibid పదాన్ని వాడాలి. ఇంగ్లీషులో Ibidem అంటారు. అంటే అదే స్థలంలో అని అర్థం. తెలుగులో 'అదే' అని వాడుతాము.

ఒక పుస్తకాన్ని సూచించిన తర్వాత వెంటనే అదే పుస్తకాన్ని చెప్పాల్సినప్పుడు మాత్రం ఇలా వాడాలి. పుట సంఖ్యలో తేడా ఉంటే దాన్నిమాత్రం సూచిస్తే చాలు.

loc -cit.. Loco citato (అదే నిర్దిష్ట స్థలంలోది) అనేదాన్ని సూచించడానికి loc, cit అని వాడతారు. ఒక పుస్తకంలోని ఒక పుటను సూచించి మళ్ళీ అదే పుస్తకం అదే పుటను వెన్వెంటనే కాక కొన్ని పాదసూచికల తర్వాత చెప్పాల్సివస్తే loc, cit ని వాడుతారు. దీన్ని తెలుగులో 'పూర్వోక్తం' అంటాం.

**అనుబంధాలు :** ఇందులో సిద్ధాంత వ్యాసానికి పోషకాలైన అంశాలను మాత్రమే చేర్చాలి. సిద్ధాంత వ్యాసంలోని ప్రధాన భాగంలో చేర్చలేనివి మాత్రమే అనుబంధంలో చేర్చాలి. ఉదా. ముఖ్య పదకోశం, ఛాయాచిత్రాలు, మ్యాపులు, పట్టికలు, పద్యాలు, గేయాలు, ప్రశ్నావళి, ఇంటర్వ్యూలు ఇలాంటివి. ప్రశ్నావళిని, సందర్శన పద్ధతిని తప్పనిసరిగా పరిశోధకుడు తన క్షేత్ర పర్యటనలో నిర్వహించి అనుబంధంలో చేర్చాలి. సిద్ధాంత వ్యాసంలో అనుబంధంలో తప్పక ఇవ్వాల్సి అనుకున్న వాటిని గురించి చెప్పేటప్పుడు –

చూడండి. అనుబంధం – 1/ అనుబంధం – 2 అని ఇవ్వాల్సి ఉంటుంది.

ఉదా : సందర్శన – ముఖాముఖి సంభాషణ

ఉపయుక్త గ్రంథసూచిక లేదా ఆధారగ్రంథాలు లేదా పరిశీలించిన గ్రంథాలు Bibiliography లేదా Reference Books అని ఇంగ్లీషులో అంటారు.

సిద్ధాంత గ్రంథరచనకోసం పరిశోధకుడు ఉపయోగించుకొన్న గ్రంథాలనన్నిటిని పట్టికరూపంలో ఇవ్వడం Bibliography.

**వివరాలనివ్వడం :**

ఉదా : సర్వోత్తమరావు.కె, 1986, దాక్షిణాత్య దేశిచ్ఛందోరీతులు – తులనాత్మక పరిశీలన, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

సిద్ధాంత వ్యాసం సంక్షిప్తంగా Conscise ఉండాలి, వస్త్వాశ్రయంగా ఉండాలి (Objective) ఉండొచ్చు, ఉండే ఉంటుంది, కావచ్చు, ఇలాంటి అస్పష్ట వ్యక్తీకరణలను పరిహరించాలి.

**– ఇది సిద్ధాంత వ్యాస రచన.**

పరిశోధకులు సిద్ధాంతవ్యాసాన్ని కొన్ని అధ్యాయాలుగా విభజించుకోవడం ఉంది. తెలిసిన విషయాలనే, సిద్ధాంతాలనే పరిచేయడం

ప్రతి పరిశోధకుడూ మొదటి అధ్యాయంలో చేస్తున్న పని. ఉదాహరణానికి జానపద సాహిత్యం మీద పరిశోధన చేస్తున్న పరిశోధకుడు జానపద సాహిత్యం అంటే ఏమిటో, అందులో ఎన్ని భాగాలు ఉన్నాయో మళ్ళీమళ్ళీ చెప్పాల్సిన పనిలేదు. అరవయ్యేళ్ల క్రితమే డా. బి. రామరాజుగారు తమ పరిశోధన గ్రంథం **'తెలుగు జానపద గేయ సాహిత్యం'**లో తెలియజేశారు. అలాగే కథ అంటే ఏమిటో మళ్ళీ చెప్పాల్సిన పనిలేదు. డా. పోరంకి దక్షిణామూర్తిగారు తమ 'కథానికా స్వరూప స్వభావాల' గురించి విస్తృతమైన పరిశోధన చేశారు. చాలామంది పరిశోధక విద్యార్థులు ఇలా అందరూ చెప్పిందే తమతమ సిద్ధాంతవ్యాసాలలోని మొదటి అధ్యాయాలలో పునరుక్తం చేస్తున్నారు. (సశేషం)

## బడుగుల చేరవే వరలక్ష్మీ! (ఇష్టపది మాలిక)

ఏడుకొండలవాని ఎదలోన కొలువుండి
ఎల్లలోకములనల చల్లగా చూడవే

తండ్రి దండన నుండి తప్పించి మముగాచి
పురుషకారముచేసి వరములిప్పించవే

జగమంత నీకొరకు జపములను, తపములను
కొలిచి తమ కోర్కెలతొ నిలిచి ఉన్నారమ్మ!

కదలిపై వానల్లె కలవారి భవనముల
స్థిరమయ్యి పేదింట్ల చేరవెందుకు తల్లి?

బిర్లాల, టాటాల బిలములో నెలవుగొని
బడుగు కడుపుల నింప అడుగేయి మాతల్లి!

ఆదాని,అంబాని ఆవాసముల వదలి
పూరి గుడిసెల జొచ్చి పులకింపజేయవే!

మదన జననీ! నీవు కదలాడు ఇల్లేమొ
సిరి సంపదల తూగి చిరునగవులొలికేను

ఇందిరా! నువు లేని ఇల్లు "నిల్లే"గాని
"పుల్లుగా" కష్టాల నీళ్ళగుండము తల్లి!

కనకలక్ష్మీ! నిన్ను కలవాడు "కలవాడు"
బలములన్నిటవాడు పరపతులు కలవాడు

పొదుపు చేయనివారి పొలిమేర పోబోకు
పిసినారి పేటికన వసియించకే తల్లి!

**డాక్టర్ అడిగొప్పల సదయ్య**
ఇష్టపది రూపకర్త
కరీంనగరం.

## తెలంగాణ సిరిమల్లె

తెలంగాణ ఎద తానై నిలిచినాడు కాళోజీ
కాళన్నగ ప్రజల మదిని గెలిచి నాడు కాళోజీ!!

రజాకార్ల ఉద్యమాన ముందుండీ పోరాడీ
నిజాంరాజు దౌష్ట్యము నెదిరించినాడు కాళోజీ!!


కన్నడమ్మ మరాఠయ్యకును పుట్టీ ఓరుగల్లు
నడుగుపెట్టి తెలగాణ వెలుగైనాడు కాళోజీ!!

తెలుగు భాష రానట్టీ తెలుగువాని బ్రతుకేలర
చావవెందుకురాయంటు అడిగినాడు కాళోజీ!!

ఉద్యమాల బాటలోన కలం పట్టి రచనలన్ని
పలుకుబడుల భాషలోన రాసినాడు కాళోజీ!!

నిరాడంబరమైనట్టి జీవితాన్ని తాను గడిపి
పద్మ విభూషణు ప్రజల వాడైనాడు కాళోజీ!!

తెలంగాణ యాస శ్వాస అతనిదాయె ఓ సీతా
తెలంగాణ సిరిమల్లెగ విరిసినాడు కాళోజీ!!




**డా. చీదెళ్ళ సీతాలక్ష్మి**
విశ్రాంత సహాయాచార్యులు, హైదరాబాద్.
ఫోన్ : 9490 367 383

నివాళి

# ప్రతిభామూర్తి గంగాపురం హరిహరనాథ్

**పల్లెర్ల రామమోహన్ రావు,** మహబూబ్‌నగర్ ఫోన్ : 917 784 0278



**"వ్యాఖ్యల్ జేయుచు, భాష్యముల్ పలికి, కావ్య ప్రక్రియల్, శాస్త్రముల్**
**విఖ్యాతమ్ముగ వ్రాసియున్, ఘనత సద్వేదాది విద్యాకులం**
**ప్రఖ్యాతిం గనినట్టి పండితులకున్, పాండిత్య శౌండీర్య మం**
**దాఖ్యల్ గల్గిన వారికిన్నెలవు సుమ్మా, మండలంబంతయున్"**

పాలమూరుజిల్లా ప్రతిభా పాండిత్యాలకు దర్పణము పట్టే గంగాపురం హనుమచ్ఛర్మగారి పద్యమిది. ఆధునిక కాలములో దీనికి లక్ష్యప్రాయులైన విద్వన్మణులలో ఒకరు గంగాపురం హరిహరనాథ్ గారు. ఆదర్శాచార్యులుగా, ప్రామాణిక పరిశోధకులుగా గణనకెక్కిన ధీవర్యులు.

తెలంగాణ నందనోద్యానములో వసివాడని ప్రతిభా పరిమళ ప్రసూనము గంగాపుర వంశము, నైష్ఠికులు, నిత్యాగ్నిహోత్రులు, నృసింహోపాసకులు, వైదిక, లౌకిక విద్యా సంపన్నులు, గ్రంథాలయోద్యమ యోధులు, దేశభక్తులు ఈ వంశమున జన్మించి వన్నె తెచ్చినారు. పాలమూరు జిల్లాలో శ్రౌత, స్మార్త విద్యాపీఠమై వెలుగొందిన వంశమిది. ఈ వంశమున 1.1.1940న గంగాపురం హరిహరనాథ్‌గారు జన్మించారు. వీరి స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం మేడిపూరు గ్రామము. ఇది దుందుభీనదీ తీరములో ఉన్నది.

సంస్కృతాంధ్రాంగ్ల హిందీ భాషలలో గట్టి పట్టున్న హరిహరనాథ్ గారు **'మహాభారతము – కరుణ రస పోషణము'** అన్న సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పట్టా నందుకొన్నారు. తెలుగు ఉపన్యాసకులుగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి జడ్చర్ల, జోగిపేట, పాలెం కళాశాలలలో బోధన చేసి రీడర్‌గా ఉద్యోగ విమరణ చేశారు.

**ఆదర్శాచార్యులు :** వైదిక సాహిత్యం, లౌకిక సాహిత్యం, దర్శనాలు, బౌద్ధ దర్శనం, ప్రత్యేకించి సౌందర్య శాస్త్రములో సాధికారిక పాండిత్యము కలవారు. కొంతకాలము కాశీలో కూడా అధ్యయనము చేసినవారు. ఈ అధ్యయన సంపదను అధ్యాపనలో వినియోగించినారు.

ఆయా సందర్భాలననుసరించి పాఠ్యపుస్తక పరిధులను దాటి విశేష విషయాలను అందించేవారు. అధ్యయన విధానాన్ని ధ్వనిమంతంగా ఉపదేశించేవారు. పాలెం ఓరియంటల్ కళాశాలలో ఒకసారి విద్యార్థులను 'అఆ'లు చదువమన్నారట. విద్యార్థుల ముఖాలు వివర్ణమయ్యాయట 'అఆ'లు అడుగడమేమిటని. అందరూ చదివాక అసలు విషయాన్ని చెప్పారట. మీలో చాలామందికి ఉచ్చారణ విధానము తెలియదు. మీరు సరిగ్గా నేర్చుకొంటే, తరువాతి కాలములో మీరు తెలుగు పండితులయితే పిల్లలకు భాష బాగా వస్తుందని అన్నారట. వాటి ఉచ్చారణ విధానాన్ని తెలియజేశారట. ఎంత దూరదృష్టి! ఎంత భాషాభిమానము! ఇలా చేశారు కనుక విద్యార్థుల పట్ల చిన్నచూపుండేది కాదు. తన పిల్లల్లాగే ప్రేమించేవారు. ఎంతోమందికి తమ ఇంట్లో భోజన వసతి కల్పించారు. సెలవులకు తాను హైదరాబాద్‌కు వెళితే విద్యార్థులకే ఇల్లు అప్పజెప్పేవారు. పాలు, పేపరు, పదార్థ సౌకర్యాలన్నీ సమకూర్చి వారిని తన ఇంట్లో ఉండ మనేవారు. తరగతి గదిలో సున్నితమైన హాస్యాన్ని పండించేవారు. ఒకసారి ఒక విద్యార్థి వారంరోజుల తరువాత తరగతికి వచ్చాడు. ఎందుకు రాలేదని వీరు అడిగారు. అతడు ఊరికోతి (ఊరికి పోతి) అన్నాడు. వెంటనే హరిహరనాథ్‌గారు ఇతర విద్యార్థులతో "అరే వీడు ఊరికోతి అటరా" అన్నారు. తరగతి గది నవ్వులతో నిండిపోయింది. విద్యార్థులు వీరింటికి వెళితే సోఫా, కుర్చీలపై కూర్చోమనేవారు. వారు వద్దంటే వీటిని బయట పడేయండి. ఎందుకివి అనేవారు. అంతటి వాత్సల్యము.

**ప్రామాణిక పరిశోధకుడు :** విషయ పుష్టి, నిశిత దృష్టి గల పరిశోధకాగ్రగణ్యులు వీరు. ఏ విషయములోనైనా 'ఉపరిశోధన' వీరికి చేతకాదు. వామనత్వము వీరి రచనారాశికి ఉందేమో కాని వాసికి కాదు. అపూర్వ విషయాలను ఆవిష్కరిస్తే కాని వీరి లేఖిని ఊరట చెందదు.



బి.ఎన్.శాస్త్రిగారు సంపాదకత్వంలో ప్రకటించిన 'మహబూబ్ నగర్ జల్లా సర్వస్వము'నకు హరిహరనాథ్‌గారు **'మహబూబ్‌నగర్ జిల్లా వేద, శాస్త్ర, సంస్కృత సాహిత్యేతిహాసం'** అన్న బృహద్వ్యాసాన్ని అందించారు. దాదాపు 100 పేజీలలో సాగిన ఈ వ్యాసములో క్రీ.శ.7వ శతాబ్ది నుండి 20వ శతాబ్ది వరకు ఈ ప్రాంతంలో జన్మించిన దాదాపు 200 మంది కవి పండితుల ప్రతిభా విశేషాలను పొందుపరిచారు. ఇందులో చాలామంది చరిత్రకెక్కని చరితార్థులే. తెలంగాణ చరిత్ర పునర్నిర్మాణానికి ఎంతో ఉపయోగపడే వ్యాసమిది. తెలంగాణ సగర్వంగా ప్రకటించుకోగల మహనీయులనెందరినో పరిచయం చేశారు.

వాచస్పతి గుండేరావు హర్కారే గారితో వీరికి సన్నిహిత సంబంధము ఉంది. వారింటిలోనే ఉన్నారు. వారి సాహిత్య, శాస్త్ర కృషిని దగ్గరగా దర్శించినవారు. అందుకే ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలుగు అకాడమీ వారి కోరిక మేరకు **'గుండేరావు హర్కారే జీవిత విశేషాలు'** అన్న గ్రంథం రచించారు.

**ఆచార్య నాగార్జునుడు - శూన్యవాదం, గొల్లత్తగుళ్ళుగా జైన చైత్యాలయాలు, పంచద్రావిడులెవరు, దశవిధ బ్రాహ్మణులు, ప్రాకృతిక చికిత్స సిద్ధాంత భూమిక, ప్రాచీన భారతీయ విద్యా స్వరూపం, ఋగ్వేదంలో నదుల ప్రశంస** వంటి పరిశోధన రచనలు వారి విభిన్న విషయ పరిజ్ఞానానికీ, పరిశోధనా పటిమకు నిదర్శనాలు. బి.ఎన్.శాస్త్రి గారు వెలువరించిన **'బ్రాహ్మణరాజ్య సర్వస్వము'**నకు సాధికారిక 'భూమిక'ను అందించారు.

చరిత్ర పరిశోధనపై వీరికి మక్కువ ఎక్కువ. బి.ఎన్.శాస్త్రిగారి ఇంటిలో జరిగే చారిత్రక సంబంధ సమావేశాలకు తప్పక హాజరయ్యేవారు. **'కళ్యాణిచాళుక్యులు మనవారే, పాలమూరు జిల్లా బాదామీ చాళుక్యుల శాసనాలు - సంస్కృతి, నల్లగొండ జిల్లా శాసన సాహిత్యం'** వంటి వ్యాసాలు వీరి చారిత్రక పరిశోధనా పటిమను పట్టిచూపుతాయి. మహబూబ్‌నగర్‌జిల్లా సర్వస్వంలో చాలా తప్పులు వచ్చాయని ఆవేదన పడేవారు.

శాసనాలలో సాహిత్య సృష్టిని వెలికి తీసారు. చారిత్రక పట్టణమైన 'సురభి' విశేషాలను వివరించారు. సంస్కృతాంధ్ర సంకీర్తనాచార్యులు పల్లా నారాయణాధ్వరి గురించి ఎన్నో విషయాలను లోకానికి వెల్లడించారు. వీరి కీర్తనలు చాలా శ్రమకోర్చి సేకరించారు. అవి ముద్రించాలన్న వారి కోరిక తీరలేదు. రాకొండ రాఘవశర్మగారి ప్రమీలార్జునీయం యక్షగానాన్ని పరిష్కరించి చక్కని పీఠికను సమకూర్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రకటించిన మహాభారత వ్యాఖ్యాన పంరపరలో ద్రోణపర్వ ప్రథమాశ్వాసానికి వ్యాఖ్య వెలయించారు. గంగాపురం అంటే ప్రత్యేకాభిమానం. కనుకనే **'గంగాపుర క్షేత్ర చరిత్ర - శాసనాలు'** అన్న గ్రంథం రచించారు. కాని ఇది ముద్రణకు నోచుకోలేదు. గంగాపుర సమీపంలో కల గొల్లత్తగుడుల కట్టడం గూర్చి ఎంతో చొరవ చూపారు. పురావస్తు శాఖవారితో సంప్రదింపులు జరిపి ఆ కట్టడానికి భద్రపరచడంలో కీలక భూమిక వహించారు. మీనాంబర క్షేత్రంలో గల పరుసవేదీశ్వర రసలింగ విశేషాలను ఎన్నో వివరించేవారు.

వారి తండ్రిగారి గురించి వేదవిద్య విశారదులు **'గంగాపురం నృసింహ దీక్షితులు'** అన్న గ్రంథం ప్రకటించారు. ఇందులో యజ్ఞ సంబంధమైన విశేషాలనెన్నో తెలియజేశారు. కృష్ణాది తీరంలో గల బీచుపల్లిలో కొన్ని సంంవత్సరాల క్రింద **'సోమయాగం'** జరిగితే నిర్వాహకుల ఆహ్వానం మేరకు వెళ్ళి సోమయాగం గురించి ప్రత్యేకప్రసంగం చేశారు. దానిని తరువాత వ్యాసంగా మలచారు.

మహబూబ్‌నగర్‌కు చెందిన **'చింతపల్లి'** కవుల గూర్చి ఈ జిల్లాకు చెందిన పరిశోధకుడు తన సిద్ధాంత గ్రంథంలో వ్రాసిన విషయాలను ఖండిస్తూ వ్యాసం వ్రాశారు. హరిహరనాథ్‌గారు పరిశోధకుల అనవధానత పట్ల చరిత్రకు ప్రమాదం ఏర్పడుతుందని వాపోయారు. పరిశోధకుని బాధ్యతను గుర్తుచేశారు.

**నిరాడంబరులు :** 'విద్యా దదాతి వినయం' అన్న సూక్తికి ఉదాహరణగా నిలిచారు. ముఖంలో చెదరని చిరునవ్వు, వాక్కులో పరిశోధన పటిమ, పిల్లలతో కూడా హాయిగా కలిసిపోయే తత్త్వం వారిది. ప్రచారార్భాటాలకు పది ఆమడల దూరం. అందుకే ఏ ప్రముఖులతో ఫోటోలు కాని, ఆయా సమావేశాల ఫోటోలు కాని వారివద్ద లేవు. వ్యక్తుల ఫోటోల గూర్చి **'మనిషి మనసులో ఉండాలి, ఫోటోలో కాదు'** అనేవారు. నడకకు చాలా ప్రాధాన్యం ఇచ్చేవారు. ఉదయం తొందరగా భోజనం చేయడం వారికలవాటు. చిరుతిండ్లు ఇష్టపడేవారు. పూజలకు అంతగా ప్రాధాన్యమిచ్చేవారు కాదు. వారు అంతర్ముఖులు. బాహ్యాడంబరాలను నిరసించేవారు. దుందుభి నది అంటే వల్లమాలిన ప్రేమ.

అపార వైదుష్యముతో, అసమాన ప్రతిభతో, అద్వితీయ పరిశోధనతో ఆదర్శమూర్తిగా వెలుగొందిన హరిహరనాథ్‌గారు 8.8.2021న హఠాత్తుగా మరణించారు. 'అనాయాసేన మరణం వినా దైన్యేన జీవనమ్' అనేది వీరికి అన్వర్థమైనది.

కారణాలు ఏవైనా వారినుండి రావలసినన్ని రచనలు రాలేదనే అనిపిస్తుంది. ఎన్నో చారిత్రక విషయాలు, సాహిత్య రహస్యాలు అందకుండా జేసింది వారి మరణము. వారి భవ్యాత్మకు అక్షర నివాళి.

# రత్నగర్భ తనూజుడు – కారణ జన్ముడు

**డా. వొజ్జల శరత్ బాబు** , ప్రభుత్వ ఉపాధ్యాయులు, హైదరాబాదు. ఫోన్ : 9494183937

రెడ్డిఫ్ డాట్ కామ్ న్యూస్ ద్వారా ఒక ఆర్టికల్ చదివాను. అది చదువుతున్నంతసేపు ఔరా! ఒక దేశ మాజీ ప్రధానిని ఆ దేశ జాతీయ నాయకుడిగా గుర్తించరా? అనే బాధలో మునిగాను. కాదు కాదు కన్నీటిపర్యంతమైనాను. ఆ ఆర్టికల్ శీర్షిక పేరు **'నరసింహారావు ఫైనల్ హ్యూమిలేషన్'**. అది రాసిన వారు ఎం. డి. Nalapat. ఇది 2004 డిసెంబర్ 27 నాటిది.

విజయ్ సీతాపతి గారు రాసిన మరో వ్యాసం కూడా నన్ను దైన్య స్థితిలోకి నెట్టివేసింది. ప్రపంచంలోని మేటి దేశంగా తీర్చిదిద్దేందుకు కష్టపడిన ఒక మాజీ ప్రధాని అంత్యక్రియల కొరకు ఇంత రహస్య రచ్చనా?! అని మరోసారి ఏడవడం నా వంతు అయింది. Half Lion: How PV Narasimha Rao transformed India అనేది. దీన్ని స్వరాజ్య మార్గ్ డాట్ కామ్ ద్వారా చదివాను.


ఒకవేళ వాటిలో ఉన్న విషయాలు నిజం కాని పక్షంలో కేసుల మీద కేసులు కోర్టులో పడేవేమో లేదా **"మరణాంతాని వైరాని"** అని పలికిన శ్రీరాముని మాటలను గుర్తుకు తెచ్చుకున్నారేమో తెలియదు.

బూజుపట్టిన సిద్ధాంతాలను పక్కన పెట్టి ఈ దేశ ఆర్థిక వ్యవస్థ కూకటివేళ్లతో సహా ఇక కూలి పోతుందేమో అనే పరిస్థితి నుండి గట్టెక్కించిన వాడు కదా! అలాంటి నాయకుడి పేరు చరిత్రపుటల్లో ఎలాగు లిఖించబడి ఉంటుంది. ఇది కాదనలేని సత్యం. పివి గారి పూర్తి కాలపు పరిపాలన 1996 మే నెలలో ముగిసింది. వెనువెంటనే ప్రధాని పదవికి రాజీనామా చేశాడు. ఆయన ప్రధాన పదవి చేపట్టిన నాటినుండి ఎప్పుడు ఆయన ప్రభుత్వాన్ని కూల్చివేయాలా? అని ఎంత మంది ఎదురు చూశారో! ఇక్కడ మహాకవి కాళిదాసు రాసిన మాళవికాగ్నిమిత్రం అనే నాటకంలోని ఒక శ్లోకాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి.

**"అచిరాధిష్ఠిత రాజ్యః ప్రకృతి ష్వరూఢ మూలత్వాత్?**
**నవ సంరోపణ శిథిలః తరురివ సుకరః సముద్ధర్తుమ్."**

(అప్పుడే మొలచిన మొక్క లేదా పాతిన మొక్కవేళ్ళు సరిగా పాదుకొని ఉండదు. దాన్ని అప్పుడు అయితేనే సులభంగా తీసేయవచ్చు. అలాగే రాజ్యాధికారం చేపట్టిన ప్రభువు పరిస్థితి అంతే. ఎందుకంటే ఆయన అటు జనంలోనూ ఇటు ఉద్యోగులలోనూ పెద్దగా పాతుకొని పోలేదు. దేశ వ్యవహారాల విషయంలో స్థిరపడి ఉండదు. కాబట్టి ఆయన్ని తీసివేయడం చాలా సులువవుతుంది – ఇది పై శ్లోక భావం)

బహుశః పివి గారి ఎదుటిపక్షం వారు ఈ శ్లోక భావాన్ని అనుసరించారో ఏమో! కానీ ఒక విషయం సత్యం. ఆయన ఈ




దేశానికీ కొత్త కాదు. రాజ్య వ్యవహారాలకూ కొత్త కాదు. రాజకీయ వ్యవస్థకూ కొత్త కాదు. సత్సంకల్పాలన్నింటా తల పండినవాడు. ఇక్కడ భాస్కర శతక పద్యాన్ని ఉట్టంకించాలని అనిపిస్తున్నది.

**"తగిలి మదంబుచే నెదిరి తన్ను నెఱుంగక దొడ్డవానితో**
**పగగొని పోరుటెల్ల నతిపామరుడై చెడు, టింతెగాక?**
**నెగడి జయింప నేర,దది నిక్కము, దప్పదు ధాత్రి లోపలన్**
**దెగియొక కొండతో తగరు ఢీకొని తాకిన నేమి భాస్కరా!"**

పొట్టేలు పర్వతాన్ని ఢీ కోవడం వల్ల పర్వతానికి ఏమీ కాదు. సరి కదా పొట్టేలు తల పగలడం కాయం. పీ.వీ.పై కేసుల విషయంలో అక్షరాల ఇదే జరిగింది. ఎందుకంటే ఎక్కువగా నేరారోపణలు ఎదుర్కొన్న తొలి భారత ప్రధానమంత్రి ఈయననే అనుకుంటా. ఒకటా రెండా చాలా కేసులు ఆయన శిరస్సుపైకి ఎక్కాయి. జార్ఖండ్ ముక్తి మోర్చా కేసొకటి. మరొకటి సెయింట్ కిట్స్ ఫోర్జరీ కేసు. అక్కరకు రాని లఖూబాయీ పాఠక్ కేసు ఇంకోటి. ఏ మాత్రం పస లేని స్టాక్ మార్కెట్ కుంభకోణం – హర్షద్ మెహతా కేసు కూడా కోర్ట్ కెక్కింది. ఇలా ఎన్నింటినో ఆయన ఎదుర్కొన్నాడు. ఎన్ని కేసులైనా ఎదుర్కోవడానికి ఆయన సహజసిద్ధంగానే సిద్ధమయ్యి ఉన్నటువంటి వాడు.

ఇక్కడ సంస్కృత మహాకవి భవభూతి రాసిన ఉత్తర రామ చరితం లోని శ్లోకాన్ని గుర్తుకు వస్తుంది.



**"వజ్రాదపి కఠోరాణి మృదూని కుసుమాదపి**
**లోకోత్తరాణి చేతాంసి, కోహి విజ్ఞాతుమర్హసి?**

(లోకంలో ఉంటూనే లోకానికి అతీతంగా మెలుగుతున్న వారి మనసులను తెలుసుకోవటం సాధ్యం కాదు. వారి మనస్సు కుసుమ కోమలంగానూ ఉంటుంది. అవసరమైనప్పుడు వజ్ర కఠోరంగానూ ఉంటుంది. రెండు విధాల వారూ ప్రవర్తిస్తుంటారు. ఎందుకంటే వారు కారణజన్ములు – ఇది పై శ్లోక తాత్పర్యం)

స్పష్టమైన నిర్దుష్టమైన లోక శ్రేయస్సునే కాంక్షించే రాజును ఎవ్వరు ఏమి చేయలేరు.ఆ రాజు పై చేసే ఏ ప్రయత్నమైనా విఫలమవుతుంది. నరసింహారావు గారి విషయంలో జరిగింది ఇదే.

ప్రధాని పదవిలో ఉంటూ కేసులను ఎదుర్కొన్న ఆయన ప్రధాని పదవి దిగిన తర్వాత కూడా ఆ తిప్పలు ఆయనకు తప్పలేదు. ఈ అన్ని కేసులను దాదాపు 8 సంవత్సరాల పాటు ఎదుర్కొన్నారు. ఈ కేసుల నిమిత్తం తన ధనాన్ని దాదాపుగా ఖర్చు చేశారు. చివరకు తనకున్న ఆస్తిని కూడా అమ్మడానికి వెనుకాడలేదని ఎక్కడో ఒక చోట చదివినట్లు గుర్తు. మహానుభావుల చరితలు ఇలాగే ఉంటాయేమో!

1991లో పీవీ రిటైర్మెంటుకు ఆనాటి ఆయన పార్టీ అధ్యక్షుడు ఒప్పుకున్నారట. దాని కొరకు ఆజ్ఞ కూడా పొందారట. కానీ తానొకటి తలిస్తే దైవమొకటి తలిచింది. రాజీవ్‌గాంధీ మరణించి ఉండక పోయినట్లయితే పీవీ గారి పరిస్థితి, ఈ దేశ పరిస్థితి మరోలా ఉండేదేమో! **"అధికార అంతమందు చూడవలె నయ్యగారి సౌభాగ్యముల్.."** అనే మాట పివి గారి విషయంలో వర్తించదని అనిపిస్తుంది. ఎందుకంటే ఆయన **'అసిధారా మధులేహన న్యాయం'** అనే న్యాయానికి ఆచరణలో అర్థం చెప్పిన మనిషి. ఆలాంటి ఆయనకు బురద అంటించాలి అనుకున్నారేమో!. తద్వారా కీర్తి మసక బార్చవచ్చనీ భావించారేమో!. ఆయనకు ఏ బురద ఈషణ్మాత్రం కూడా అంట లేదు. సరిగదా! ఆయన కీర్తి పెరగటానికి రెట్టింపు ఊతం అయినట్లు కనబడుతుంది.

దానికి కారణం ఏమంటే – గీతాచార్యుడు పలికిన

**సుఖదుఃఖే సమే కృత్వా, లాభాలాభౌ జయా జయౌ।**
**తతో యుద్ధాయ యుజ్యస్వ, నైవం పాప మవాప్స్యసి॥**

అనే మాటలను ఆచరించినవాడు. అందుకే ధర్మ దేవత తన సరైన తీర్పును చెప్పగలిగింది. పీవీని పులుకడిగిన ముత్యంగా లోకంలో నిల్పింది. రాజా రాష్ట్ర కృతం పాపం...... అని పెద్దలు అంటారు. ప్రజల్లో భాగమైన వైరి పక్షం వారి అదేదో కొంత రాజైన ఈయనకు అంటిఉంటుంది. అంతే తప్ప ఆయన చేసిన తప్పు అనేది కనబడదు. ఆ విషయం ఆయన జీవిత పుస్తకం లోని ఏ కొన్ని పుటల గూర్చి విన్నా చదివినా తెలుస్తుంది.

2004 డిసెంబర్ 23, దేశానికి విషాదమైన రోజు. ఒక మహోన్నత శిఖరం విధి ధర్మాన్ని పాటించింది. ఆ శిఖరాయ మానుడైన వ్యక్తి తాను దేనినీ అపేక్షించలేదు. వద్దనుకున్నా తన ముందు వచ్చి వాలినాయి. అయినా తాను మాత్రం

కర్మణ్యేవాధికారస్తే... అనే ప్రబల సూత్ర మార్మికాన్ని ఎరిగిన వాడు. కాబట్టే దాన్ని తు.చ. తప్పకుండా అమలు చేసాడు. రాజ్యధర్మాన్ని పాటించాడు. అలాంటి మహానుభావుడికి మనం నివాళు లు తప్ప ఏమర్పించ గలము?

అయినా మనం చేయాల్సినవి కొన్ని మన చేతుల్లోనే ఉన్నాయి. ఆయన గూర్చి నాలుగు మాటలు తరాల వరకు వినిపించగలము. చదువుకునేట్లు చేయగలం. ఆ 'రాజకవీశుడి' ని స్మృతిపథంలో ఉంచుకునేట్లు చేయగలం. ఆయన ఆచరించిన బాటను ఆచరించే ప్రయత్నమూ చేయగలం. దేనికైనా ఆచరణనే గీటురాయి కదా!

మన తెలంగాణ ప్రభుత్వం ఆ పనిలో ఒక అడుగు ముందే ఉంది. ఆ విషయాన్ని మనం చెప్పుకోక తప్పదు. ఆయన శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించింది. ఆయన స్మారకములను నిర్మాణం చేసింది. ఆయన సాహిత్యాన్నీ వెలుగులోకి తెచ్చింది. **'భారతరత్నం'** గా ఆయనను భాసింపచేయాలని కేంద్ర ప్రభుత్వానికి అక్షరాల చెప్పింది. ఇది నిజమౌతుందని ఆశిద్దాం! కానీ బిరుదు వచ్చిన రాకున్నా ఆయన ఎప్పటికీ భారత రత్నమే.

ఈ దేశపు సూర్యుడే.

తెలుగువారి పుణ్య పురుషుడే.

మన తెలంగాణ వారి విజయకేతనమే.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నూతన పాఠ్యపుస్తకాలను అందించింది. అందులో పివి గారి అద్భుతమయిన వ్యాసాన్ని తొమ్మిదవ తరగతిలో ఒక పాఠంగా ప్రభాసింప జేసింది. తన న్యాయవాద గురువైన బూర్గుల రామకృష్ణా రావు గారి గూర్చి పీ.వీ.రాసిన వ్యాసమది. అది చదువుతుంటే అందులోని ఏవో కొన్ని విషయాలు తప్ప మిగిలిన లక్షణాలను పీ.వీ.పుణికిపుచ్చుకున్నాడా! అని అనిపించక మానదు. ఆ పాఠం

ప్రారంభంలో 'చదువండి – ఆలోచించి చెప్పండి' అనే శీర్షిక కింద ఉన్న (పాఠశాల విద్యా సంచాలకులు, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారికి నమః పూర్వక ధన్యవాదములు తెలుపుకుంటూ) ఆ పద్యస్మరణతోటే ఈ శతజయంత్యుత్సవాల సందర్భంగా భారతపుత్రరత్నానికి శిరోనమ్రములమై శ్రద్ధాంజలిని ఘటిద్దాం!.

సహనమ్ము, సత్యమ్ము, శాంత గంభీరమ్ము,
ఆత్మవిశ్వాసమ్ము నహరహమ్ము
సాధన, దక్షత, సాధుభాషణమును,
సద్వివేచనమును, సద్గమనము,
దానమ్ము, ధైర్యము, త్యాగమ్ము, సునిశిత
బుద్ధి, మేల్గాంచుట, పుణ్య గుణము
కరుణ, క్షమ, పరోపకార బుద్ధి యనెడి
యాలోచనారీతు లమరియుండు


మనుజులెపుడును మాన్యులు, మంగళ స్వ
రూపులు, మహోన్నతులు,విరాడ్రూప శోభి
తులు, సుకీర్తికాంతవరపతులు,సుమతులు,
జగతిగతి విరచితులు, సజ్జనులు వారు.

–స్వస్తి–

(పీ.వీ. శత జయంతి ఉత్సవాల సందర్భంగా సంవత్సరం పాటు పివి గారిని బహుకోణాల్లో దర్శింప చేసిన మూసి పత్రిక సంపాదకులకు, పత్రిక యాజమాన్యానికి నిర్వాహకులకు పాఠక వతంసులకు శతధా కృతజ్ఞతాంజలులు.)



మాతృమూర్తి తో శ్రీ పి.వి.నరసింహారావు



జీవితభాగస్వామి శ్రీమతి సత్యమ్మ తో శ్రీ పి.వి.నరసింహారావు


# 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే

ఉత్తమ గ్రంథం **'కదంబం'.**

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.


**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# విశ్వ సప్త సంసేవితులు



సూర్య మయూఖముల్ గనిన క్షోణిని జీవము కల్గు ప్రాణులున్
వీర్యము గల్గి సస్యతతి విస్తృతినందును శాకయుక్తమై,
ధైర్యమునిచ్చి మానవుల స్థైర్యము బెంచును తన్మయూఖముల్
క్రౌర్యపు వైరసున్ విధిగ గాల్చును జీవుల రక్షణార్థమై

శారద చంద్రికా ధవళ సాంద్ర రుచుల్ జగమెల్ల బర్వగన్
నీరద సమ్మితాభ్రమున నిల్చిన తారకలెల్ల గొల్వగా,
వారి రుహంబు మిత్రుగని బంధుర హర్షమునందు రీతి, వి
స్తారముగాగ మానవుల సంతస మా క్షపనాథుడుండెడున్



మిన్నును వాయువుం గలియ మిక్కిలిగా జనియించు శబ్దముల్,
పన్నుగ జ్ఞానవాక్కులును వానిలొ నెన్నియొ చేరె మర్త్యులన్
ఎన్నగ జంతుజాలము లనేక విధంపు రవంబులంది, సం
పన్నత సైగజేసికొను, బాధలనైనను దెల్యజేసెడున్

గాలి యభావమైన మహి గల్గిన జీవచరంబులన్నియుం
గాలు సభాంగణంబునకు గ్రక్కునc జేరు క్షణంబులోనc బ
ద్మాలయ నాథుడీ జగతిc నారయకుండు సమాంతరంబుగాc
గాలుని కాలు కార్యమది గమ్యము జేరుc దలంచకుండనే

నీరము సర్వజవులకు నిత్యమవశ్యము, జీవనప్రదం
బారయ మూడు కారులు నయంబున పంటలనిచ్చు భూమిపై
వారక శుద్ధికర్మనిడు, వారియె దప్పిని మాన్పు, జీవులం
దేరికినైన నిష్టమయి యింపెసలారును సర్వసేవ్యమై



నిప్పిన సర్వజీవులకు నిశ్చితమౌ జఠరాగ్ని నిచ్చు, మే
లొప్పగ కంటిలో నిలిచి యుర్విని గల్గిన వస్తురూపముల్
దప్పక చూపు, దేహమున దార్కొని స్వాస్థ్యము బెంచు, వంటలం
దెప్పుడు పాత్రతంగను, నహీన బలంబున నిల్చు నిమ్మహిన్

భూమికి సాటి దైవమెది? భుక్తికి రక్తికి నన్నపూర్ణయౌ,
నేమముతోడ రైతులకు నిక్కము బంగరు పంటలిచ్చు, దా
నోమిన నీటి సాయమున, నుల్లము రంజిలజేయు జూచినన్,
శ్రామిక దీనవర్గముల రక్షణ జేయుచునుండు భూమియే

డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి
మహబూబ్‌నగర్, ఫోన్ : 8555899493

కె. విశ్వనాథ్ చలన చిత్రాలు -
సామాజిక అవలోకనం - 15

# సిరి సిరి మువ్వ

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254



**“ఎవరికెవరు ఈ లోకంలో ఎవరికి ఎరుక – ఏ దారెటు పోతుందో ఎవరినీ అడగక”** ఈ వాక్యం లోని తాత్వికత ప్రతి మనిషి జీవితానికి అనువర్తించేలా వుంటుంది. ఈ వాక్యం అన్ని తరాలకు, అన్ని తరగతులకు వర్తిస్తుంది. మనిషిలోని సకార, నకారాత్మక గుణాల మేళవింపుల పరిణామంగా ఉత్పన్నమయ్యే పరిస్థితులకు నిర్వచనీయం గా నిలుస్తాయి. కె.విశ్వనాథ్ ఈ వాక్యాన్ని ఆధారంగా, దారంగా చేసుకొని సంగీత, సాహిత్య, నృత్య కలయికగా, మాలగా కూర్చి రూపొందించిన చిత్రం **“సిరిసిరిమువ్వ”.** ఈ చిత్రం 1976 లో విడుదలైంది. చంద్రమోహన్, జయప్రద, కైకాల సత్యనారాయణ ప్రధాన తారాగణంగా నటించారు.

**చిత్ర కథ సంక్షిప్తంగా :**

రుద్రయ్య (కైకాల సత్యనారాయణ) ఒక నాట్యాచార్యుడు. కాని అతనికి పక్షపాతం రావడం వల్ల నృత్యం నేర్పించలేని స్థితిలో వుంటాడు. అంతేకాక తన స్వంత కూతుళ్ళకు కూడా నృత్యం నేర్పించలేక పోతున్నాననే క్షోభను అనుభవిస్తూ వుంటాడు. రుద్రయ్య మొదటి భార్య మరణం తర్వాత వివాహం చేసుకున్న రెండవ భార్య త్రిపుర (రమాప్రభ). రుద్రయ్య మొదటి భార్య కూతురు హైమ (జయప్రద). తను మూగ అమ్మాయి. రెండవ భార్య త్రిపుర కూతురు సరిత (కవిత). నాట్యాచార్యుడైన సాక్షి రంగారావు ఆధ్వర్యంలో తన కూతుళ్ళకు నృత్యం నేర్పిస్తుంటాడు రుద్రయ్య. మువ్వ కట్టి నృత్యం చెయ్యడం అంటే మహా మక్కువ హైమకు. హైమ నాట్యం చెయ్యడం ఇష్టం వుండదు త్రిపురకు. తన సవతి తల్లి ప్రేమతో హైమను నృత్యం నేర్చుకోకుండా అడ్డుపడుతూ సూటిపోటి మాటలంటూ పనులు చెప్తూ హింసిస్తూ వుంటుంది. మాట మాట్లాడలేని హైమ బాధకు తండ్రి రుద్రయ్య తల్లడిల్లిపోతూ వుంటాడు.

రుద్రయ్యకు నమ్మినబంటు సాంబయ్య (చంద్రమోహన్). సాంబయ్యకు రుద్రయ్య, అతని కూతురు హైమ అంటే బహు రాజభక్తి. సాంబయ్య డప్పు కొడుతూ పాటలు పాడడంలో దిట్ట. తన డప్పు, పాటలతో చుట్టూ వున్నవారిని అలరిస్తూ రుద్రయ్య ఇంట్లో బస చేస్తూ వుంటాడు. రుద్రయ్య అక్క నిర్మలమ్మ కుమారుడు భద్రం (దేవదాసు కనకాల). భద్రం చెప్పే మాటలను నమ్ముతూ తన కూతురును హీరోయిన్ చెయ్యాలని ఆశపడ్తూ వుంటుంది సరిత తల్లి త్రిపుర. మరోవైపు రుద్రయ్య తాను బతికుండగానే హైమకు వివాహం చేయాలనే ఆలోచనతో సంబంధాలు చూస్తూ వుంటాడు. ఈ విషయం తెలిసి సాంబయ్య హైమకు బాగా ఇష్టమైన మువ్వలను ఆమె వివాహం రోజు ఇవ్వాలని, ఆమె మువ్వలు కట్టుకొని మురిసిపోతూ నాట్యం చేస్తుంటే చూడాలని కలలు కంటూ వుంటాడు. దానికోసమై సాంబయ్య పట్నం వెళ్ళి డప్పు కొడుతూ పాటలు పాడుతూ డబ్బు సంపాదిస్తూ వుంటాడు. మరోవైపు హైమకు వివాహం నిశ్చయం అవుతుంది.

సాంబయ్య పట్నంలో వుండగా ఒకరోజు రాత్రి ఒక సంఘటన జరుగుతుంది. అది ఒక వివాహితను ఆమె భర్త డబ్బుల కోసం పరాయి మగాడి వద్దకు పంపిస్తాడు. ఆ విషయం తెలిసి ఆమె నిరాకరించడంతో ఆమెపై భర్త దారుణంగా చేయి చేసుకుంటాడు. సాంబయ్య వెళ్లి ఆమెను రక్షిస్తాడు. ఆ అమ్మాయి పేరు కుసుమ. అప్పటినుండి కుసుమ సాంబయ్యను అన్నయ్యగా భావిస్తుంది. హైమ వివాహమప్పుడు ఆమెకు ఇవ్వడానికై సాంబయ్య మువ్వలు కొనడానికి వెళ్తాడు. కాని అదే సమయంలో సాంబయ్య సంపాదించిన డబ్బులు దొంగతనం చేయబడతాయి. ఆ సమయంలో అన్నయ్యగా భావించే కుసుమ అతనికి మువ్వలు కొనడానికి సాయం చేస్తుంది. అవి తీసుకుని సాంబయ్య హైమ వివాహానికి వెళ్తాడు. కాని హైమతో పాటు పెళ్ళిపీటల మీద కూర్చున్న అబ్బాయిని చూసి నిర్ఘాంత పోతాడు. రుద్రయ్య వద్దకు వెళ్ళి వీడొక పెద్ద వెధవ, హైమమ్మకు వీడితో పెళ్లి చేస్తే ఆమె జీవితం బుగ్గిపాలు అవుతుందని ప్రాధేయపడి ఆపిస్తాడు. డబ్బులిచ్చి పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడ్డ అబ్బాయితో పెళ్లి రద్దైందనే కారణంతో సవతి తల్లి త్రిపుర, భర్త రుద్రయ్య, అతడి కూతురు హైమలపై కోపం పెంచుకుంటుంది. గతంలో తన నుంచి భార్య కుసుమ విషయంలో తలదూర్చి కాపాడి, మళ్ళీ ఇప్పుడు హైమతో పెళ్ళిని చెడగొట్టాడనే కారణంతో సాంబయ్య పై కోపం

పెంచుకుంటాడు ఆ పెళ్ళి కొడుకు. అంటే కుసుమ భర్త. హైమతో పాటు పెళ్ళి పీటలపై వున్నది కుసుమ భర్తే కాబట్టి సాంబయ్య ఆ వివాహం జరగకుండా అడ్డుపడతాడు. త్రిపుర అనారోగ్యంగా వున్న తన భర్తను వదిలేసి సరితను తీసుకొని పట్నం వెళ్తుంది. సరితను హీరోయిన్ చెయ్యడానికి అత్తతో కలిసి భద్రం ప్రయత్నాలు చేస్తుంటాడు. మరోవైపు రుద్రయ్యకు ఆరోగ్యం క్షీణిస్తుంది. ఆ సమయంలోనే సాంబయ్య రుద్రయ్యతో హైమను మంచి అబ్బాయికి ఇచ్చి వివాహం చేసే బాధ్యత తనదంటూ మాటిస్తాడు. రుద్రయ్య మరణిస్తాడు. కాని త్రిపుర తన భర్త అంత్యక్రియలకు కూడా వెళ్ళి నోచుకోదు.

తండ్రి మరణంతో ఒంటరిదైన హైమకు సాంబయ్య అండగా వుంటూ ఆమెను పట్నం తీసుకెళ్లి జాగ్రత్తగా చూసుకుంటూ వుంటాడు. హైమ చెల్లి సరితకు మొత్తానికి సినిమాలో అవకాశం వస్తుంది. తన కూతురు హీరోయిన్ అనే వెర్రి గర్వం ఆవహిస్తుంది సరిత తల్లి త్రిపురకు. కాని సరిత తన నాట్యాచార్యుడు సాక్షి రంగారావు నేర్పినట్లు కాకుండా పాశ్చాత్య తరహాలో డాన్స్ చెయ్యాల్సి వస్తుంది. సరిత తండ్రి రుద్రయ్య గురించి, ఆయనకు నాట్యం పట్ల గౌరవాభిమానాలను గూర్చి తెల్సిన సాక్షి రంగారావు సరిత వేస్తున్న కుప్పిగంతుల నృత్యాన్ని చూసి మనసులోనే రోదిస్తాడు. అంతేకాక త్రిపుర తన కూతురికి పొట్టి, పొట్టి దుస్తులు వేసుకొని తిరిగే పరిస్థితి దాపురించినా ఏ మాత్రం సిగ్గులేకుండా ప్రోత్సహిస్తుంది. చిత్ర షూటింగ్ పూర్తైన తర్వాత ఆమె పోస్టర్లు, కటౌట్లు నగరవీధుల్లో వెలుస్తాయి. ఒకరోజు సరిత ఆమె తల్లి త్రిపుర, బావ భద్రంలు రోడ్డుపై వెళ్తున్నప్పుడు ప్రజలు తరిమితరిమి కొడతారు. కారణం నగరవీధుల వెంట వెలసిన సరిత అశ్లీలమైన కటౌట్లు, పోస్టర్లు.

హైమను చక్కగా చూసుకుంటూ ఆమెకు పెళ్ళి చెయ్యడానికి వరుడిని వెతుకుతూ వుంటాడు సాంబయ్య. అదే సమయంలో కుసుమ ద్వారా లలితకళలు ప్రదర్శించే కళాక్షేత్రంలో ప్రదర్శనలకు అనుమతిచ్చే పెద్ద స్థాయి వ్యక్తి పరిచయం అవుతాడు సాంబయ్యకు. ఆయన ద్వారా కళాక్షేత్రంలో డప్పు ప్రదర్శనకు అనుమతి పొందుతాడు. ఇదే సందర్భంలో సాంబయ్య కళాక్షేత్రం నిర్వహించే వ్యక్తితో హైమను చేసుకొమ్మంటూ పెళ్లి ప్రతిపాదన చేస్తాడు. ఇదిలా వుండగా ఒకరోజు సాంబయ్య ఆరోగ్యం సరిగ్గా లేక ఆసుపత్రికి వెళ్తాడు. ఆ సమయంలో అతడికి టి.బి.వుందనే విషయం తెలుస్తుంది. కాని సాంబయ్యకు తన అయ్యగారైన రుద్రయ్యతో హైమ వివాహం తాను చేస్తానంటూ ఇచ్చిన మాట గుర్తొచ్చి తన ఆరోగ్యం గురించి హైమకు తెలియకుండా జాగ్రత్త పడతాడు. తన ఆరోగ్యం కన్నా హైమ వివాహమే ముఖ్యం అనే ఆలోచనతో డబ్బులు కూడబెట్టే ప్రయత్నం చేస్తాడు. కాని ఒకరోజు హైమకు సాంబయ్య దుస్తుల్లో ఒక ఆసుపత్రి చీటీ దొరుకుతుంది. ఆ చీటీ గురించి ఆరా తీయడం ద్వారా సాంబయ్య కు టీబీ వుందనే విషయం తెలుస్తుంది. తన పట్ల సాంబయ్య చూపిస్తున్న అభిమానానికి హైమ అతడిపై మనసు పడుతుంది. సాంబయ్యను కాపాడుకోవాలనే ప్రయత్నంలో డబ్బు కోసమై కళాక్షేత్రంలో నృత్య ప్రదర్శనకు సిద్ధమవుతుంది. సాంబయ్య, హైమలు ఇరువురు ప్రదర్శన కోసం ఒకేసారి ఒకరికి తెలియకుండా ఒకరు ప్రదర్శన చేయడానికి కళాక్షేత్రం చేరుకుంటారు. ఆ సమయంలో ఇద్దరూ ఒకరికి ఒకరు తారసపడతారు. ఈ సన్నివేశం చిత్రంలోని ప్రధాన సన్నివేశాల్లో ఒకటని చెప్పవచ్చు. హైమ సవతి తల్లి త్రిపుర తాను చేసింది తప్పని మనుషుల విలువ తెలుసుకుని పశ్చాత్తాపానికి గురవుతుంది. మరోవైపు సాంబయ్య హైమను కళాక్షేత్రంలో పెద్ద స్థాయిలో వున్న అబ్బాయితో వివాహానికి ఒప్పించే ప్రయత్నం చేస్తాడు. అదే సమయంలో ఆ అబ్బాయి సాంబయ్యను కలిసి తాను జీవితాన్ని పంచుకోవాలనుకుంటున్నది నీతో అని చెప్పి సాంబయ్యను, హైమతో కలిసి జీవితం పంచుకోవడానికి అంగీకరింపజేస్తాడు. మరోవైపు హైమతో వివాహాన్ని చెడగొట్టాడు అనే కక్షను పెంచుకున్న కుసుమ మాజీ భర్త సాంబయ్య ఆచూకీ కోసం భద్రంను ఆశ్రయిస్తాడు. అప్పటికే తన అత్తలాగానే పశ్చాత్తాప భావంలో వున్న భద్రం అతడికి సహకరించడు. దానితో కుసుమ మాజీ భర్త అటు భద్రాన్ని, ఇటు సాంబయ్యను కిడ్నాప్ చేస్తాడు. హైమ సాంబయ్యను వెతకడానికి అతడు వాడే డప్పును మోగిస్తూ తిరుగుతూ వారి ఆచూకీ తెలుసుకుంటుంది. అదే సమయానికి పోలీసులు అక్కడికి చేరుకుని సాంబయ్య, భద్రంలను విడిపిస్తారు. సాంబయ్య, హైమలు కలిసిపోవడంతో చిత్రం సుఖాంతం అవుతుంది.

**చిత్ర విశేషాలు :** కె.విశ్వనాథ్ చిత్రాలన్నింటినీ పరిశీలిస్తే 'సిరి సిరి మువ్వ' కు ముందు, తర్వాత అని మాట్లాడుకోవచ్చు. ఈ చిత్రం నుండి కె.విశ్వనాథ్ సంగీతం, సాహిత్యం, నృత్యాలను ప్రధానం చేసుకొని చిత్రాలు నిర్మించాడు. అంతకుమునుపు చిత్రాల్లో కూడా ఎక్కడో ఒకచోట వాటిని అనగా పౌరాణిక అంశాల్లోని ఘట్టాల రూపంలోనో, స్టేజిపై ప్రదర్శించే రూపంలోనో ఏదో విధంగా చిత్రంలో మిళితం చేసే ప్రయత్నం సలిపారు. నిజానికి 'సిరిసిరి మువ్వ' ప్రచార చిత్రాన్ని విడుదల చేయడంతోనే ఒక సంచలనానికి తెర తీశారని చెప్పొచ్చు. డప్పుకు మాలలా వేయబడిన మువ్వలు తో కూడిన పోస్టర్ అది. డప్పు, మువ్వలు రెండు విభిన్నమైన ప్రక్రియలకు చెందిన అంశాలు. దానికి తోడు మన సమాజంలో వాటి రెండింటి మధ్య తరగతి వైషమ్యం కూడా కనపడుతుంది. నిజానికి హెచ్చుతగ్గులున్న ఇద్దరి మనుషుల మధ్య ప్రేమ నేపథ్యంలో చాలా సినిమాలు వచ్చినా ఈ చిత్ర ప్రచార చిత్రం రేపినంత ఆసక్తి అప్పటివరకు ఏ చిత్రం విషయంలోనూ జరిగి వుండదు. చిత్ర కథాగమనంలో కూడా ఎక్కడా ప్రేక్షకుడికి కథానాయక, నాయికల మధ్య ప్రేమ భావనతో కూడిన సన్నివేశాలు కనపడవు. కాని అక్కడక్కడా దర్శకుడు ప్రేక్షకుడి తెలివికి

పరీక్ష పెట్టేలా సూచనలు అందజేస్తూ వుంటాడు. దానికి ఉదాహరణగా నిలిచే సన్నివేశం. రుద్రయ్య చనిపోయేప్పుడు సాంబయ్య హైమకు మంచి అబ్బాయితో వివాహం చేస్తా అని మాట ఇస్తాడు. కాని రుద్రయ్య ప్రాణం వదిలే సమయంలో అటు హైమ, ఇటు సాంబయ్య చేతులలో చెరొక చేయివేసి మరణిస్తాడు. అంటే వాళ్ళిద్దరూ కలవడాన్ని ఆయన ఆశపడ్తున్నట్లు సంకేతం కన్పిస్తుంది. ఇక ఈ చిత్రం స్క్రీన్‌ప్లే మరొక స్థాయిలో వుంటుంది. అంతకుముందు చిత్రాలు కథను చెప్పే క్రమంలో సన్నివేశాల పరంగా ప్రత్యేకంగా తీస్తే, ఈ చిత్రంలో మాత్రం అక్కడక్కడా చిన్న ప్రతీకలచే, సీన్‌ను కట్ చేసే విధానం ద్వారా స్క్రీన్ ప్లే లో మ్యాజిక్ చేశాడు దర్శకుడు. చిత్ర కథ ప్రధానంగా హైమ పాత్ర చుట్టూ తిరుగుతుంది. మూగదైన హైమకు మువ్వ కట్టి నృత్యం చెయ్యడం అంటే ప్రీతి. కాని ఒక సందర్భంలో సాంబయ్య తన అయ్యగారైన రుద్రయ్యను **'మూగదైన హైమమ్మ ధ్వనికి అనుగుణంగా ఎలా నృత్యం చెయ్యగల్గుతుంది'** అని అడుగుతాడు. దానికి రుద్రయ్య బదులుగా **'తను పుట్టు మూగది కాదు తనకు మూగతనం మధ్యలో వచ్చింది అందుచేత తను వినగలదు'** అని చెప్తాడు. ఈ సన్నివేశం ద్వారా ప్రేక్షకుడికి వచ్చే అనుమానాన్ని నివృత్తి చేశారు దర్శకుడు. వ్యాస ప్రారంభంలోని వాక్యంలాగా జీవితాల్లో జరిగే సంఘటనల ఫలితంగా మనుషుల మధ్య సంబంధాలు ఎలా మారుతుంటాయి అవి వారి జీవితాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయి అనే విషయాలకు దృశ్యరూపం ఈ చిత్రం. ఇక చిత్రం ఆఖరులో వచ్చే ఘట్టం విభిన్నంగా వుంటుంది. హైమను వివాహం చేసుకోవడానికి వచ్చిన అబ్బాయి అంతకుముందు ఒక సన్నివేశంలో తన భార్య కుసుమను డబ్బు కోసం పరాయి మగాడి వద్దకు పంపడం మనిషిలోని దిగజారుడు తనానికి, నీచ ప్రవృత్తికి తార్కాణం. త్రిపుర తన కూతురు సరితను హీరోయిన్ చేయాలనే లక్ష్యంతో చిత్ర పరిశ్రమలో అవకాశాల కోసం తిరుగుతున్న నేపథ్యంలో వచ్చే సన్నివేశాలన్నీ చిత్ర పరిశ్రమ గురించి ఊహాలోకంలో విహరిస్తూ అనాలోచితంగా, ఆవేశంతో, మిడిమిడి జ్ఞానంతో పల్లె వదిలి పట్నం వెళ్ళే యువతీ, యువకులకు అక్కడ వుండే వాస్తవ పరిస్థితులను అవగతం చేసేలా వుంటాయి.


మూగ అమ్మాయిగా, సవతి తల్లి చేత పడే కష్టాలకు బాధ చెప్పుకోడానికి నోరు లేక, మువ్వలు కట్టి నృత్యం చేయాలని తపించే అమ్మాయిగా జయప్రద నటన అద్భుతం. ఇక హైమ జీవితం కోసం సాంబయ్య చేసే ప్రయత్నాలు, తనపై సాంబయ్యకు వున్న గౌరవం, తనను సాంబయ్య కాపాడుకునే వ్యక్తిత్వం నచ్చి అతనే భర్తగా వస్తే బాగుండు అనే సంకేతాలన్నింటినీ కేవలం హావభావాలతో వ్యక్తీకరించేలా నటించడం జయప్రద నటనా స్థాయిని పెంచింది. సాంబయ్యను తాను వివాహం చేసుకోవాలనుకుంటున్నట్లు చెప్పేందుకు సాంబయ్య డప్పుకు తన కాలి మువ్వలను మాలగా




వేసి వుంచే సన్నివేశం కె.విశ్వనాథ్ దర్శకత్వ ప్రతిభకు నిదర్శనం. సాంబయ్య పాత్రలో చంద్రమోహన్ అటు రుద్రయ్యకు దాసుడిగా, హైమ వ్యక్తిత్వం, పరిస్థితి పట్ల గౌరవం, బాధ్యత కల వ్యక్తిగా చక్కగా నటించాడు. రుద్రయ్య పాత్రలో కైకాల సత్యనారాయణ నటన కూడా విశేషంగా వుంటుంది. ఎక్కువ నెగెటివ్ పాత్రలు వేసే ఆయన తండ్రి పాత్రలో అది పక్షపాతం సోకి అశక్తుడిగా నటించిన తీరు క్రొత్తగా వుంటుంది.

"సిరి సిరి మువ్వ" చిత్ర కథ ఎంత ప్రభావవంతంగా వుంటుందో ఈ చిత్ర సంగీతం కూడా అదే స్థాయిలో వుంటుంది. చిత్ర ప్రధాన బలం సంగీతం. డప్పు-ధ్వని- సంగీతం, మువ్వలు- నృత్యం ఈ సంబంధాన్ని దృష్టిలో ఉంచుకుని సంగీతం, సాహిత్యం, నృత్యం మూడింటి పరస్పర అనుసంధానంతో ఈ చిత్రాన్నే కాదు, ఆ తర్వాత కాలంలో రాబోయే చిత్రాల్లోనూ ముఖ్య భూమికను ఇవ్వబోతున్నాను అనే విషయాన్ని బహుశా ఆయన కూడా గుర్తించి వుండనంత యాదృచ్ఛికంగా ఈ చిత్రం ద్వారా ఒక సంకేతాన్ని ఇచ్చారని చెప్పొచ్చు. ఈ చిత్రంలో మొత్తం పది పాటలున్నాయి. చిత్రసంగీతం కె.వి. మహదేవన్ గారు అందించారు. నాటి నుండి నేటి దాకా ఈ చిత్ర గీతాలు ప్రజల కంఠాలలో తిష్ఠ వేసుకున్నాయనడంలో సంశయం లేదు.

**'అందానికె అందం ఈ పుత్తడి బొమ్మ- అందరికీ అందనిదీ పూచిన కొమ్మా'** ఈ పాటలో సాంబయ్య హైమకు వివాహం అయ్యాక ఆమెను సాగనంపుతున్నట్లు పాడే పాట. ఈ పాటలోనే **'పలకమన్న పలకదీ పంచదార చిలక'** అనే పదాలుంటాయి- ఇవి హైమ మూగతనాన్ని అలాగే తన అందమైన మోమును వర్ణిస్తాయి. ఇక కాలం ఏదైనా అందరికీ గుర్తుండే పాట - **'ఝుమ్మంది నాదం/ సయ్యంది పాదం/తనువూగింది ఈ వేళ/ చెలరేగింది ఒక రాసలీల'.** మయూరం పురి విప్పి నాట్యం ఆడినప్పుడు కనపడే పోలికలకు




తీసిపోని రీతిలో ఈ పాటను దృశ్యీకరణ చేశారు దర్శకుడు. ఇక హైమకు మోసగాడైన వ్యక్తితో వివాహం జరుగుతున్న సమయంలో ఆ వివాహాన్ని ఆపేందుకు సాంబయ్య ఆవేశంగా పాడే పాట **'కలడందురు దీనుల యెడ/ కలడందురు పరమయోగి గణములు పాలన్/కలడందురన్నిదిశలను / కలడుకలండనెడువాడు కలడో లేడో'** అనే పదాలతో మొదలయ్యే పాటలో ఆ తర్వాత ప్రధాన పల్లవిగా **'రా దిగిరా దివి నుంచి భువికి దిగిరా'** అంటూ సాగుతుంది. ఈ పాట జరుగుతున్న అన్యాయాన్ని ఆపడానికి ఆ దేవుడిని రమ్మంటున్నట్లుగా వుంటుంది. మరో పాట **'మా ఊరి దేవుడమ్మా / చల్లంగా మమ్మేలు రాముడమ్మా'** ఇదే పాటలో హరికథ రూపంలో వచ్చే కొన్ని పదాలు **'మహాప్రభో నీ మహిమ తెలియక మానవులెంతటి వారు'** అంటూ సాగుతూ దేవుడి పట్ల ప్రజలు ఎలాంటి నిర్లక్ష్యపూరిత ఆలోచనలో వున్నారనే విషయాన్ని తెలియజేస్తూ సాగుతుంది. మరొక ముఖ్యమైన పాట **'ఎవరికెవరు ఈ లోకంలో ఎవరికి ఎరుక/ఏ దారెటు పోతుందో ఎవరినీ అడగక'** అంటూ సాగే పాట మనిషి జీవన చిత్రాన్ని ఆవిష్కరిస్తుంది. కె.వి.మహదేవన్ గారి సంగీతం, పాటల్లోని సాహిత్యం చిత్రానికి ప్రధాన బలం. సాహిత్యాన్ని వేటూరి సుందర రామ్మూర్తి అందించారు. ఈ చిత్రానికి ఆయన జంధ్యాలతో పాటు మాటల రచయితగా కూడా పనిచేశారు. ఆయన ప్రస్థానంలో కేవలం ఈ ఒక్క చిత్రానికి మాత్రమే మాటల రచయితగా పనిచేయడం విశేషం.

మంచి సాంఘిక చిత్రాలను నిర్మిస్తూ వచ్చిన కళాతపస్వి ఈ చిత్రంతో సాంఘీక కథలను చెప్తూనే సంగీత, సాహిత్య, నృత్య ప్రధాన చిత్రాల వైపు తన ప్రయాణం ఎంత గొప్పగా సాగించదల్చుకున్నాడో చెప్పాడు. మంచి కథా బలమున్న చిత్రానికి సంగీత, సాహిత్య, నృత్యాలను జోడించి చిత్రం యొక్క స్థాయిని ఏవిధంగా పెంచవచ్చునేది కె.విశ్వనాథ్ గారికి మాత్రమే బలంగా తెల్సిన విద్య.

చిత్రం : **సిరి సిరి మువ్వ**
తారాగణం : **చంద్రమోహన్, జయప్రద, కైకాల సత్యనారాయణ, రమాప్రభ, అల్లు రామలింగయ్య, కవిత**
మాటలు : **జంధ్యాల, వేటూరి**
సంగీతం : **కె.వి.మహదేవన్**
నిర్మాత : **లచ్చిరెడ్డి కర్రి**
దర్శకత్వం : **కె. విశ్వనాథ్**

## ఇప్పుడతను లేడు

చెట్టంత ఎదిగి
చేతికి అందొచ్చిన ఇద్దరు పిల్లలను
చూసి మురిసిపోయేవాడు
రోజంతా
జెరాక్స్ షాపులో పనిచేసి
భుజాలు అరిగిపోతున్నా
ముఖంపైన చిరునవ్వుని
చెరిగిపోనివ్వలేదు
ఎప్పుడు చూసినా
అతనూ అతని సహచరి
ఇద్దరు పిల్లలతో
జెరాక్స్ షాపు
ఒక చైతన్య కార్యశాలలా
వెలుగొందిందే తప్ప
అలసట చెందింది లేదు
ఏ కష్టాల శిఖరం
అధిరోహించి
జయకేతనం ఎగరేశాడో గాని
అతనెప్పుడూ
ధైర్యం చెక్కుచెదిరినట్టు
కనిపించలేదు
శ్రమించటం
అతనే కాదు
అతని పిల్లలకూ నేర్పాడు
శ్రమపాఠాలను
చెమటబొట్టుల్లో చదివేవాడు
అతను అతని ఇద్దరు పిల్లలను
స్నేహితులుగానే
భావించాడు తప్ప
తండ్రిపాత్రలో
పెత్తనం కోరుకోలేదు
పిల్లలూ అంతే
అతణ్ణి నాన్న కన్నా ఎక్కువుగా
ప్రేమించారు
అభిమానించారు
బతుకు రహస్యమేదో
అతనికి తెలిసినట్టుంది
ఇరువైపులా
ప్రేమవంతెనను
మహా నైపుణ్యంతో అల్లి
కొండంత ఎత్తులో నిలిపాడు
అతను అతని పిల్లలు
అతని సహచరి
సమూహ చేతనత్వానికి ప్రతీక
ఇప్పుడతను లేడు
అతనెక్కడున్నాడని
భ్రమల
అచేతనత్వంలో
ఎక్కడెక్కడో వెతకాల్సిన
అవసరం లేదు
అతను అతని పిల్లల్లో
ప్రతిబింబిస్తున్నాడని
వేరే చెప్పాల్సిన పని లేదు
ఇప్పుడతను లేకపోయినా
ఇప్పుడతను వున్నాడు

**బాల సుధాకర్ మౌళి**
**కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత**
**ఫోన్ : 9505 656 046**

కీ.శే. బి.ఎన్.శాస్త్రి

# శాసనములలో తెలుగు భాషా పరిణామము

అముద్రిత సిద్ధాంత గ్రంథం

## 11వ అధ్యాయం
## శాసనములలోని ఛందస్సు

ఆంధ్రభాషలో ఛందశ్శాస్త్రమునకు సంబంధించిన గ్రంథములు ఆంధ్ర కవిత్వమావిర్భవించిన పిదప, నెంతో కాలమునకు వెలువడినవి. ఆంధ్రభాషలో తొలుత వ్రాయబడిన కావ్యము మహాభారతము. తెలుగు కవిత నన్నయగారికి పూర్వమే ఆంధ్రదేశమున వ్యాపించి యుండెనని చెప్పవచ్చును. నన్నయగారికి పూర్వము తెలుగు కథలు లేవా? గ్రంథములు రచింపలేదా? తెలుగు కవిత నాదరించు రాజులు లేకుండిరా? తెలుగు కవిత జనసామాన్యమునకే పరిమితమై యుండెనా? ఈ ప్రశ్నముల సమాధానమఱసిన, కవులుండిరనియు, గ్రంథములు వ్రాసిరనియు, నేడవి మనకు లభింపని కారణమున నన్నయ ఆదికవియని మహాభారతము తొలి గ్రంథమనియు తలచుచున్నామని తెలును.

నన్నయగారికి పూర్వపు శాసనములు కొన్ని ఛందస్సుతో కూడినవిగా కనిపించుచున్నవి. క్రీ.శ. ఆఱవ శతాబ్దినుండియు మనకు తెలుగు శాసనములు లభించుచున్నవి. అవి రేనాటి చోళుల శాసనములు. రేనాటిచోళుల శాసనములు క్రీ.శ. ఆఱవ శతాబ్ది ఉత్తరార్ధమునుండి విలసిల్లుచున్నవని తెలియుచున్నవి.

రేనాటిచోళుల శాసనములలో మొట్టమొదటి శాసనము ధనంజయుని కలమళ్ళ శాసనము. ఈ శాసనకాలము క్రీ.శ. 575. తూర్పు చాళుక్యుల శాసనములు సైతము తెలుగులో వ్రాయబడినవి. అందు కొన్ని గద్యమయములు. కొన్ని గద్య పద్య మిశ్రమములు. క్రీ.శ. తొమ్మిదవ శతాబ్ది వరకున్నవి గద్యమయములు. క్రమముగా నీ శాసనములందు తరువోజ, సీసము, మధ్యాక్కర మున్నగు దేశి రచనలు కనపడుచున్నవి. నన్నయకు పూర్వము తెలుగు కవిత వ్యాప్తియందుండెనని ఈ శాసనములను బట్టి చెప్పవచ్చును.

నన్నెచోడుడు తన కుమారసంభవ కావ్యమున మార్గ దేశీ కవిత్వములు వేరు వేరని చెప్పినాడు.

**"మును మార్గ కవిత లోకం**
**బున వెలయగ దేశికవితపుట్టించి తెనుం**
**గును నిలిపిరంధ్ర విషయం**
**బున జన జాళుక్యరాజు మొదలగు పలువుర్"**

ద్విపద, రగడ, అక్కర, సీసము, తరువోజాది పద్యములతో స్థానిక ప్రాధాన్యము కల్గిన కవిత్వము దేశీ విధానమునకు సంబంధించినది. క్రీ.శ. పదియవ శతాబ్దికి పూర్వము వెలువడిన శాసనములందలి పద్యములు దేశి రచనలు అద్దంకి, కందుకూరు, బెజవాడ శిలాశాసనములలోని పద్యములు ముఖ్యమైనవి. ఈ శాసనములందు పదవాఙ్మయము కూడా నున్నది.

పదియవ శతాబ్ద్యనంతరము వెలువడిన గూడూరు శాసనము, కాకతీయుల కాలపు శాసనములు మార్గ కవితననుసరించి వ్రాయబడినవి. పదియవ శతాబ్దికి పూర్వమాంధ్రదేశమున దేశి కవిత్వము వాడుకలో నుండెను. అటుపిమ్మట, దేశి మార్గ కవిత్వములు వాడుకలోనికి వచ్చినవి.

**వృత్తములు :** అక్షర గణయుతములు, సంస్కృతమునుండి వచ్చినవి.

**జాతులు :** 1. సంస్కృత జాతులు

2. దేశి కవితకు సంబంధించిన జాతులు.

సంస్కృత జాతులు మాత్రా సంఖ్యా నియమములు. ఇందు నాలుగు పాదములుండును. దేశ్య జాతులు మాత్రాగణ బద్ధములైన పాదములు కలిగియుండును. సంస్కృత వృత్తములను బట్టి వీనికి పాదసంఖ్యా నియమము కల్గినను తొలుత ఆ నియమము లేకుండెను.

**దేశ్యజాతులు రెండు విధములు.**

1. జాతులు 2. ఉపజాతులు.

జాతులలో యతి ప్రాస నియమములుండును. ఉపజాతులందు యతి నియమముండును. ప్రాసయనగా పాదద్వితీయాక్షరము.

జాతులందు ఒకటవ పాదాద్యక్షరము, గురు లఘువులలో నేదియైనను మూడవ పాదాద్యక్షరమట్లే యుండవలెను. గురు లఘువులు సమముగా నున్నను గణములు మారవచ్చును. ఉదా : మొదటిపాదము యొక్క మొదటి గణము సగణమైన యెడల రెండవ పాదాది గణము నలముండవచ్చును.

ఉపజాతులందు నాలుగు పాదములుండును. పాదాద్యక్షరమున యధా సంభవమైన మార్పునందవచ్చును.

ద్రావిడ భాషలందు వృత్తము, జాతులు మున్నగు వాటికి ప్రాస నియమముంటుంది. నాలుగు పాదాములలోను పాద ద్వితీయాక్షరముల సమానమైనదిగా నుండవలెను. సీస గీత పద్యములందా నియమము లేదు. యతికి బదులుగా ప్రాసయతి రావచ్చును.

కన్నడ భాషలోని గీతికలో ప్రాస నియమమున్నది. వృత్తము

లందును జాతులందును యతి నియమము లేదు.

తమిళ భాషయందు కొన్ని పద్యములందు యతి ఐచ్ఛికముగా నున్నది. ఇది సంస్కృత ప్రాకృత సంప్రదాయ సంబంధము కాదు. ఆంధ్రభాషలో వడి నియమము అనునది అన్య ద్రావిడ భాషలలో లేని ప్రత్యేకత. ప్రాసతో పాటు పాదాద్యక్షరము కాని, మిత్రాక్షరము గాని, యతిస్థానమున పునరావృతి కావలెనను నియమము తెలుగుభాష యందున్నది.

తెలుగు కన్నడ భాషలలో సమానమైన అక్కరలకు గూడ కన్నడులీ నియమము పాటింపలేదు. కన్నడాంధ్రములందు దేశీ ఛందస్సు విభేదము కాన్పించుచున్నది. ద్రావిడ భాషలకు ప్రావళ్లు చాలా ముఖ్యమైనవి. ఈ ప్రావళ్ళ వలన తెలుగు భాషకొక విధమైన శోభ కల్గినదని చెప్పవచ్చును. ఈ ప్రావళ్ళ విషయమున సమాన జాతులకు సంస్కృతాంధ్ర భాషలలో భేదమెంతేనియు కలదు.

**సంస్కృతము** : జాతులలో మాత్రల సంఖ్యలో పాదమేర్పడును. అనగా పాదమునకిన్ని మాత్రలుండవలెనను నియమము కలదు

**తెలుగు :** మాత్రా గణములో పాదములేర్పడును. పాదమునకిన్ని ఇంద్ర గణములు, ఇన్ని సూర్యగణములని చెప్పబడును.

ఇంద్ర చంద్ర సూర్య గణములు మాత్రాఘటితములైనను ఇవి సమానమాత్రా సంఖ్య కలిగియుండవు. సూర్య గణములగు గల, నగణము లందు మాత్రలు సమానము.

# మూసీ పదవినోదం - 31

## సమాధానాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 బా | 3 ల | గం | 8 గా | 5 ధ | ర | తి | లక్ |
| 2 ర | స | కం | దా | య | ము | X | 7 రఘ |
| 4 సా | మా | X | 6 స్తో | న | X | 20 ము | X |
| ల | 9 న | X | హ | X | 17 వే | ర | 21 మి |
| X | 10 ము | 11 ఖ | మం | డ | పం | X | ష |
| 13 కా | X | 12 ని | టే | ల | పు | 19 క | త |
| 14 క | 15 ల | జ | X | 18 స | చే | త | న |
| 16 ర | త | ము | లు | X | 22 యు | వ | X |

గీతపద్యమునందొక సూర్య గణము, రెండింద్ర గణములు, రెండు సూర్యగణములు వరుసగా నుండును. మాత్రలు ప్రతిపాదమున సుమారు 17 నుండి 19 వరకుండవచ్చును. సీసపద్యమునందు పాదమునకు 30 నుండి 36 వరకు మాత్రలుండును. ఇన్ని మాత్రలుండవలెనను నియమము మాత్రము లేదు. ఇంద్రగణములలో సమానమాత్రా గణములు కలవి లేకపోవుటయే దీనికి కారణము. సంస్కృతాంధ్ర భాషలలోని జాతులు మాత్రాఘటితములైనను వాని లక్షణములలో భేదము కనిపించును.

**సంస్కృతము**

జాతి పాదములు మాత్రా సంఖ్యానిబద్ధములు

మాత్రా సంఖ్య నిర్దేశము

**తెలుగు**

జాతి పాదములు మాత్రాగణ నిబద్ధములు

మాత్రాగణ నిర్దేశము.

గణబద్ధములగు పద్యపాదములున్న శాసనములు రేనాటి చోళుల కాలమున వెలసినవి. అట్టివానిని వృత్తగంధి లేక పద్యగంధి యని యందురు. రేనాటి చోళుల శాసనములందు వృత్తగంధి పాదములు గల గద్యములెన్నియో యున్నవి. కొన్ని పాదములు తాళబద్ధములు గను, మరికొన్ని పాడుటకు వీలుగానున్నట్టివియు, రేనాటి చోళుల శాసనములందున్నవి. ఈ శాసనములు వెలిసిన కాలము నాటికే తెలుగు కవిత వృద్ధిజెందు స్థితికి వచ్చినదని చెప్పవచ్చు.

**మాత్రాఛందస్సు**


ఒకానొక అనుభూతిని పొదినప్పుడు కవులు రచించిన పద్యములు, పాటలు, లయాన్వితములై మనోజ్ఞముగా నుండును. భాషను బట్టి లయలేర్పడును. ఆంగ్లభాషలో ఊత ననుసరించి పద్యముల నడక సాగును. వైదికభాషలో స్వరము యొక్క ఉచ్చ, నీచ సమానత్వములను అక్షర సంఖ్యను బట్టి భేదములు కల్గును. సంస్కృత పద్యపాదములు అక్షర గణ సంఖ్యాయుతములు. హ్రస్వ దీర్ఘ నియమముండును. ద్రావిడ భాషా కుటుంబములందు మాత్రాగణ నిబద్ధమైన పాదములున్నను హ్రస్వ దీర్ఘ నియమమున్నట్లు తోచదు. ప్రాకృతమున మాత్రాసంఖ్యననుసరించి పాదములు, పద్యములేర్పడును. ఊత, అక్షర సంఖ్య మాత్రాసంఖ్య, అక్షరగణ సంఖ్య. మాత్రాగణసంఖ్య ననుసరించి పద్యములేర్పడును.

.... సశేషం

# అస్తిత్వ పతాకలు – 'లొట్టపీసు పూలు' కథలు

**డా. తండు కృష్ణ కౌండిన్య,** సహాయ ఆచార్యులు, నాగార్జున ప్రభుత్వ కళాశాల, నల్లగొండ, ఫోన్ : 9704 731346

**కథాప్రస్తావన :** ఆధునిక వచన రచనా ప్రక్రియలో కథానిక ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది. కథానిక, చిన్న కథ, కథ అనీ నేడు వ్యవహారంలో ఉంది. తెలుగు సాహిత్యంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలుగొంది దిన దిన ప్రవర్ధమానమవుతున్న సాహిత్య ప్రక్రియ కథానిక. 'కావ్యేషు నాటకం రమ్యం' అన్నారు ఆలంకారికులు. కానీ ప్రస్తుత సమకాలీన సాహితీ ప్రక్రియల్ని చూస్తే 'కావ్యేషు కథా రమ్యం' అని అనక తప్పదు. తెలుగు సాహిత్యంలో కథ ఒక విశిష్ట స్థానాన్ని ఆక్రమించింది. బండారు అచ్చమాంబ మొదలు ఎందరో రచయితలు కథలను రాసి కథాసాహిత్యాన్ని పరిపుష్టం గావించారు. ఈ నేలలో చాలామంది రచయితలు అస్తిత్వ స్పృహతో కథలను రాశారు, రాస్తున్నారు. కాలానుగుణంగా వచ్చిన ఆయా ఉద్యమాలకు స్పందించి కథలు రాసిన వారు కూడా ఉన్నారు. జాతీయోద్యమం, తెలంగాణ సాయుధ పోరాటం మొదలు దళితవాదం, స్త్రీవాదం, బిసి వాదం, ముస్లిం మైనార్టీ వాదం ఉద్యమాలకు సంబంధించి అనేక కథలు వస్తున్నాయి. ఈ పరంపరలో తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యంతో పాటు అట్టడుగు వర్గాల జీవితాన్ని ప్రతిబింబింపజేస్తూ శీలం భద్రయ్య కథలను రాస్తున్నాడు. ఈయన రాసిన తాజా కథా సంపుటియే **'లొట్టపీసు పూలు'.**




**నామౌచిత్యం :** "లొట్టపీసు పూలు" అను శీర్షికయే అద్భుతంగా ఉంది. నిరాదరణకు గురవుతున్న పూలకు కావ్య గౌరవాన్ని కల్పించడం ఎంతో సమంజసంగా ఉంది. అస్తిత్వ ఉద్యమాల ప్రభావంతో ఇలాంటి రచనలు చేసిన కవులు, రచయితలు ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో చాలామంది ఉన్నారు. వారిలో దాశరథి రంగాచార్య రాసిన 'మోదుగు పూలు'నవల, ఆచార్య ఎన్. గోపి రాసిన 'తంగేడు పూలు' కవితా సంపుటి ఎంతో సుప్రసిద్ధమైనవి. మట్టి పరిమళాలతో కూడిన సహజ సౌందర్యానికి ప్రతీకగా ప్రకృతిలో లభించేవి మోదుగు పూలు, తంగేడు పూలు, లొట్టపీసుపూలు. ఇవి నిరాడంబరత్వమునకు నిలువెత్తు నిదర్శనం. శీలం భద్రయ్య తాను రాసిన కథాసంపుటికి 'లొట్టపీసుపూలు' అని పేరు పెట్టడంలోనే మట్టి బతుకుల వెతలను, కథావస్తువులుగా స్వీకరించాడన్న విషయం అర్థమవుతుంది. ఆధిపత్యవర్గాలవారిచే అట్టడుగు వర్గాల వారు ఏవిధంగా పీడింపబడుతున్నారో, ఎలా చులకనగావింపబడుతున్నారో ఈ కథల ద్వారా మనకు తెలుస్తుంది. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో జరిగిన దొరల దోపిడీ పీడనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం ప్రధాన వస్తువుగా చేసుకొని రాయబడిన కథలు ఇందులో ఆరున్నాయి. అట్టడుగున పడి కనిపించని ఎన్నో సత్యాలను వెలికితీసి ప్రపంచానికి చాటిచెప్పడమే రచయిత పరమోద్దేశం. కావున సమాజంలో నిరాదరణకు గురి కాబడ్డ వ్యక్తుల జీవితాలను తలకెత్తుకుని, వాటిని తన కథల్లో వస్తువుగా చేసుకొని ఆసక్తిగా చెప్పడం జరిగింది. కల్మషం లేని వివక్షకు గురైన జీవితాలకు ప్రతీకగా 'లొట్టపీసు పూలను' స్వీకరించడం జరిగింది.

**ఇతివృత్తం :** ఈ కథాసంపుటిలో మొత్తం 15 కథలు ఉన్నాయి. 'ఇసపురుగు' మొదటి కథ. 'శూర్పణఖ' చివరి కథ. ఇందులోని ఆరు కథలు ప్రపంచ చరిత్రలోనే మహోన్నత స్థానాన్ని సంపాదించు కున్న తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధించినవి. సాయుధ పోరాట కాలంలో ఎందరో కవులు, రచయితలు తమ రచనల ద్వారా ప్రజలను చైతన్యపరిచి ఉద్యమంలో పాల్గొనేటట్లు చేశారు. 'మావూళ్ళో కూడానా' కథ రాసిన కాంచనపల్లి చినవెంకట రామారావు, 'ఊరేగింపులు' కథ రాసిన ఆవుల పిచ్చయ్య, 'జైలు లోపల' కథ రాసిన వట్టికోట ఆళ్వారుస్వామి మొదలగువారి రచనలు తెలంగాణ సాయుధ పోరాటానికి అద్దం పడుతాయి. 'బాంచన్ దొరా కాల్మొక్త' అన్న బడుగు జీవులే బంధూకులను చేతబట్టి వీరోచిత పోరాటం చేసిన చారిత్రక ఘట్టాలను భద్రయ్య కూడా కథలుగా మలిచి ఆద్యంతం పాఠకులను ఉత్కంఠతో చదివేట్టుగా రాశాడు.

**'ఇసపురుగు'** కథలో నర్సమ్మ భర్త సైదులు బతుకు తెరువు కోసం మస్కట్కు వెళ్లి దొంగతనం నేరం మీద జైలుకెళ్తాడు. తన భర్తను జైలు నుంచి విడిపించడానికి నర్సమ్మ అప్పుకోసం నారాయణ పటేల్ దగ్గరికి వెళ్తుంది. ఆమె మీద కన్నుబడ్డ

నారాయణ పటేల్ సాయంత్రం బాయికాడికి వస్తే అప్పు ఇస్తానని చెప్తాడు. నాటువైద్యం తెలిసిన పెద్దయ్య సాయంతో నరసమ్మ ఆ గండం నుండి గట్టెక్కుతుంది. విషపురుగు వంటి నారాయణ పటేల్‌కు విషముష్టి చెట్టు వేరును ఉపాయంతో విరుగుడుగా ఇవ్వడంతో నారాయణ పటేల్ పీడ నర్సమ్మతో బాటు ఆ ఊరి ఆడబిడ్డలకు తొలగిపోతుంది. నారాయణ పటేల్ వంటి చీడపురుగులు సమాజంలో అక్కడక్కడా ఉన్నారని ఈ కథ ద్వారా తెలియజేశాడు.

**'కేంపుచెర్వు'** కథలో, కొత్తగా కట్టే మూసీ జలాశయం కొరకు ప్రజలందరూ ఊరిని ఖాళీ చేయాలని దొర హుకుం జారీ చేయడం, ఆ వెంటనే మోసపూరితంగా వారందరి దగ్గరా తెల్ల కాయితం మీద సంతకాలు తీసుకొంటాడు. వాళ్ల భూములకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారాన్ని కాజేయాలని దొర ప్రణాళిక వేయడం జరుగుతుంది. ప్రజాపోరాటాల్లో అజ్ఞాతంగా ఉన్న శివుడు ఆ విషయం తెలిసి, ఊరందరిని కూడగట్టి వారికి చైతన్యం కలిగిస్తాడు. నిజం గ్రహించిన ఊరిజనం దొర మీద తిరుగుబాటు చేయడంతో, దొర భయంతో పట్నం పారిపోవడంతో కథ ముగుస్తుంది. మూసీ ప్రాజెక్టు గర్భంలో తరాల జ్ఞాపకాలతో పాటు బానిసత్వాన్ని కూడా దాచుకున్న "కేంపు చెరువు(మూసీ జలాశయం)" నిర్మాణవృత్తాంతాన్ని ఈ కథలో చెప్పాడు. ఈ కథ ఒక అభ్యుదయ కథా నిర్మాణానికి ఉదాహరణగా నిలుస్తుంది. మూసీ జలాశయాన్ని ఇప్పటికీ ఆ పరిసర ప్రాంతాల్లో 'కేంపు చెర్వు' అని పిలవడం పరిపాటి.

**లొట్టపీసు పూలు** కథలో బతుకమ్మ, బొడ్డెమ్మ పండుగల సందర్భాల్లో గ్రామీణ వాతావరణం ఎలా ఉంటుందో సవివరంగా తెలియజేశాడు. ఈ పండుగల సమయంలోనే ఊరి పెద్దమనిషి ఎల్లయ్య పంతులు హత్యకు గురికావడం, ఆ హత్యా నేరాన్ని అమాయకుడు శివుని మీద వేయడం, దాంతో అతడు కటకటాల పాలవుతాడు. శివుడు అమాయకుడు. కాని నిజంగా హత్య చేసిన పాపయ్య పాపాన్ని "లొట్టపీసు పూలే" బయటపెట్టినవి. శివుడి జీవనానికి ఉపయోగపడే "లొట్టపీసు చెట్లు" , బతుకమ్మను పేర్చడానికి పనికిరాని **'లొట్టపీసు పూలు',** ఆ ఊరిపెద్ద హత్యవెనుక ఉన్న అతి రహస్యాన్ని బయటపెట్టి నిర్దోషిని రక్షించి, దోషికి శిక్ష పడేటట్లు చేసినవని చెప్పడంలోనే ఒక అద్భుతమైన సందేశం దాగి ఉంది. ఆధిపత్య వర్గాల వారి దృష్టిలో ఏమాత్రం పనికిరాని వారుగా, అనామకులుగా భావింపబడుతున్న అట్టడుగు వర్గాల వారే సమాజాభివృద్ధికి వెన్నుదన్నుగా నిలిచారన్న విషయం ఈ కథ ద్వారా భద్రయ్య తెలియజేశాడు. దేశభక్తి ప్రబోధాత్మకమైన కథ **'వెలుగు చుక్క'.** ఈనాడు డాలర్ల వ్యామోహంలో విదేశీ ఉద్యోగాల కోసం ఎగబడుతున్న యువతకు ఒక చక్కని సందేశాన్ని అందించే కథ ఇది. ఈ కథలో మేజర్ కిరణ్ దేశ రక్షణలో భాగంగా సర్జికల్ స్ట్రైక్ తో శత్రువుల ఆట కట్టించి, మానవత్వంతో ఆపద నుండి బాలుడిని, ఆయుధాలను కాపాడి ఉన్నతాధికారులతో భేష్ అనిపించుకుంటాడు. ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగ అవకాశాలున్నా తండ్రికున్న దేశభక్తితో తండ్రి మాట జవదాటని సైనికుడిగా దేశ రక్షణకు తన వంతు పాత్ర పోషిస్తాడు కిరణ్. చెడు ఎప్పుడూ మంచికి శత్రువైతది. చివరికి మంచే నిలబడుతుందన్న సందేశాన్ని ఈ కథ ద్వారా రచయిత చెప్పిన విధానం బాగుంది.

**'టముకు'** కథ చిరుతల రామాయణం కళారూపం ప్రదర్శన వైవిధ్యాన్ని మన కళ్ళ ముందు ఉంచుతుంది. బుచ్చయ్య పంతులు చిరుతల రామాయణంలో తన జీవితకాలంలో ప్రదర్శన చేయలేని అసాధ్యమైన ప్రదర్శన శిష్యుడు సర్వయ్య సాధించడం జరుగుతుంది. ఈ క్రమంలో స్నేహితుని రహస్యాన్ని దాచి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న సర్వయ్య, చివరికి సొంత ఊరిని వదిలిపెట్టి అటుపై ఊర్లు మారాల్సి రావడం జరుగుతుంది. గురువుకుదగ్గ శిష్యుడుగా సర్వడు ఎదగడం ఇందులోని ప్రధాన వస్తువు.

రజాకార్ల అరాచకాలను తెలియజేసే కథ **'కోదండం'**. దోపిడీలు, హత్యలు, మానభంగాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే రజాకార్లను దళనాయకుడు అంజయ్య జనాన్ని చైతన్యపరిచి, రజాకార్ల తుపాకులకు ఎదురొడ్డి వారిని తరిమేసి చింతలగూడెంకు స్వాతంత్ర్యాన్ని తెచ్చి పెట్టడం ఈ కథలోని ప్రధానాంశం.

గడీల పాలనలో దొరతనం గడీలకు బందీ అయిన నేపథ్యాన్ని **'కొత్తదొర'**లో చెప్పాడు. మూఢనమ్మకాలను పూర్తిగా తూర్పారబట్టిన కథ **'లత్త'.** లింగమ్మ నుదుట ఎగనాకుడు ఉండడం వల్ల లత్త (దరిద్రం) కొడుతుందని, ఆమెను ఎవరు పెళ్ళాడడానికి ముందుకు రాకపోగా చివరికి తనకన్నా వయసులో ఎంతో పెద్దవాడైన వ్యక్తికి మూడో సంబంధంగా పెళ్లి చేసుకుంటుంది. ఎగనాకుడు ఉన్నంత మాత్రాన ఎలాంటి అరిష్టం కలగదన్న విషయాన్ని ఈ కథ ద్వారా తెలియజేశాడు. ఇప్పటికీ గ్రామాల్లో ఈ దురాచారం అక్కడక్కడా ఇంకా కనబడుతుంది. సాయుధ పోరాటకాలంలో రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన సంఘం సభ్యులుగా ఉన్న కుటుంబాన్ని రజాకార్లు చిత్రహింసలకు గురిచేయడం, చివరికి వారు మాతృభూమికి చెల్లించిన విధానం మాయబారి కథలో ఉంటుంది. పరువు హత్యలకు బయోస్కోపులో చెప్పబడిన కథ **'ఖూని'.** కులాలు, మతాల అడ్డుగోడలను కూల్చలేక, తమ ప్రేమను మరచిపోలేక ఎంతోమంది యువత ఎలా బలైపోతున్నారు. కులాల పట్టింపు, ప్రేమికుల ప్రేమ వ్యవహారంలో అమాయకుడైన ప్రణయ్ అనే యువకుడు కులం కారణంగా బలి కావడం ఈ కథలో ప్రధాన వస్తువు. ఈకథలో ఉత్కంఠ ప్రశంసనీయంగా ఉంటుంది. కరోనా నేపథ్యంలో రాయబడ్డ కథ **'అగ్గువ బతుకులు'.** బతుకుదెరువు కోసం పట్నం పోయిన రాములు దంపతులు లాక్‌డౌన్ వల్ల ఉపాధిని కోల్పోవడం, సరైన రవాణావసతులు లేని ఆసమయంలో ప్రసవానికి

భార్యను ఇంటికి తీసుకొస్తూ ఆ దంపతులు ప్రమాదవశాత్తు మరణించడం, కనీసం ఆ దంపతుల అంతిమ సంస్కారాలకు గ్రామంలో ఎవరూ రాకపోవడం కరోనా కల్లోల పరిస్థితులను కళ్ళకు కట్టినట్లుగా రచయిత చూపించాడు. పురాణ పాత్రలతో పోలిక చేస్తూ ఆధునిక సామాజిక సమస్యను కొత్త ప్రయోగం చేస్తూ రాసిన కథ **'శూర్పణఖ'.**

ఈ విధంగా లొట్టపీసు పూలు కథా సంపుటిలోని కథలన్నీ కూడా నిజాం నిరంకుశ పాలన, దొరల దౌర్జన్యాలు, రజాకార్ల దురాగతాలు, ప్రజల తిరుగుబాట్లను చెప్పడమే కాకుండా అట్టడుగు వర్గాల ప్రజల బ్రతుకులను, రాజకీయ, సాంఘిక పరిణామాలను, దోపిడీకి గురైనటువంటి వారి వేదనను, నాటి సాంస్కృతిక జీవనవైభవాన్ని కళ్ళకు కట్టినట్టు ఈ కథల ద్వారా చెప్పడం జరిగింది.

**సమున్నత కథా లక్షణాలు :** శీలం భద్రయ్య రాసిన కథలన్నీ ఒక కథకు ఉండవలసిన లక్షణాలను పరిపూర్ణంగా కలిగి ఉండి, ఉత్తమ కథలుగా గుర్తింపు పొందాయి. కథానిక లక్షణాలైన సంక్షిప్తత, ఏకాంశ వ్యగ్రత, నిర్భరత, స్వయం సమగ్రత, ప్రతిపాద్యప్రవణత, సంవాదచాతుర్యం వంటి లక్షణాలు ఈ కథలో ఉండడం వల్ల కథలకు మరింత పరిపుష్టి చేకూరింది. సంక్షిప్తంగా ఉండడం కథానిక ప్రధాన లక్షణం. వస్తువులోనూ, సంఘటనలోనూ, పాత్రల్లోనూ, సంవాదాల్లోనూ విస్తృతి లేకుండా సాధ్యమైనంత తక్కువగా కథను తీర్చిదిద్దే నేర్పు, ఓర్పు శీలం భద్రయ్యకు పుష్కలంగా ఉంది. పాఠకులకు విసుగు కలిగించకుండా, సంక్షిప్తంగా కథను ముగించడంలో రచయిత అందెవేసిన చేయి. తెలివైన పాఠకుడిని గౌరవించి ముగింపు ఇస్తాడు. ఆలోచన రేకెత్తించడం ద్వారా కథ పాఠకులను చాలా కాలంపాటు వెంటాడుతుంది. రెండవ లక్షణమైన 'ఏకాంశ వ్యగ్రత' అనగా వస్తువైకృత. కథకుడు ఏ విషయం మీద ప్రధానంగా దృష్టి పెడతాడో అదే విషయాన్ని ముగింపు వరకు తీసుకొని వెళ్ళగలిగేలక్షణం భద్రయ్య కథల్లో కనబడుతుంది. కథను చదివేటప్పుడు రెప్పపాటు కానీ, రాసేటప్పుడు మనసుకు ఏమరుపాటు కానీ, లేనటువంటి ఈ లక్షణమే **'నిర్భరత'**. ముఖ్యంగా పాఠకునికి విసుగు కలిగించకుండా హాయిగా చదివించే నేర్పు భద్రయ్య కథా నిర్మాణంలో భాగమే. నాలుగో లక్షణమైన **'స్వయం సమగ్రత'** అనగా కథలోని వస్తువు దేనికదే సమగ్రంగా ఉండాలి. అవసరమైనటువంటిది కొరవడి, అనవసరమైనది ఎక్కువగా చెప్పినట్లు ఉండకూడదు. కథానిక పరిమాణంలో నవల కన్నా చిన్నదై దాని స్వయం సమగ్రతకు దోహదపడే విధంగా ఉండే లక్షణం శీలం భద్రయ్య కథల్లో కనబడుతుంది. ఐదవ లక్షణమైన **'ప్రతిపాద్య ప్రవణత'.** తాను తెలుసుకున్న అంశాన్ని దృష్టిలో పెట్టుకొని దాని వికాసానికి అనుగుణంగా రచన సాగించే నేర్పరి భద్రయ్య. ఇక చివరి లక్షణమైన **'సంవాద చాతుర్యం'** సంభాషణ రూపంలో సాగే వాక్యాలు ఒకానొక ప్రధానమైన అంశాన్ని ఆవిష్కరించేటట్లుగా, ఒక పాత్ర వ్యక్తిత్వాన్ని ప్రదర్శించేటట్లుగా ఉండాలి. ప్రతి సంభాషణ కథకు ప్రయోజనం కలిగించే విధంగా ఉండాలి. ఈ ప్రతిభ ఈ కథల్లో స్పష్టంగా కనబడుతుంది. ఇలా ఒక కథకు ఉండవలసిన లక్షణాలన్నీ భద్రయ్య కథల్లో ఉండడంవల్ల వాటికి మరింత పరిపుష్టి కలిగిందని చెప్పవచ్చు.

**కథాకథనం :** 'కథంటే కథన రూపంలో చెప్పబడే చిన్న నాటకం' అంటాడు హెన్రీథామస్. కథను ప్రారంభించే విధానంతో పాటు సంభాషణలతో కూడి, ఆద్యంతం పాఠకులకు ఆసక్తిని కలిగించే విధంగా కథను కొనసాగిస్తూ చక్కని ముగింపును కలిగియున్నప్పుడే ఆ కథ మరింత ఆదరణ పొందుతుంది. శీలం భద్రయ్య రాసిన కథల్లో ఒక ప్రత్యేకత కనబడుతుంది. అదేమిటంటే కథా ప్రారంభంలో చెప్పవలసిన విషయాన్ని ఎక్కడో మధ్యలో చెప్పి, మధ్యలో జరిగే కథను ప్రారంభంలో చెప్పి, ఆద్యంతం పాఠకులకు ఉత్కంఠతను రేకెత్తించే విధంగా కథను నడిపించడం. ఉదాహరణకు 'ఇసపురుగు' కథలో, కథమధ్యలో చెప్పాల్సిన విషయాన్ని ప్రారంభంలోకి తీసుకు వచ్చి, ఇలా రచనను ప్రారంభిస్తాడు. **'పొద్దుగూకాల నుంచి కుండపోతగా ఇద్వని ఆన కురుస్తుంది. అద్దరాత్రి. వానకు తెరిపి లేదు. నర్సమ్మ పసిబిడ్డను ఎత్తుకుని, దబ్బదబ్బ ఇంట్ల నుండి బయటికి నడిసింది. బిడ్డ తడవకుండా నెత్తినకొప్పెరపెట్టింది. ఒళ్ళు తడుస్తున్నా లెక్కజేయక, వడిగా అడుగులేసుకుంట దవాఖానకు బయల్దేరింది.'** (పుట సంఖ్య-01) ఇలా ఆరంభంలోనే పాఠకులకు కథ పట్ల ఆసక్తి కలిగి, విషయాన్ని తెలుసుకోవాలన్న కుతూహలంతో కథను చదవడానికి పూనుకుంటారు. కథా ప్రారంభం ఎంత ఆలోచనాత్మకంగా ఉంటుందో ముగింపు కూడా అంతే ఆలోచనాత్మకంగా, సందేశాత్మకంగా ఉంటుంది. మచ్చుకు 'అగ్గువ బతుకులు' కథలో ముగింపు ఇలా ఉంటుంది – **'గుంజకున్న మేక గంగవ్వ మదిగుంజుతుంది. పల్లుతెంపుకుంది. పిలగాడి ఆకలి తీర్చింది. చాలాసేపటికి లింగమ్మ కండ్లల్ల నిండిన నీళ్లు ఇంకినై. ఇంటి ముంగలరాములు, రాములమ్మలు పాశిపీనిగలయింగ్రు. కరోనా భయం ఊరి జనాల మానవత్వాన్ని మింగింది. లింగమ్మ ఆశను, పసిగుడ్డు తల్లిదండ్రుల ఊరి చెరువు మింగింది. గుంజకు కట్టేసిన మేక గంగవ్వ ఒక్కటే కన్నీరు పెడుతుంది. చెరువుల పద్ద ఆటో అనాథయ్యింది.'** (పుట సంఖ్య-89). కథ మరింత రక్తికట్టించడం కోసం కాల్పనికతను చేర్చడం కూడా రచనా నైపుణ్యంలో ముఖ్య భాగమే. **'కథకి గొప్పతనం కల్పించాలంటే కథ చిత్రించే జీవితం, భూమి నుంచి పైకి లేవాలి'** అంటాడు చలం. ఈ కథల్లో కూడా శీలం భద్రయ్య వాస్తవికతకు కొంత పైకి కథను నడిపించి పాఠకుల హృదయాలను తనవైపు తిప్పుకోవడంలో సఫలీకృతులయ్యాడు.

**భాషా ప్రయోగం :** ఇందులో రెండుకథలు మినహా మిగతా కథలన్నీ అచ్చమైన తెలంగాణ జీవద్భాషలో రాయబడ్డాయి. ఈ

కథలన్నీ చదివినప్పుడు నిఘంటువుల్లో కూడా చేరని సజీవ పదాలు వీటిలో కనబడతాయి. కతువ, తక్కు, తమసం, ఇగి, మంగులం, పుర్రచేయి లాంటి పదాలను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. చక్కని వస్తువుతో పాటు శిల్పం కూడా ఈ కథల్లో ఉండి వాటికి మరింత పరిపుష్టిని కలిగించడం జరిగింది. సామాన్యం ప్రజలు మాట్లాడే భాషలోనే ఈ కథలు రాయబడ్డాయి. ఉదాహరణకు – రామలింగానిది నల్గొండ జిల్లా వల్లాల పక్కన జాలవారిగూడెం. అమ్మకు సొమ్ములు లేకున్నా అయ్యకు సొమ్మ ఉంది. అది చిన్నతనాన అయ్యను కాటికి తోలుకబోయింది. అమ్మ కూలినాలికి పోయి సదివిస్తే తొమ్మిదిదాంక సదివిండు. ఆ తర్వాత అమ్మ కూలినాలి చేయలేక పోయింది. **'ఉంటనో సస్తనో బిడ్డా! ఇగ మనుండంగ నీ పెళ్లి చూసి పోత'**నుకుంట మేనమామ బిడ్డ విజయమ్మతో లగ్గం చేసింది. (పుట సంఖ్య–49). ఇలా స్వచ్ఛమైన ప్రజల భాషలో రాయబడం వల్ల కథలకు మరింత సహజత్వంకలిగింది.

**అలంకార ప్రయోగం :** కవిత్వమైనా, కథయైనా, నవలయైనా, కావ్యమైనా అలంకార ప్రయోగం ఉన్నప్పుడే మరింత సోయగాన్ని సంతరించుకొని పాఠకుల హృదయాలకి హత్తుకుంటుంది. అలంకార ప్రయోగం లేకుండా ఏ రచన కూడా పది కాలాల పాటు మనుగడ కొనసాగించలేదు. ఈ కథల్లో భద్రయ్య అనేక అలంకారాలను ప్రయోగించి కథలకు మరింత రసపుష్టిని కలిగించాడు. మచ్చుకు కొన్ని అలంకారాలు –

1. తోడేలు కలలకొచ్చిన మేక పిల్లోలె గజగజ వణికింది ( పుట సంఖ్య–6)

2. ఆడు చూపులకు ముల్లేసుకునిసూస్తడు (పుట సంఖ్య–7)

3. ఆకలున్న పెద్దపులికిఅలిసిపోయిన జింక దొరికినట్టు (పుట సంఖ్య–7)

4. నిప్పుల మీదకూసున్నట్టనిపించింది (పుట సంఖ్య–7)

5. చెట్టుకిసిరిన రాయికి పిట్టలోలిగ (పుట సంఖ్య–13)

6. అహంకారంతోఉన్న వాళ్ల తుపాకులు మోగినై (పుట సంఖ్య–17)

7. బంచెరాయిపైకన్నీటానకురిసింది (పుట సంఖ్య –18)

8. ఆ దీపపు కాంతిలో రాఘవయ్య సారు నవ్వులలో నిస్వార్థపు అడుగుల ఎలుగులున్నట్టనిపించింది (పుట సంఖ్య–26)

9. అయికూడా యమునలాగే గాలికి అందంగా నవ్వుతున్నై (పుట సంఖ్య–29)

10. వాటి తలలు గాలికి ఊగుతూ పిలుస్తున్నట్టనిపించింది (పుట సంఖ్య –29)

11. గాబుల నీళ్లల్ల ఎర్రసంచి పాపని పాపంలా తేలుతూ కనిపించింది (పుట సంఖ్య–34)

12. మీనాక్షి అందమైన ముఖం అక్కడున్న వ్యక్తుల అంతర్ముఖాల్లాగా క్షణాల్లో వికారంగా మారింది (పుట సంఖ్య–104)

ఇలా రచయిత సందర్భోచితంగా ప్రయోగించిన అలంకారాలు రచనాశైలికి మరింత సౌందర్యాన్ని తెచ్చిపెట్టాయి.

**ముగింపు :** 'లొట్టపీసు పూలు' కథా సంపుటిలోని కథలన్ని,ఆయా సమస్యలకు అద్దం పడుతూ, పాఠకులను ఆలోచింపజేసే విధంగా ఉన్నాయి. అట్టడుగు వర్గాల అస్తిత్వాన్ని నిలబెట్టడం కోసం, వారిని మరింత చైతన్యపరిచేటట్లుగా ఉన్నాయి. కథ పరమోద్దేశ్యాలైన మానసికానందంతో పాటు, చక్కని సందేశాన్ని కలిగిన కథల్ని కథాసాహిత్యంలో అస్తిత్వ పతాకలుగా ఎగిరేసిన మిత్రుడు శీలం భద్రయ్యకు హృదయపూర్వక అభినందనలు.

## ముత్యాల హారాలు


కోపమున ఊగిపోకు
దురాశకు లొంగిపోకు
భీతికి పారిపోకు
విచక్షణ మేలు నీకు

ఉచితాలతో ప్రజలు
అయ్యారు సోమరులు
బుద్ధిమాంద్యం ప్రజలు
అడగలేరు ప్రశ్నలు

పనులకు ప్రోత్సాహము
శ్రమకు తగ్గ ప్రతిఫలము
సామాజిక న్యాయము
నాయకులారా ఒసగుము

ఆత్మాభిమానము నీకు
ఉంచుకో కడవరకు
ఎవరికీ అమ్ముడు పోకు
లంచానికి దుష్టులకు

**చైతన్య భారతి పోతుల**
హైదరాబాద్, ఫోన్ : 701326 4464



# మార్గపరిమళం - దేశి వైభవాల 'విభక్తి ప్రపత్తి'

**డా. కాచాపురం దుర్గాదేవి,** నర్సాపూర్, ఫోన్ : **789 309 3495**

తెలుగు సంస్కృతసాహితీ సాంస్కృతిక సంస్థల నిర్వాహకుడిగాను రూపకాల్లో శ్రీ కృష్ణదేవరాయలుగా, తిమ్మరుసుగా, మహేంద్రునిగా కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగా అభినయంలోను వందలాది కవి సమ్మేళనాలలో కవితాగానం చేస్తూ పద్య కవితా ఉద్యమానికి సారథ్యం వహిస్తున్నవారు మరుమాముల దత్తాత్రేయశర్మగారు.

**పురాణమిత్యేవ నసాధు సర్వమ్**
**నచాపి కావ్యమ్ నవ మిత్యవద్యమ్**
**సంతః పరీక్ష్యాన్యతరత్ భజంతే**
**మూఢః పర ప్రత్యయనేయ బుద్ధిః - మహాకవి కాళిదాసు**

పాతదంతా పనికిరానిదని అనుకోగూడదు. కొత్తదానిని చాలా గొప్పగా ఉన్నదని కూడా భావించవద్దు. విజ్ఞులయిన వారు పరీక్షించి దేనిలో నుండయినా గొప్పదనాన్ని గుర్తించగలుగుతారు అంటాడు మహాకవి కాళిదాసు మాళవికాగ్నిమిత్రమ్‌లో. ఈ శ్లోకాన్ని ఆకళింపు జేసుకున్న ఫలితమే విభక్తి ప్రపత్తి ఉదాహరణ కావ్య రచన అనిపిస్తుంది.

సాగర గర్భంలో దాగిన ఆణిముత్యాన్ని వెలికి తీసినట్లు ప్రాచీన ప్రక్రియలో శ్రేష్ఠమైన ఉదాహరణ కావ్యాన్ని నేటి సాహితీ ప్రియులకు అందించారు.

ప్రాచీన సాహిత్య ప్రక్రియలలో విలక్షణమైనది అరుదైనది మార్గ దేశీ పద్ధతుల మేళవింపులయిన ఉదాహరణ కావ్యాలు ఎన్నో ప్రక్రియలకు మూలపురుషుడయిన పాల్కురికి సోమనాథుడు ఈ ఉదాహరణ కావ్యానికి మూల పురుషుడు. వీరు రచించిన శ్రీ బసవేశ్వరోదాహరణమే తెలుగులో మొదటి ఉదాహరణ కావ్యం.

ఉదాహరణ కావ్యాలు స్తుతి రూపకాలు పాడుకోవడానికి వీలుగా ఉంటాయి. ఇందులో సంబోధనతో కలిపి ప్రతి విభక్తి ప్రత్యయానికి గణబద్ధమైన ఒక వృత్తం మాత్రాబద్ధాలయిన ఒక కళిక ఒక ఉత్కళిక ఉంటాయి. కవి ఉద్దేశించిన దేవతా నామముతో ప్రథమా విభక్తిలో మొదలై క్రమంగా ఒక్కొక్క విభక్తిలో మొదట వృత్తపద్యం ఉండి కళిక ఉత్కళిక అనే పేరుగల గేయరూపాలను పోలిన రగడలు ఉంటాయి. కళిక ఉత్కళికలు పాడుకోవడానికి అనువుగా త్రిశ్ర చతురస్ర ఖండ మిశ్ర సంకీర్ణ గతులలో సాహిత్యం ఉంటుంది. చివరన తప్పనిసరిగా వృత్తపాదాలలో అన్ని విభక్తి ప్రత్యయాలతో కూడిన సార్వవిభక్తిక వృత్తం, కవి పేరును ఉదాహరణం పేరును తెలిపే కవి నామాంకిత వృత్తం ఉంటాయి.

సద్దలి పద్దలి విద్దళి ఉత్పుల్లకము ఈ నాలుగు తెగలు అభివృద్ధి చెంది చివరకు ఉదాహరణముగా ఏర్పడినదని త్రిపురాంతకోదాహరణం పీఠకలో నిడదవోలు వేంకటరావు గారు అన్నట్లు కావ్యాలంకార సంగ్రహంలో చెప్పబడింది. విభక్తి ప్రపత్తి కావ్యకర్త మరుమాముల దత్తాత్రేయశర్మ గారి దీక్షాగురువులయిన మదనానంద సరస్వతీ యతీంద్రుల స్తుతికావ్యము. ఇది ప్రధానంగా ఆధ్యాత్మిక కావ్యమే అయినా కవి సామాజికాంశాల నెన్నింటినో స్పృశించడం వలన కావ్యానికి కొత్తదనం చేకూరింది.

**"సద్భావముదయించి స్వార్థము దొలగించి..."**

**"స్పర్థావర్ధితమైన లోకమునకున్ శాంతిన్ ప్రసాదించగన్...."**

**"వ్యర్థాకాంక్షల దేలు మాయువతకున్ త్యాగైక తృప్తిన్మనన్...."**




**"మితిలేని వ్యామోహ మతి దిద్దు కొరకునై...."**

మొదలయిన పాదాలు గొప్ప సామాజిక చింతన గల వారిగా కవిని నిలబెడుతున్నాయి. ఒకచోట **"మదిన్ కేవల మోహముల్ మలిగె కీర్త్యపకీర్తుల చింత దీరె"** అంటారు కవి. ఇవి కవి వ్యక్తిగత నివేదన వలెనే కాకుండా కీర్తి కాంక్షాపూరితమైన నేటి సమాజానికి చింతలకు గల కారణాలను విశ్లేషిస్తాయి.

కావ్య ప్రారంభంలో **"ప్రణవార్థ తత విదుడై"** అంటారు కవి. "ఓం ఇత్యేకాక్షరం బ్రహ్మ'' అన్న సూక్తి ననుసరించి యతీంద్రుల వారు బ్రహ్మజ్ఞాని అని అర్థమయేలా తెలుపడం కవి కవన శక్తికి మచ్చుతునక. అంబలేని సాంబశివుని అన్నదాన వ్రతుని గూర్చి.....అని అంటారు. సాంబశివు డనగా అంబతో కూడిన శివుడని భావము. మదనానంద స్వామి వారు యతివరులు కనుక అంబలేని సాంబశివుడనడం ఔచిత్యవంత మయినది.

**ధర్మకేతనమెత్తి నిలిచిన**

**ద్వైతమెరుగని దార్శనికుడు** – ధర్మోరక్షతి రక్షితః వివాదాస్పదమవ్వని వేదసూక్తి జాతిమత ప్రాంత కాల భేదాలకు అతీతంగా అనుసరించదగిన ఉత్కృష్టమార్గం. అటువంటి ధర్మాన్ని కేతనంగా ఎత్తినిలిపాడంటారు కవి.

**"తాపములారును తపనలు దీరును"** అంటారు. సాధారణంగా తాపములారుతయనే భావం స్ఫురించినప్పటికీ ఆరును సంఖ్యావాచకం గా భావించినట్లయితే తాపములతోబాటు అరిషడ్వర్గాలయిన కామక్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు తొలుగుతాయనే విషయం స్పష్టమవుతుంది. ఇటువంటి గొప్ప ఆలంకారిక శైలితో రచించబడిన కావ్యమిది.

క్లిష్ట పదబంధాలతో అదుపు లేకుండా వృత్తాలను నడిపినధార రగడలలో సరళమై మనోహరమై కావ్యంలో ఒదిగిపోయిన కవి రచనా శైలి పాఠకులను ప్రత్యేకంగా ఆకర్షిస్తుంది. **"వార్షుకాభ్రు వాక్రుసిద్ధు" "తత్వగమ్యు దగ్ధకాంక్షు"** వంటి పదబంధాలే కాకుండా –

**"మెతుకునిచ్చి బతుకునిచ్చు**
**మెతుకు సీమ యతిని గూర్చి"**

**"కోటి లింగపు మేటి గుడులను**
**పేట కొక్కటి ప్రీతి నిలిపిన"** మొదలయిన పంక్తులలోను పత్రి సంబరము, గోరంత కొండంత వంటి పదాలతోనూ అంతటి సరళతనూ సాధించారు. కొంగుబంగరువంటి జాతీయలూ పాఠకులను అలరిస్తాయి.

మహాయోగి మహాత్యాగి శ్రీమదనానంద సరస్వతీ స్వామి అను శీర్షికతో మరుమాముల దత్తాత్రేయ శర్మ గారు అందించిన వేల ఏండ్ల చరిత్ర గల బసవ కళ్యాణ్ మఠం చరిత్ర పీఠాధిపతుల పరంపర వివరాలు ఈ కావ్యనాయకుడు కృతిపతి అయిన శ్రీశ్రీశ్రీ మదనానంద సరస్వతీ యతీంద్రుల జీవిత విశేషాలు ఆధ్యాత్మిక వేత్తలను యతీంద్రుల వారి శిష్యులను ప్రశిష్యులను అమితంగా ఆకర్షిస్తాయి.

**విభక్తి ప్రపత్తి నివేదనా మాధుర్యం** పేరుతో డా॥ సంగనభట్ల సరసయ్యగారు ఉదాహరణ కావ్య లక్షణాలను ప్రత్యయాలు పలు వ్యాకరణాంశాలను ఉటంకిస్తూ అందించిన అభిప్రాయం చిరు కావ్యానికి పెద్ద యోగ్యతను సమకూర్చింది.

**ఉదాహరణ కావ్యములు లక్షణములు – భూమిక** అను శీర్షికతో వ్యాసాన్ని ఆచార్య వి.ఎల్.ఎస్. భీమశంకరం గారు ఈ కావ్యానికి అనుబంధంగా అందించారు. సోదాహరణంగా సమగ్రంగా అందించిన ఈ వ్యాసం ముందుముందు ఉదాహరణ కావ్యం రాయాలనుకునే కవులకు మార్గదర్శిలా ఈ పుస్తకాన్ని నిలిపింది.

ఈ కావ్యంలో వాడిన వృత్తాలు రగడ విశేషాలను గణాల సంఖ్య మాత్రల సంఖ్య యతిస్థానం మొదలుకొని పూర్తి స్థాయి వివరణలను మరొక అనుబంధంగా చేర్చడం వలన కొత్తగా ఉదాహరణ కావ్యాన్ని అధ్యయనం చేయాలనుకునే వారికి ఈ పుస్తకం ఉపయుక్తంగా ఉంది.

శతక సాహిత్యం మొదలయిన ప్రక్రియలు దైవ పరమయిన స్తుతులుగా ప్రారంభమై కాలానుగుణంగా వస్తుపరంగా ఎన్నో మార్పులు చెందినట్లుగానే ఉదాహరణ కావ్యం కూడా దైవస్తుతి నుండి మానవ పరమైన ఇతివృత్తంగా వస్తుపరంగా మార్పు చెందింది.

పద్యకవిత వచనకవిత గేయకవిత సమాంతరంగా వెలువడుతున్న నేటి సాహిత్యంలో రాగ సంగీత భరితమై గాయకులు రెండు వర్గాలుగా మారి గేయ భాగాలను పోటీ పడుతున్నట్లుగా పాడడం వలన ఈ ప్రక్రియ ప్రదర్శనకు అనుకూలమైనది. విభిన్నమైన ఈ ప్రక్రియలో సామాజిక చైతన్యానికి అనుగుణమైన వస్తువులను స్వీకరించేలా పద్యకవుల నుండి నేటి వాగ్గేయకారుల నుండి రచనలను ఆశించడం భావ్యమే అవుతుంది.

ఆధునిక ప్రక్రియలు అసంఖ్యాకంగా వస్తున్న నేటి తరుణంలో సంస్కృతంలో కొన్ని మూలాలు ఉన్నప్పటికీ మరే ఇతర భారతీయ భాషలలో లేని అరుదైన సాహిత్య ప్రక్రియను ఎన్నుకున్న మరుమాముల దత్తాత్రేయ శర్మ గారు నూతన ఒరవడికి నాంది పలికినట్లుగా భావించవచ్చు.

## ప్రేమకిషోర్ స్మారక కవితా పురస్కారం – 2021 కి ఆహ్వానం

.......................................

ప్రముఖ కవి, గేయ, నాటక రచయిత రావినూతల ప్రేమకిషోర్ స్మారక కవితా పురస్కారం – 2021కు కవుల నుంచి కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు జానుడి – సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ నూకతోటి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారానికి ఎంపిక చేసిన కవికి రూ. 2,116 లు నగదు బహుమతి, దుశ్శాలువ, ప్రశంసాపత్రాలను బహూకరిస్తారు. కవులు ఈ పురస్కార ఎంపిక కోసం 2019–21 మధ్య వెలువరించిన వారి కవితా సంపుటులను మూడు కాపీలను 'ప్రేమ్‌కిషోర్ కవితా పురస్కారం – 2021, జానుడి – సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్, డాక్టర్ మల్లవరపు రాజేశ్వరరావు భవన్, శ్రీనగర్ కాలనీ, మొదటి లైన్, ఒంగోలు, ప్రకాశం జిల్లా – ఆంధ్ర ప్రదేశ్ – 523 001 కు సెప్టెంబర్ 25వ తేదీ లోపు పంపాలి. మరిన్ని వివరాలకు 98481 87416 నంబరులో సంప్రదించవచ్చు.

# గిరిజనుల బతుకు చిత్రం "బంజారా నానీలు"

**వి. వింధ్యవాసినీ దేవి,** సహాయాచార్యులు, కె.వి.ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాల, కర్నూలు, ఫోన్ : 77

తెలుగు సాహితీవనంలో బంజారా సంస్కృతీ సంప్రదాయాల పరిమళాలను వెదజల్లుతున్న రచయిత్రి ఆచార్య సూర్యాధనంజయ్. రచయిత్రిగా, సాహిత్య విమర్శకురాలిగా, ఆచార్యులుగా సుప్రతిష్ఠితులైన వీరు బంజారాల అస్తిత్వాన్ని పదిలంచేసే దిశగా రచనలను వెలువరిస్తున్నారు. అడవి బిడ్డల ఉనికిని సాహిత్యం ద్వారా రికార్డు చేస్తూ అటు సాహిత్యానికి, ఇటు చరిత్ర, సంస్కృతులకు ఇతోధికంగా దోహదం చేస్తున్నారు. **'నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం-జీవనచిత్రణ'** పరిశోధక గ్రంథం, **'తాంగ్డీ', 'గమనం' వ్యాస సంపుటులు, "గోర్ బంజారా ఆన్ ఎన్‌డ్యూరింగ్ ట్రైబ్"** ఆంగ్ల గ్రంథం, **'బంజారా నానీలు'** గిరిజనుల జీవితాలకు సంబంధించిన అనేక కథలు రచించారు. ఇలా అనేక ప్రక్రియల్లో బంజారాల వాణిని సమర్థవంతంగా వినిపిస్తున్నారు. గిరిజనుల చైతన్య స్వరంగా నిలిచిన ఆచార్య సూర్యా ధనంజయ్ బంజారాల బతుకుచిత్రాన్ని తన రచనల్లో యథార్థంగా అభివ్యక్తం చేస్తూ జగద్విదితం చేస్తున్నారు. "బంజారానానీ"ల్లో తండా ప్రజల జీవనవిధానాన్ని దృశ్యమానం చేస్తూ, నేటి వేగవంతమైన జీవనవేగానికి ఉనికిని కోల్పోతున్న 'తండాల' అస్తిత్వాన్ని ఆవేదనాభరితంగా అక్షరీకరించారు. నాగరిక సమాజానికి దూరంగా, అడవుల్లో, కొండకోనలలో నివసించే గిరిజనుల ఆచార సంప్రదాయాలు, సాంస్కృతిక అస్తిత్వం, అలవాట్లు, వేషధారణ, తండావాసుల అమాయక మనస్తత్వాన్ని ఎంతో హృద్యంగా కవిత్వీకరించారు. స్త్రీల పట్ల వివక్ష, ఆడపిల్లల అమ్మకాలు, నిరక్షరాస్యత, పేదరికం, వలసలు, వితంతువుల దుర్భర జీవనం, మూఢనమ్మకాలు మొదలైన సామాజికాంశాలను, సామాజిక పరిణామాలను ఈ నానీలలో వెల్లడించారు. **"వారి చరిత్ర / ఎంతో ఘనమైనది / ఏ మహాకవి / దృష్టి పడాలో!"** అంటూ ఘనమైన వారి చరిత్రలోని కొన్ని అపురూప సన్నివేశాలను పాఠకుల ముందుంచారు. మాతృభాష పట్ల నిండైన మమకారం కవయిత్రి సొంతం. ఉపాధి నిమిత్తం ఎన్ని భాషలు నేర్చి, ఎంత ఎత్తుకు ఎదిగినా తన మాతృభాషనే తన శ్వాసగా చెప్పుకోవడాన్ని గమనించవచ్చు. **"బంజారా భాష/ నా హృదయ శ్వాస/ కాలమెంత మారినా/ అపురూపం నా యాస"** అని గర్వంగా మాతృభాషను గౌరవిస్తూ, ప్రతి ఒక్కరూ మాతృభాషను మరచిపోకూడదన్న సూచన చేశారు. సూర్యా ధనంజయ్ తండాను వీడి చాలా కాలమైనా, నేటికీ బంజారా భాషకు అగ్రతాంబూలం ఇవ్వడాన్ని గమనిస్తే భాష పట్ల వారికున్న అచంచలమైన అనురక్తి ద్యోతకమవుతుంది.

పరిణామశీలత కలిగిన కాలగమనంలో, ఎన్నో మార్పులకు లోనవుతూన్న ఇతర సామాజిక వ్యవస్థలతో పాటూ బంజారా తండాల రూపురేఖలు సైతం మారుతున్నాయి. బంజారాల జీవనవిధానంలోనూ ఎన్నో మౌలిక మార్పులొస్తున్నాయి. ఒకప్పటి తండాలు (బంజారాల నివాస గ్రామం) విచ్ఛిన్నమవుతూన్న సందర్భాన్ని వ్యక్తీకరిస్తూ **"నాగరికతారణ్యంలో/తప్పిపోయావు/ ఓ నా తండా/ నీ ఆనవాళ్ళెక్కడ?"** అని ప్రశ్నించారు. అభివృద్ధి, నాగరికత, పట్టణీకరణ పేర్లతో కనుమరుగవుతున్న తండా ఆనవాళ్ళను ఈ నానీలో అన్వేషిస్తున్నారు. సమాజం ఎంత అభివృద్ధిబాటలో పయనించినా తమ జాతి మూలాలను మరవకూడదన్న సూచన వ్యక్తమవుతుంది పై నానీలో. ప్రపంచీకరణ వరదలో పల్లెలూ, పట్నాలే కాక తండాలు సైతం మునిగిపోతున్నాయన్నది కఠోరవాస్తవం. ఈ వాస్తవాన్ని గూర్చి చెబుతూ **"ప్రపంచీకరణం/దేనిని వదల్లేదు/ఆఖరికి/తండా సంస్కృతిని కూడా"** అంటారు.

తండావాసుల అస్తిత్వ ఆనవాళ్ళను పట్టించే అంశం వారి ప్రత్యేక వస్త్రధారణ. బంజారా మహిళల వస్త్రధారణ విలక్షణంగా ఉండి ఆకట్టుకుంటుంది. **"ఆమె కదిలచ్చే / కళాఖండం/ ఆ డ్రస్సు కుట్టిన/ యాడిని మొక్కాలి", "రంగురంగుల/పేట్యా టుక్రీలు/అందాల అల్లికకు/ అమ్మ ఇచ్చిన రూపాలు"** అంటూ వారి వస్త్రాల అందాన్ని కవిత్వీకరించారు. ఈ వస్త్రాలను తయారుచేసే ఫ్యాషన్ డిజైనర్లు గిరిజన మహిళలే కావడం విశేషం. ఎంతో ఆకర్షణీయమైన కాళీ (బంజారాల రవిక) పేట్యా (ఘాగ్రా) వస్త్రాలు ఆధునిక జీవనశైలిలో కనుమరుగై ఆ స్థానాన్ని చీర సొంతం చేసుకుందని **"తండా కూడా / నాగరికం నేర్చుకుందే! / కాళీ, ఫేట్యాలను / చీర ఎత్తుకెళ్ళింది"** అంటారు. వారి సంప్రదాయ అస్తిత్వానికి చిహ్నమైన వస్త్రధారణ నేడు ఫ్యాన్సీ డ్రస్సుగా మారిందనీ, అయినా అది వారి సంప్రదాయంలో పేరిన మీగడ వంటిదేనన్న భావన వ్యక్తం చేశారు. తండాల సంస్కృతిని కాపాడాలన్న కవయిత్రి తపన ఈ నానీల్లో వ్యక్తమవుతుంది.

జనావాసాలకు దూరంగా అటవీప్రాంతాలలో ప్రశాంత జీవనం సాగించే తండావాసులకు తగిన జీవనోపాధి లేక వలసల బాట పట్టడాన్ని ఎత్తిచూపుతూ **"గుడ్ల నిండా కన్నీళ్లతో/వీడుకోలు/ఆమె పయనం / పూనా, బొంబాయి వైపు"** అంటూ గిరిజనులు వలస పక్షులుగా మారి, బుక్కెడు బువ్వ కోసం సరిహద్దులను దాటి మహా నగరాలకు వలసపోతున్న విషయాన్ని హృద్యంగా తెలియపర్చారు. అంతేకాకుండా **"గిరిజనుడికి రెక్కలే/ పెట్టుబడి/ అందుకే/ వలసల అలజడి"** అంటూ గిరిజనుల శ్రామిక మనస్తత్వాన్ని, వారి బతుకు వెతలను యథార్థంగా ఆవిష్కరించారు. కల్మషమెరుగని గిరిజన వాసులను, వారి అమాయకత్వాన్ని, అవసరాలను ఆసరాగా చేసుకొని కొన్ని ఔషధ కంపెనీలు తమ ఉత్పత్తులకు ప్రయోగశాలగా

వాడుకుంటారన్న చేదు నిజాన్ని విశదపర్చారు. **"బతుకుయుద్ధంలో/ చిలకమ్మ ఓడింది/గెలుపు మాత్రం/ఓషధ కంపెనీలదే".** చిలకమ్మ ఓ ఔషధ కంపెనీ జరిపిన ప్రయోగ పరీక్ష వికటించి మరణించిన అభాగ్యురాలని, ఇలాంటి వారెందరో దోపిడీదార్ల కుట్రలకు బలౌతున్నా సమాజం చేష్టలుడిగి చూస్తున్నదన్న ఆవేదనను వ్యక్తపరిచారు. **"తండా చిమ్మ చీకట్లో /కొట్టుమిట్టాడుతుంది / చిరుదీపం / వెలిగించేదెపుడో!"** అంటూ అనేక మూఢనమ్మకాల ముసుగులో నేటికీ అజ్ఞానమనే చీకటిలో నడుస్తున్న వారి జీవితాల్లో జ్ఞానకాంతులను ప్రసరింప జేయాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు.

**"ఊరికి దూరమే / కావొచ్చు తండాలు/ కానీ గుండెలకెప్పుడూ/ దగ్గరే"** తండా ప్రజల గుండె చప్పుడును వినిపిస్తున్నారీ నానీలో. ఎన్ని తరాలు మారినా, ఎన్ని యుగాలు కాలగర్భంలో కలిసిపోయినా మనిషి అంతరంగంలోని ఇంకిపోని నీటిచెమ్మను ప్రతిబింబిస్తుంది ఈ నానీ. **"ఆ తండా నిండా/వితంతువులే/ మద్యంచెట్లకు వేలాడే / జీవచ్ఛవాలే"** మద్యం గిరిజనుల జీవితాల్లో విషాదానికి కారణ మవుతున్న వైనాన్ని తెలుపుతుంది ఈ నానీ. ఆడపిల్లల పట్ల చూపించే తీవ్రమైన వివక్షను ఖండిస్తూ **"నోట్లో సారా చుక్కేసి/ఆడశిశువును చంపేస్తారా/తండాలకు/గుండెలేదా!"** అని ప్రశ్నించారు. తండావాసుల జీవితాలను ప్రతిబింబించే అనేకాంశాలు బంజారానానీలలో చోటు చేసుకొని బంజారాల సమగ్ర జీవనచిత్రాన్ని కళ్ళ ముందుంచాయి.

బంజారాల బతుకుపయనంలో ఎదురయ్యే సుఖదుఃఖాలను, కష్టసుఖాలను, మంచిచెడులను మొత్తంగా సమకాలీన సమాజంలో బంజారాల స్థానాన్ని యథార్థదృష్టితో అభివ్యక్తం చేస్తూ బంజారా నానీలను రచించారు ఆచార్య సూర్యాధనంజయ్. ఈ నానీల్లోఎక్కడా పదాడంబరాలు కానీ, వృథామాటలు కానీ, అతిశయోక్తులు కానీ, ఊహాచిత్రాలు కానీ కనిపించవు. ఎంతో సహజంగా తన కళ్ళెదుట కనిపిస్తున్న సంఘటనలనే నానీలుగా కవిత్వీకరించారు. **"గుట్టలుగా పోసిన / జ్ఞాపకాలు/ ఏరుకుందామంటే / ఏదీ దొరకదు"** – అంటూనే మదిలో మెదులుతున్న ఎన్నో జ్ఞాపకాలకు ఊపిరిపోస్తూ బంజారా నానీలను వెలువరించారు. ఒక సనాతన సంస్కృతిని బతికించే ప్రయత్నం చేశారు. కాళీ, పేట్యా, టుక్రీ, ధావ్లో, నౌలేరి, బాటీ, భాజీ, యాడి, లాప్సీ, వాంక్డీలు, తీజ్‌తేవార్ తదితర బంజారా భాషాపదాలను వాడటం వలన ఈ నానీలు మరింత ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

నానీల నాన్న ఆచార్య ఎన్.గోపి గారు రాసిన 'మట్టిపుష్పాలు', ఆచార్య మసన చెన్నప్ప గారు రాసిన 'బలమైన బంజారా కవయిత్రి' ముందుమాటలు పుస్తక ప్రాధాన్యతను వెల్లడిస్తాయి. ఆచార్య గోపీగారు ముందుమాటలో **"ఆమె స్వయంగా బంజారా పుత్రిక.అందుకే ఈ నానీలు ఇంతగా పండాయి. గోరింటాకుతో కాదు, రక్తసంబంధంతో"** అని పేర్కొన్న ఈ కవితాత్మక వాక్యాలు పుస్తకవిశిష్టతను చాటు తున్నాయి. ఆచార్య సూర్యాధనంజయ్‌ను పుష్కలమైన సామాజికస్పృహ కలిగిన కవయిత్రిగా "బంజారానానీలు" నిలుపుతాయి. సహృదయ పాఠకుల ముందు నాగరిక సమాజానికి సమాంతరంగా కొనసాగే ఆదివాసీల జీవనపుటలను తెరిచి చూపుతాయి. 74 పుటలతో ఉన్న బంజారానానీలు తొలిముద్రణ 2013. అనతికాలంలోనే అశేష పాఠకాదరణ పొంది 2019లో పునర్ముద్రణ పొందింది.

## ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం 2021 కి సాహిత్య విమర్శనా గ్రంథాలకు ఆహ్వానం

.......................................

అభ్యుదయ రచయితల సంఘం, వరంగల్లు శాఖ ప్రతి సంవత్సరం వేరువేరు సాహిత్య ప్రక్రియలకు ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు సాహిత్య పురస్కారం ప్రదానం చేయుట తెలిసినదే. 2021 సంవత్సరంనకు గాను విమర్శ ప్రక్రియకు ఇవ్వడానికి నిర్ణయించనైనది. కావున తెలుగు సాహిత్య విమర్శనా గ్రంథాలనులి పోటీ కి ఆహ్వానిస్తున్నాం

విమర్శ గ్రంథాలు జూలై 2017 నుండి జూన్ 2021 మధ్యలో ముద్రణ పొంది ఉండాలి.

ప్రథమ ముద్రణలు మాత్రమే పంపాలి.

వేరువేరు రచయితల వ్యాసాల సంకలనాలు పంపరాదు.

రచయితలు యే ప్రాంతం వారైనా పంపవచ్చు.

తప్పని సరిగా మూడు ప్రతులు పంపాలి.

తెలుగు సాహిత్య విమర్శనా గ్రంథాలు అందవలసిన చివరి తేదీ 30/09/2021


**పంపవలసిన చిరునామా :** బూర భిక్షపతి, ఇం. నెం.2 – 12 – 293/20, విజయ నగర్ కాలనీ, గోపాల్ పూర్ రోడ్డు, హన్మకొండ 506009

ఎంపికైన విమర్శ గ్రంథకర్త కు రూ5000/– నగదు, శాలువా, మెమెంటో లను నవంబర్‌లో జరుగు ప్రత్యేక కార్యక్రమంలో హన్మకొండ నందు అందజేయబడునని అ.ర.సం. వరంగల్లు శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిధి, డా. పల్లేరు వీరాస్వామి తెలిపారు. వివరాలకు చరవాణి నం. 9701000306 , 9441602605, 9866612717లలో సంప్రదించగలరు.

## స్వీ'కృతి'




**తెలంగాణ సాహిత్య విమర్శ చరిత్ర**
ఆచార్య ఎస్వీ రామారావు
వెల : 60/-
**ప్రతులకు :** నవచేతన పబ్లిషింగ్ హౌస్, 12-1-493/ఏఎ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), జి.ఎస్.ఐ. పోస్ట్, హైదరాబాద్ - 500 068. ఫోన్ : 040 - 29884453/54




**అక్షర తపస్వి - అక్షర గవాక్షం (80 వసంతాల సౌరభాలు)**
ఆచార్య ఎస్వీ రామారావు జీవిత వాఙ్మయ సూచిక
**ప్రతులకు :** శ్రీమతి ఎస్. స్వయంప్రభ, ఫ్లాట్ నెం. 205, సాయిబాలాజీ రెసిడెన్సీ, చిత్ర లే అవుట్, ఎల్.బి.నగర్, హైదరాబాద్ - 500 074.




**సురవరం మొగ్గలు**
సంపా : డా. భీంపల్లి శ్రీకాంత్
**ప్రతులకు :** పాలమూరు సాహితి, ఇం.నెం. 8-5-38, టీచర్స్ కాలనీ, మహబూబ్ నగర్.
ఫోన్ : 903 284 4017




**భారతీయ సాహిత్య నిర్మాతలు - సి. నారాయణరెడ్డి**
ఎస్వీ రామారావు
పుటలు: 150
వెల : 50/-
ముద్రణ : సాహిత్య అకాడమీ
ప్రతులకు: 'స్వాతి' మందిర్ మార్గ్, న్యూఢిల్లీ - 110 001.
011-23745297/23364204

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

| | | |
|---|---|---|
| 1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి | రూ. | 2875 - 00 |
| 2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము | రూ. | 1200 - 00 |
| 3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు | రూ. | 350 - 00 |
| 4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు | రూ. | 100 - 00 |
| 5. శాసన సంపుటి | రూ. | 150 - 00 |
| 6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతి | రూ. | 100 - 00 |
| 7. షబ్నవీస్ శతజయంతి సంచిక | రూ. | 100 - 00 |
| 8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు | | 90 - 00 |
| 9. త్రిపురాంతక దేవాలయ శాసనములు | రూ. | 75 - 00 |
| 10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర | రూ. | 75 - 00 |
| 11. దేవాలయ వాస్తుశిల్పము | రూ. | 50 - 00 |
| 12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక | రూ. | 50 - 00 |
| 13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక | రూ. | 75 - 00 |
| 14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక | రూ. | 100 -00 |
| 15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక | రూ. | 100 - 00 |
| 16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు | రూ. | 175 - 00 |


## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/**
**బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,**
**బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.**
**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**

# అదృశ్య సోపానం

డా. దామరాజు కామేశ్వరరావు
హైదరాబాద్, ఫోన్ : 9848799648



రూపం రాలిపోతుంది,
తత్త్వమే, ఆకాశంలా ఎప్పటికీ నిలిచిపోతుంది
అందుకే,
ఆయన ఒక తత్త్వం...
పదం మాయమౌతుంది,
భావమే,శబ్ద తరంగాలలో పురుడు పోసుకొని
కనిపించని శ్వాసగాలిలా కదిలిస్తూ ఉంటుంది...
అందుకే,
ఆయన ఒక భావం...

ఆయన,
కాయను ఏనాడూ చూడడు,
అందులో దాగి ఉన్న చెట్టును గుర్తిస్తాడు...
రాయిని ఏనాడూ చూడడు,
అందులో కొలువై ఉన్న అద్భుత శిల్పాన్ని వీక్షిస్తాడు...
చినుకును ఏనాడూ పట్టించుకోడు,
అందులో ఒదిగి ఉన్న సముద్రాన్ని చూస్తాడు...

ఆయన మాట కన్నా
మౌనమే ఒక పాఠం... చేతలే అభ్యాసం...
తన అడుగుల ముద్రలలో
ఎందరికో గమ్యాన్ని చూపించే మార్గదర్శకుడు..
తన నిర్వచనాన్ని ఇతరుల ద్వారా
తానే రాసుకొనే విమర్శకుడు...
ఓంకారంలో విశ్వాన్ని దర్శించే దార్శనికుడు...

అందరి రాతలను రాసే బ్రహ్మకు సైతం
రాతను నేర్పించే అద్భుత అదృశ్య శక్తి ఆయన...
అఖండ విశ్వానికి దిక్కుగా, దిక్కులుగా నిలిచే
అనంత చైతన్య ప్రతిరూపమై
తానొక వ్యక్తినని మరచిపోయిన త్యాగం ఆయన...
తన కింద ఉన్న చీకటిని పారద్రోలలేని
దీపం కాదు ఆయన,
ఏ అంధకారము తనవైపు చూడలేని
ఆదిత్య రూపం ఆయన...

ఆయనే,
గురువు.....

గురువు అంటే...
చదువు చెప్పేవాడు కాదు, బ్రతుకు నేర్పేవాడు...
జీతం ఇచ్చే అర్హతను ఇచ్చేవాడు కాదు,
జీవితానికి అర్థం చెప్పేవాడు...
అక్షరాల రూపంలో అడుగులు నేర్పేవాడు...
ప్రతిపదార్థంతో జీవన పరమార్థాన్ని తెలిపేవాడు...

గురువు అంటే....
భవంతి పైకి వెళ్ళే మెట్టులాంటి వాడు
తన మీద నుండి
పైకి ఎదుగుతున్న వారిని తృప్తిగా చూస్తూ
తను మాత్రం అక్కడే నిలిచిపోయేవాడు...

గురువు అంటే....
మనకు తెలియని మనలోని మనను
మనకు పరిచయం చేసి
విశ్వం అంచులలో నిలిపే
అదృశ్య సోపానం....